అభ్యుదయ

ఆగస్టు 1979

ఒక రూపాయి



సంపుటి 3 1979 అభ్యుదయ ఆగస్టు చందా
సంచిక 8 రు 10

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం

"పంజాబులో మా సోదరులు భరించిన అవమానాలు సర్వత్రా మా హృదయాలలో క్రోధాగ్ని రగిల్చాయి".. రవీంద్రనాథ టాగూరు

(అమృత్‌సర్‌లోని జలియన్వాలాబాగ్‌లో బ్రిటిష్ సైనికులు 1919 ఏప్రిల్ 13 న నిరాయుధులైన ప్రజలపై తుపాకులు కాల్చగా నిరాయుధులైన కొన్నివందల మంది వ్యక్తులు మరణించారు. ఆ దురంతాన్ని ఖండిస్తూ, తనకు గతంలో ఇచ్చిన "సర్" బిరుదును త్యజిస్తూ, రవీంద్రనాథ్ టాగోర్ అప్పటి వైస్రాయికి వ్రాసిన లేఖలో (మే 30, 1919) ఒక భాగం యిది.)

"పంజాబులో మా సోదరులు భరించిన అవమానాలు, పడ్డ బాధల్ని గురించిన వార్తలు సమస్త నిషేధాలను ఛేదించుకొని, నిశ్శబ్దంలో భారతదేశంలోని అన్నిమూలలకు వ్యాపించాయి. అవి సర్వత్రా మా ప్రజల హృదయాల్లో క్రోధాగ్నిని రగిల్చాయి. కాని, దేశ పాలకులు యీ విషయాన్ని పట్టించుకోలేదు... ఈ అవమానకరమైన అసందర్భ సమయంలో గౌరవచిహ్నాలైన బిరుదులు మా అవమానాన్ని మరింత ప్రస్ఫుటం చేస్తాయి. అందుచేత, నేను నా గౌరవ చిహ్నాలన్నిటినీ త్యజించి, నా దేశీయుల సరసన సామాన్యుడిగా నిలబడదలచుకున్నాను. వారు గౌరవహీనులుగా పరిగణింపబడుతూ, మానవుల కనర్హమైన పరాభవాన్ని అనుభవిస్తున్నారు. ఈ కారణాలవల్ల, నేను నా సర్ బిరుదును తప్పనిసరియై త్యజించవలసి వస్తోంది. ఇందుకు అనుమతించవలసిందిగా ఘనత వహించిన తమర్ని వినా రంతోనుగౌరవపురస్సరంగాకోరుతున్నా.

ఆరు దశాబ్దాలనాడే భారత స్వాతంత్ర్య పోరాటాన్ని కీర్తించిన సోవియట్ కవి టిఖొనోవ్

మన స్వాతంత్ర్య సమర చరిత్రలో అత్యంత విషాదకర ఘట్టం జలియన్ వాలాబాగ్. 6 దశాబ్దాలు దాటిపోయినా 1919 ఏప్రిల్‌లో జరిగిన ఘటనలు మన దేశభక్తుల హృదయాలను నేటికీజ్వలింప జేస్తూనే ఉన్నాయి. మన కవులు, రచయితలు పద్యాలు, పాటలు, గేయాలు, నాటకాలు మొ॥ రూపాలలో జలియన్ వాలాబాగ్ ఘటనకు అక్షర చిత్రాలు దిద్దారు.

అయితే దాదాపు 6 దశాబ్దాలక్రితమే-సామ్రాజ్యవాదులు జరిపిన ఆ హత్యాకాండను నిరసిస్తూ ఓ సోవియట్ గేయాలు రచించాడంటే ఆశ్చర్యమే.

ఆయన పేరు నికొలాయ్ టిఖోనోవ్. 1896 లో నాటి పీటర్స్బర్గులో జన్మించి

యువభారత యుగోదయంలో నవభారత మహోదయంలో
పూచిందొక అరుణ తరంగం లేచిందొక క్రాంతి విహంగం
త్యాగోజ్వల మహిమా మండిత రాగారుణ రక్తపతాకం
నవభారత హృదయాంబరమున ప్రసరించిన మహేంద్ర చాపం
చైతన్యం జీవితలక్ష్యం స్వాతంత్ర్యం అంతస్సాక్ష్యం
ప్రాచీదిగ్ దృగంచలంలో రోచిస్సులు చిలికే కిరణం

— కరుణశ్రీ

యీ మధ్యనే ఫిబ్రవరి 8 న 83 సం॥ల వయస్సులో మరణించాడు.

1920 లో రచించిన యీ గేయం పేరు "భారతదేశపు ఏనుగు," విప్లవానంతరం "సామి" అనే గేయంతో సోవియట్ కవిత్వంలో మొట్టమొదటిసారిగా భారతీయ కథావస్తువును ఉపయోగించినదికూడా యీ కవే. "సామి" ఒక బీదబాలుడు. హిమాలయాల వెనుక, ఎంతోదూరంగా ఉన్నదేశంలో 'లెనిన్' అనే వ్యక్తి ఉన్నాడనీ, అయన క్రూరులైన తెల్లపెత్తందార్లను తరిమివేయగలడనీ, వారుపెట్టే బాధలనుంచి తనను తనలాంటి వారిని విముక్తి చేయగలడనీ వింటాడు, ఉత్తేజితుడౌతాడు, నిరాశ చెంది, మరణించాలనుకొన్న ఆ బాలుడికి జీవితంపై ఆశ కల్గుతుంది. ఈ బాలుడే తదుపరి విప్లవ వీరుడిగా పరిణామం చెందుతాడు. ఈ పరిణామాన్ని చిత్రిస్తుంది "భారతదేశపు ఏనుగు" అనే గేయం.

నన్ను కవిగా రూపొందించింది "అక్టోబర్ సోషలిస్టు మహావిప్లవమే" అని అయనే చెప్పాడు.

ఎప్పుడూ ప్రథమశ్రేణిలోనిల్చి పోరాటం సల్పాడు. అంతర్యుద్ధంలో ఎర్రసేనలో సైనికుడిగా, తదుపరి రెండవ ప్రపంచ యుద్ధంలో ప్రచారకుడుగా, విజయానంతరం శాంతిని సంరక్షించడానికి ఏర్పడిన శాంతి ఉద్యమ కార్యకర్తగా.

చనిపోయేనాటికి ఆయన వహిస్తున్న బాధ్యతలు తక్కువేమికాదు - జాతుల సుప్రీం సోవియట్‌కు ఉపాధ్యక్షుడుగా సోవియట్ శాంతి సంఘం అధ్యక్షుడుగా సోవియట్ రచయితల సంఘ కార్యదర్శిగా, ప్రపంచ శాంతిసంఘ గౌరవ అధ్యక్షుడుగా కన్నుమూసేవరకు కృషి చేస్తూనే ఉన్నాడు ! 1957 లోనే, అయనకు లెనిన్ శాంతి బహుమతి లభించింది.

దాదాపు 900 రోజులపాటు నాజీలని నిరోధించిన లెనిన్‌గ్రాడ్ ప్రజల వీరత్వాన్ని కథావస్తువుగా చేసిన గేయ రచన "కిరోవ్ మనతోనే ఉన్నాడు" మణిపూస అని చెప్పాలి. ఆ పట్టణ ప్రజల నాయకుడు కిరోవ్, 1936 లో విద్రోహుల రివాల్వర్‌కు గురియై మరణించారు

1950 లో "పాకిస్తాన్ కథలు", 1956లో "ది వైట్ వండర్ అవ్ కాశ్మీర్" అనే నవలకూడా ఎంతగానో చెప్పుకోదగ్గవి.

—కొట్రుగడ్డ గంగయ్య

సాహిత్యమీమాంస

ప్రశ్న : ఇప్పుడు సాహిత్యంలో ఎక్కువగా వినిపిస్తున్న "అనుభూతి వాదం" అసలు అర్థం ఏమిటి ? ఏ చారిత్రిక పరిస్థితులలో పుట్టింది? తెలుగులోకి ఎలా వచ్చింది? దాని తాత్వికత ఏమిటి?

—వారణాసి విశ్వేశ్వరరావు
విశాఖపట్టణం-3

రాంభట్ల సమాధానం : అనుభూతి వాదం ఇప్పుడు మన రచయితల్లో బాగా ప్రచారం పొందుతోంది. దీన్ని ఇంగ్లీషులో "ఎగ్జిస్టెన్షియలిజం" అంటారు. ప్రపంచంలో పుట్టిన తత్వాలన్నిటి లోకి ఇది అత్యంత "ఆధునిక" తత్త్వం.

రెండు ప్రపంచ యుద్ధాల మధ్య ఇది జర్మనీలో పుట్టింది. ఆంత్రొపొలాగిజం, ఆంత్రొపొమోర్ఫిజం, ఫిలాసఫీ ఆఫ్ లైఫ్, షోపెన్ హోవర్ తత్త్వం వలంటరిజం, వీటన్నిటిలోంచి కొన్నికొన్ని అంశాలు కలిసి ఈ అనుభూతి వాదం తయారైంది.

ఇందులో రెండు కోవలున్నాయి. (1) సేశ్వరానుభూతి వాదం (2) నిరీశ్వరానుభూతి వాదం.

అనుభూతి వాద రచయితల సౌందర్య తత్వానికి సాధారణంగా నిరీశ్వర అనుభూతి వాదం మూలం. దానికి ఒక రూపం యిచ్చినది జీన్ పాల్ సార్త్రె (జా పా సా).

తాత్వికంగా సేశ్వర నిరీశ్వర వాదాలు రెండూ ఆత్మైక భావవాదాలు (సబ్జక్టివ్ ఐడియ లిజం) కాని సార్త్రె దానికి మార్క్సీయ అభివర్గాలని (మార్క్సిస్టు కాటగరీలు) ఫ్రాయిడియన్ మనస్తత్వాన్ని జోడించి "అభ్యుదయ" కవచంతొడిగారు. ఈ కవచాన్ని చూసి సమ్మోహితుడైన శ్రీ శ్రీ మొట్టమొదట తెలుగు సారస్వతంలో మార్క్సు డాలు ఫ్రాయిడ్ ఖడ్గం ధరించి విన్యాసం చేశారు. ఆ నాడు అనుభూతి వాదమని ఆయన పేరు పెట్టకపోయినా తెలుగు సాహిత్యానికి ఈ తత్వాన్ని పరిచయం చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది.

ఈ అనుభూతి వాద అవతరణకు ఏ చారిత్రక పరిస్థితులు దోహదంచేశాయో అది జర్మనిలోనే ఎందుకు అవతరించిందో పరిశీలిద్దాం.

ఫ్యూడల్ వ్యవస్థమీద తిరుగుబాటు కోసం యువ బూర్జువా వర్గం చేపట్టిన ఆయుధాలు రెండు. ఒకటి రాజకీయ ఉదార వాదం (లిబరలిజం) రెండు, విజ్ఞాన శాస్త్ర ప్రగతికి దొహదంచేసిన హేతువాదం (రేషనలిజం), ప్రథమ ప్రపంచయుద్ధానంతరం ఈ రెండూ సంక్షోభంలో పడి విఫల మయ్యాయి.

రాజకీయంగా చేతకానితనానికి చిహ్నమైంది లిబరలిజం. సమాజంలో తలెత్తి భయంకరంగా పెరుగుతున్న అంతర్వైరుధ్యాలకిఎగుడుదిగుడులకి సమాధానం

ఇంటి దొంగ లెవరో ఈ నల్లనంత బేరగాళ్ళు
కరువు తెచ్చి ధరలుపెంచి నొల్లుకొనే నల్లదొంగ
మతాల కావి ముసుగులో గొంతులుకోసే దొంగలు
స్మగ్లర్లు దగాకోర్లు లాలూచీ లంచగొట్లు

—పురిపండా

చెప్పలేకపోయింది హేతువాదం, అందుకని ఒకవిధంగా ఈ రెంటికీ తిరస్కారంగా అవతరించింది అనుభూతి వాదం. ఆనాటి చారిత్రక పరిస్థితులలో వీరికిచ్చిన వాదాలేమిటి?

"మహా పురుష" "(పూర్ణ మానత)" "మహా వీర" సిద్ధాంతాలను ప్రతిఫలించిన వలంటరిజం.

మనిషిగాని అతడి పరిసరాలుగాని, సమాజం గాని హేతువాదానికి లొంగకపోవడం, అర్థంకాకపోవడంవల్ల-ప్రకృతి, సమాజం, చరిత్ర, ఇవేవీ నిర్దిష్టన్యాయాల ననుసరించి నడవడంలేదని, వాటి లక్షణం అహేతుకత (ఇర్రేషనలిజం) అని--ప్రవచించిన షోపెన్ హోవర్ తత్వం — ఫిలాసఫీ ఆఫ్ లైఫ్.

మనిషి ఉనికి అతని ఉద్రేకాల అనుభూతి ద్వారానే వ్యక్తం అవుతుందని భావించినందున ఆ ఉద్రేకాలకు ప్రాముఖ్యం యిచ్చే ఫ్రాయిడ్ తత్వం;

మనిషికే కాదు దేనికీ సంస్కారం అనేది లేదు అంతా ప్రాకృతికమే అని తోచడంవల్ల ఆంత్రోపొలాగిజం, నేచురలిజం, ఆంత్రోపొమోర్ఫిజం వాదాలు;

ఇలా వీటన్నిటి సారాంశంగా అనుభూతి వాదానికి కొన్ని సౌందర్యసూత్రాలు ఏర్పడ్డాయి

(1) మనిషికి సమాజంతోగాని జగత్తుతోగాని, సంబంధంలేదు (2) అతడిలోని ప్రాకృతిక ఉద్వేగాలు, ఉద్రేకాలు నిత్యం, అదే సత్యం (3) ఈ ఉద్రేకాలకు హేతువులేదు - అందువల్ల అహేతుకత సహజం.

మనిషిలోని ఉద్రేకాలను కొన్ని వర్గాలుగా విభజించవచ్చు. భయం, భీతి, కామం, నిర్వేదం, నిస్పృహ, హతాశ వగైరా - ఇదే దాదాపుగా అనుభూతి వాదాల సౌందర్య అభివర్గాలు (ఈస్తటిక్ కాటగరీలు) ఈ ఉద్రేకాల అనుభవాన్ని వ్యక్తీకరించడమే కళా సృజన. జీన్‌పాల్ సార్త్రి ఈ ఉద్రేకానుభవాన్ని మార్క్సిజానికి చెందిన రాసి గుణ న్యాయం ద్వారా(డయలెక్టిక్స్ ఆఫ్ క్వాంటిటీ అండ్ క్వాలిటీ) నిరూపించడానికి ప్రయత్నం చేశాడు. మార్క్సిస్టు అభివర్గం ప్రకారం రాసి గుణాలకు సమన్వయంగా ఒక "మితి" ఉంటుంది. రాసి పెరుగుతూ ఆ "మితి"ని ఉల్లంఘించినప్పుడు అది గుణంగా పరిణమిస్తుంది. ఆ మితి ఉల్లంఘననే లీప్ ఫార్వర్డ్ అని, రివొల్యూషన్ అని పిలుస్తారు. సార్త్రి మతం ప్రకారం ఈ ఉద్రేకాలకు కూడా ఒక మితి ఉంది. ఆ మితి వరకు ఉద్రేకానుభూతికి అస్తిత్వం అంటె ఎగ్జి

ప్రతీప శక్తులు పన్నిన వ్యూహం
బద్దలు కొడుతూ భగ్నం చేస్తూ
ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం
ప్రతిజ్ఞ చేసిన యోధుల్లారా
పదండి పీడిత మానవులారా
పదండి శ్రామిక సైనికులారా —గజ్జెల మల్లారెడ్డి

స్టెన్స్ అని పేరు. ఆ మితిని ఉల్లంఘిస్తే అది అనస్తిత్వం అంటే నాన్ ఎగ్జిస్టెంట్ అవుతుంది.

షొపెన్ హోవర్ - ఈ దశకే బౌద్ధ పదమైన "నిర్వాణం"ను స్వీకరించాడు. సామాన్యుని పరిభాషలో చెప్పాలంటే అది మృత్యువు. అనుభూతి వాదుల లెక్కప్రకారం మనిషి అందుకోదగ్గ అత్యున్నత దశ.

బౌద్ధులు కూడా దాదాపు ఇలాటి తత్వాన్నే చాలా శతాబ్దాల క్రితమే ప్రతిపాదించారు. మనిషి ప్రాకృతుడుగా పుట్టినప్పటికీ అనేక "జన్మల" సంస్కార సంచయం ద్వారా ఉత్త మోత్తముడిగా రూపొందుతాడు. ఒక్కొక్క సుగుణానికి ఒక పరిమితి ఉంది. దాన్ని వారు "పారమిత" అని పిలిచేవారు. ఆ సుగుణం ఆ పరిమితికి చేరిన తరువాత "సీమోల్లంఘన"(వయొలేటింగ్ ది-బోర్డర్ లైన్) జరుగుతుంది. ఆ తరువాత జరిగే గౌణ (క్వాలిటేటివ్) పరిణామమే నిర్వాణం. అయితే బౌద్ధులకి అనుభూతి వాదులకి ప్రధానమైన తేడా ఒకటుంది. బౌద్ధులు ఉత్త మోత్తమ సంస్కారాన్ని పెంపొందించుకోవడాన్నే అనుభూతి అంటారు. అనుభూతివాదులు సకల సంస్కార సన్యాసానంతర కు సంస్కార పారమితే పరమావధి అంటారు అనుభూతి వాదుల మతం ప్రకారం ఉదాత్త లక్షణాలు మనిషి సహజంకావు.కి సకల జంతు సహజమైనవే మనిషికి సహజలక్షణాలు. వాటినుండే మనిషిలో పారవశత కలుగుతుంది. అలా కల్గిన పారవశ్యాన్ని తనకు తోచినట్టు తనకు బావుందని అనిపించినట్టు వ్యక్తీకరించడమే సాహిత్యంలో అనుభూతి వాదం. అనుభూతి పారమితంలో అన్నిటికన్నా చివరిమెట్టు మృత్యువు. బౌద్ధ పరిభాషతో చెప్పాలంటే భయ, నిర్వేద, హతాశ ఇత్యాది "పారమిత"ల ద్వారా నిర్వాణం పొందడం తాత్వికంగా పరమావధి.

ప్రథమ ప్రపంచ సంగ్రామంలో జర్మనీ చిత్తుగా ఓడిపోయింది. పోయిన ప్రతిష్ట సంపాదించుకోవడం కోసం అహేతుక, మహా పురుష అవిర్భావం కావాలన్న వారి కోరిక – అత్యంత మానవమారణ హోమంగా రెండవ ప్రపంచ యుద్ధానికి దారితీసింది. అలాటి పరిస్థితులే ద్వితీయ ప్రపంచ సంగ్రామానికి ముందూ వెనకా ప్రపంచమంతా వ్యాపించాయి. అందువల్ల అనుభూతి వాదం జర్మనీనుండి ఫ్రాన్స్ అక్కడి నుండి అమెరికా అలా బాహ్యప్రదక్షిణ మొదలుపెట్టింది.

ప్రస్తుతం మన దేశంలో ప్రజాస్వామ్యం పెద్దసంక్షోభంలో ఉంది. ఆర్థిక

స్వతంత్ర భారత వర్ష వాస్తవ్యుడా మానవుడు
అర్ధనగ్నంగా ఆకాశాన్ని కప్పుకుని
నిండని కడుపుతో మండుతున్న కళ్ళతో
ఇలా ఎంతకాలం నిలబడతాడు? — శ్రీ శ్రీ

సామాజిక, సాంస్కృతిక, విద్య కళాదిరంగాల్లో సర్వత్రానిండిన సంక్షోభానికి సమాధానం యివ్వడంతో హేతువాదం విఫలమైంది.

ఒక సాహిత్య పద్ధతిని స్వీకరించిన రచయితలందరికి నిర్దిష్ట శాస్త్రీయ భౌతిక వాద ప్రపంచ దృక్పథం ఉంటుందనుకోలేము అందువల్ల చాలమంది రచయితలలో "సకలతత్వ సంకరవాదమూ వ్యష్టివాదం, ఆత్మైక భావవాదం, అయిన అనుభూతి వాదం సులభంగా ఆకర్షించడానికి అనువు ఏర్పడింది ఈ అనుభూతి వాదులలో పీకభోగ వసంతరాయలు ఆవిర్భావానికి ఎదురు తెన్నులు చూచే దశనుండి తామే సదరు ఉద్ధారకులమనే అహంభావ వాదం వరకు పరిణతి చెందినవారు కనిపిస్తారు.

అలాగే మరికొందరు సకలన్యాయ విధ్వంసంనుండి ఆత్మ విధ్వంసం వరకు అభివృద్ధి పొందారు. ఇంకొందరు మార్క్స్యయ అభివర్గాలని మరచిపోయి మత, సాహిత్య మతాల పూనకంలో పడ్డవారూ ఉన్నారు.

సార్త్రె ప్రవచించిన అనుభూతి వాదం నిరీశ్వర వాదం అవడంవల్ల దాన్ని సమర్థించడానికి మార్క్స్యయ పరిభాషను వాడటంవల్ల చాలామంది యువకులుఇదేదో అభ్యుదయ కరమని భ్రమించే అవకాశం ఉంది. కాని తార్కికంగా ఇది భావ వాదం. ఇందుతో ఆత్మైక భావ వాదం అవడంవల్ల గతి తార్కిక భౌతిక వాదానికి శుద్ధ విరుద్ధం, అభూతుకత పీరి పతాకం అవడంవల్ల సమాజానికి సమాజ ప్రగతికి సంపూర్ణవిరుద్ధం. ప్రబోధించిన తత్వం ఏదైనా సాహిత్యానికి సౌందర్యం ముఖ్యం కనుక, పీరి రచనల్లో శబ్ద, అర్థ, భావ సౌందర్యాలు సమృద్ధిగా కనిపించి నందువల్ల యువకులకు ఒక ఆకర్షణ కాగల అవకాశం ఉంది.

కాని అభ్యుదయ వాదులుతమ ప్రణాళికలో నిర్ద్వంద్వంగా పేర్కొనట్టు ఈ "అనుభూతి వాదం" తిరస్కరించదగ్గ క్షీణ వాదాలలో ఒకటి. అది వేసుకున్న సౌందర్యం మేలి ముసుగుగాని, మార్క్సిస్టు పరిభాషా కవచంగాని దాని క్షీణతను దాచలేదు.

అయితే సంక్షోభంలో కొట్టి మిట్టాడుతున్న ఉదారవాద హేతువాదాలకు నిరసనగా పుట్టిన ఈ అనుభూతి వాదం పై వాదాలలోని లొసుగులను, లోపాలను ఎత్తి చూపడంలో ఒక చారిత్రక పాత్ర నిర్వహిస్తుంది. ఆ విధంగా పుట్టిన అపారమైన అనుభూతి వాద సాహిత్యం గెత్తంగా మారి అభ్యుదయ సాహిత్యం ఏపుగా పెరగడానికి దోహదం చేస్తుంది.

తెలుగు సాహిత్యంలో సరికొత్త ధోరణి | రవి |

ఈ మధ్య వివిధ పత్రికల్లో వస్తున్న కవితలూ, కవితా చర్చలూ పరిశీలించిన మీదట ఓ సరికొత్త ధోరణి కవితారంగంలో అడుగుపెట్టినట్టు గోచరిస్తుంది. ఈ ధోరణిని కొంచెం పరిశీలించడం అవసరంగా తోస్తున్నది. ముఖ్యంగా అభ్యుదయ రచయితలకీ, అభ్యుదయ ఉద్యమానికీ ఈ ప్రమాదకరమైన, అదే సందర్భంలో సున్నితమైన ధోరణిని కనిపెట్టి వుండాల్సిన అవసరం ఎక్కువగా వున్నది.

గతంలో పురాణ ప్రచారానికి పనికొచ్చే వస్తువు (Content) ను, గతంలో నిర్ణయించబడిన ఛందస్సుల మూసల్లో రాయబడేదే కవిత్వమనే, ఫ్యూడల్ సాహిత్యపు మూర్ఖ వాదంతో, అభ్యుదయ సాహిత్య ఉద్యమానికి ముఖాముఖీ వైరుధ్యం వుండివుండింది. ఆ పోరాటం జరిగిన సందర్భంలో సమాజంలో జరిగిన అనేక పరిణామాల దృష్ట్యా ముఖ్యంగా పారిశ్రామికీకరణ ప్రారంభమవటంతో సహజంగా వ్యక్తి స్వేచ్ఛావాదం మరోమాటలో హృదయ వాదం సాహిత్యంలో చోటు చేసికున్నాయి. ఈ పరిణామం ఇలా జరుగుతూ వుండిన సందర్భంలోనే రష్యాలో సంభవించిన అక్టోబరు విప్లవ ప్రభావం వల్లా, తదుపరి ముఖ్యంగా ఆంధ్ర భాష మాట్లాడే తెలంగాణా ప్రాంతంలో జరిగిన ఫ్యూడల్ వ్యతిరేక పోరాటంవల్లా తెలుగు సాహిత్యంలో అభ్యుదయ సాహిత్యానికి బీజాలు పడ్డాయి. కృష్ణశాస్త్రి, రాయప్రోలు, వేదులా మొదలైన హృదయ వాదులూ, శ్రీ శ్రీ, ఆరుద్ర, పఠాభి, కుందుర్తి సోమసుందర్ వగైరా అభ్యుదయ కవులు అంతకు ముందే సాహిత్యరంగంలో గురజాడ, గిడుగు అడుగు జాడల్లో ఫ్యూడల్ సాహిత్యంతో జరిపిన పోరాటంలో కలిసి పనిచేసివున్నారు. 'లిబరల్' బూర్జువాలు భూస్వామ్య వ్యవస్థను ఖండించి నట్లే, ఈ స్వేచ్ఛావాదులు అభ్యుదయ కవులతో కలిసి ఫ్యూడల్ సాహిత్య ధోరణుల మీద తిరుగుబాటు చేశారు.

ఇలా వేరు వేరు వ్యక్తులుగా కాకుండా, ఒకే వ్యక్తిలో ఈ రెండు ధోరణులూ కలగలిసి పయనం చేశాయి కూడా! ఉదాహరణకు మహాప్రస్థానం లాంటి విప్లవాత్మక గీతాలు రచించిన శ్రీశ్రీ సర్రియలిస్టు గేయాలు రాయటం. ఇలా వేర్వేరు వ్యక్తులుగానూ, ఒకే వ్యక్తిలోనూ ఉభయతాత్విక చింతనలూ చోటు చేసుకోటానికి మరో ముఖ్యకారణం పాశ్చాత్య సాహిత్య ప్రభావం కూడా. ఈ ఉభయులూ ఇలా కలుపుగోలుగా వ్యవహరించడం ఆ నాడు అనివార్యంగా జరిగింది. ఇది అపసవ్యంకూడా కాదు. అకారణం అనలేము. అపకారం కూడా పెద్దగా జరిగింది ఏమీలేదు.

(మిగతా ౬౩ వ పేజీలో)

కథానిక

ప్లేగియారిజం

మల్లాది వెంకటకృష్ణమూర్తి

కథలంటే నాకు కొద్దోగొప్పో ఆసక్తి వుంది. అలా అని ప్రతి కథా చదవను. నిజానికి అంత ఓపిక, సమయం లేవు నాకు. అయితే సాంఖ్యాయనశర్మ పేరు కోసం చూస్తాను ఏదయినా పత్రిక తిరగేస్తూంటే. అందులోని విషయసూచికలో ఆపేరు కనబడితే ముందర ఆకథ చదువుతాను అతనికథలు నాకు బావుంటాయి. నిజానికి అనేకమంది రచయితల కథలు బావుంటాయి. అయితే సాంఖ్యాయన శర్మతో నాకు ఓసారి పరిచయం జరిగింది. కాబట్టి అతని కథలు చదువుతాను

ఒకవ్యక్తి రచయిత అని తెలిసాక అతని కథలు చదవటంలో ఆసక్తి వుంటుందనుకుంటాను. అందుకే ఓ స్నేహితుడింట్లో, అతను స్నానం చేస్తూంటే బల్లమీది ఓ మాసపత్రిక తిరగేస్తూంటే, సాంఖ్యాయనశర్మ పేరు కనబడితే ఆ కథ చదివాను.

కథ పేరు 'అంకితం'. చక్కటి ఎత్తుగడ, మంచి ముగింపుతో ఆ కథ బాగానే వుంది.

నా స్నేహితుడు స్నానం అయాక రావడంతో పత్రిక పక్కన పడేసి నే వచ్చినపని గురించి మాట్లాడసాగాను

నెల తర్వాతనుకుంటాను. ఆఫీస్‌లో లంచ్ అవర్‌లో ఆ నెలలో విడుదలయిన మాసపత్రికని తిరగేస్తూ వుత్తరాల శీర్షికలో సాంఖ్యాయనశర్మ కథ గురించిన వుత్తరాలకోసం చూసాను. సాధారణంగా అతని కథలు బావుళ్ళేదనే వుత్తరాలు అరుదుగా ప్రచురిస్తూంటారు.

ఒకటి రెండు వుత్తరాల్లో అతని కథ గురించిన ప్రస్తావనవుంది. 'అంకితం' బావుందని రాసారు. మూడో వుత్తరంలోని ఘాటయిన విమర్శ చదివాను.

సాంఖ్యాయన శర్మగారు రాయగా మీరు ప్రచురించిన కథ 'అంకితం' చదివాం. ఆంధ్రవాణి వారపత్రికలో పద్నాలుగు వారాలపాటు సీరియల్‌గా ప్రచురింపబడ్డ మరో రచయిత నవల, "సమర్పణ"కి ఇది సంక్షిప్త రూపం ఇచ్చిన కాపీ కథ. ఆ నవలని యథాతథంగా కథగా క్లుప్తంగా రాసారీ వర్ధమాన రచయిత. ఇది మీరు కూడా గుర్తించకుండా ప్రచురించడం శోచ

శయం. పత్రికాముఖంగా శర్మగారిచేత ఈ చౌర్యానికి సంజాయిషీ ఇప్పించవలసిందిగా కోరుతున్నాం. ఇకమీదట ఇలా జరగకుండా చూడవలసిందిగా కూడా కోరుతున్నాం.

ఏలూరు నుంచి నలుగురు కలిసి రాసారు ఆ వుత్తరం అంత ఘాటుగా లేకపోయినా మరో రెండు మూడు వుత్తరాల్లో సాంఖ్యాయనశర్మ కథ గురించి రాసారు మరో వారపత్రికలో ప్రచురింపబడ్డ "సమర్పణ" అనే నవలకు, ఆ కథకూ పోలికలున్నట్లుగా.

నాకు అతను గుర్తుకు వచ్చాడు. "ఇతనింతేనా" అనిపించింది ఒక్కక్షణం. రచయితగా అతనిమీదవున్న గౌరవం చాలా తగ్గిపోయింది నాకు.

ఆ వుత్తరాల శీర్షిక పేజీ తిప్పాను. పక్కపేజీలో 'సాంఖ్యాయనశర్మ సంజాయిషీ' అనే శీర్షికకింద అతని సంజాయిషీ ప్రచురించారు అతను ఎలా సమర్థించుకుంటాడాఅని వుత్సాహంగా చదవసాగాను. తను ఆ నవల అసలు చదవనే చదవలేదని రాస్తాడనుకున్నాను. దొంగతనం నేర్చినవాళ్ళు అబద్ధం ఆడటానికి వెనుదీయరు.

కాని అలా జరగలేదు. ముందర సంపాదకులు రాసిన నాలుగుముక్కలు వున్నాయి.

ఏలూరునుంచి నలుగురు పాఠకులు రాసిన వుత్తరాన్ని గతనెల ప్రచురించిన 'అంకితం' కథా రచయిత సాంఖ్యాయనశర్మకి పంపగా, అయన బదులుగా రాసిన సంజాయిషీని యధాతథంగా దిగువ ప్రచురిస్తున్నాం. సం॥

పాఠకులందరికీ వందనాలు. గత నెల ఇదే మాసపత్రికలో ప్రచురింపబడ్డ నా రచన "అంకితం" ఓ వారపత్రికలో ప్రచురింపబడ్డ సీరియల్ నవల "సమర్పణ"కి కాపీ అని ఏలూరునుంచి నలుగురు పాఠకులు రాసిన వుత్తరం మీరు చదివేవుంటారని భావిస్తాను.

వాళ్ళు రాసిందాంట్లో నిజం వుంది. ఆ కథని కాపీకొట్టే రాసాను నేను కావాలని. ఆ నవల చదివాను. అయితే అది "ది డెడికేషన్" అనే ఆంగ్లనవల (రచయిత: జేమ్స్ ఫాన్స్, ప్రచురణ. ఏప్రియల్ 1972. లండన్ నుంచి ట్వింకిలిన్ కంపెనీవారి ముద్రణ)కి కాపీ. ఆ నవల నేను నాలుగు సంవత్సరాలక్రితమే చదివాను. అందుకే కావాలని ఈ కథ ద్వారా ఆసంఘటనని మీ దృష్టికి తీసుకురాదలచాను ఎందుకంటే, ఆ వారపత్రికకి జరిగింది వివరిస్తూ నేను వుత్తరం రాసినా అది ప్రచురించలేదు.

సెలవు,
సాంఖ్యాయన శర్మ

లంచ్ అవర్ అయాక మళ్ళీ పని మొదలుపెట్టేదాకా ఆ వుత్తరం గురించే ఆలోచిస్తూండి పోయాను.

—o—

మారుతున్న సమాజంలో సాహితీ విలువలు

సమాజం మనుగడ మార్పులోనేవుంది. ప్రవాహంలా చొచ్చుకొని ముందుకు పోవడమే సమాజానికి తెలుసు. ఈ ప్రవాహపు దారిని మళ్ళించడానికి సమకాలీన సాంఘిక రాజకీయ ఆర్థిక పరిస్థితులు ప్రయత్నిస్తూనే వుంటాయి. ఈ అవరోధాల వల్ల సాహితీ విలువలు మారుతూ వుంటాయి.

సాహిత్య విలువలు కొన్ని నామరూపాలు లేకుండా కాల గర్భంలో కలసి పోతుంటాయి. కొన్ని విలువలు వర్షాకాలపు నదులలాగా కొంతకాలం పొంగి నానా బీభత్సంచేసి సజీవ విలువల కారణంగా యింకి పోతుంటాయి. మూడోరకమైన విలువలు కలకాలం ప్రచారంలో వుంటూ అందరి ఆదరాభిమానాలను పుష్కలంగా పొందుతూ ముందుకు సాగిపోతుంటాయి. ఈనాడు మనకు రాచరికపు లేక ఫ్యూడల్ వ్యవస్థలకు సంబంధించిన నవలలు బొత్తిగా కనబడటమే లేదని చెప్పాలి. ప్రేమ సెక్స్, హత్యలకు సంబంధించిన నవలలకు ఇంతకుముందున్న మార్కెట్టులేదు

నవలలు - ఒక పరిశీలన

ఎ. బి. సాయిప్రసాద్.

కాని ఈ రోజు కూడా చదువరుని అలరించదగ్గ నవలలు 'మాలపల్లి' 'చివరకు మిగిలేది', 'అసమర్థుని జీవన యాత్ర' 'కాలాతీత వ్యక్తులు'-కొన్నిఅయినా సరే మనకున్నందుకు మనం గర్వించాలి.

మానవుడు సంఘజీవి. మారుతున్న సమాజంతోపాటు తాను మారుతూనే వస్తున్నాడు. సంఘంలో వస్తున్న మార్పులను సామాన్యుడు భయంతో, భక్తి శ్రద్ధలతో అప్పుడప్పుడు గత్యంతరం లేక స్వీకరిస్తే రచయిత మంచిచెడ్డలు నాలోచించిగాని స్వీకరించడు. అందుకే మారుతున్న విలువలు సాహిత్యంలో చోటు చేసుకోవడానికి కొంతకాలం పట్టడం మనం చూస్తున్నాం. స్వాతంత్ర సమరం లోని జాతీయతా భావాన్ని ప్రబోధించే రచనలు ఈ రోజుకు కూడా వస్తున్నాయి. తెలంగాణా ఉద్యమం జరిగిన చాలా రోజులకు - దాశరధి రంగాచార్యగారి 'చిల్లర దేవుళ్ళు' మహీధర రామమోహనరావుగారి 'మృత్యువు నీడల్లో' వచ్చాయి.

1969-72లో ఆంధ్రదేశాన్ని అట్టుడికించిన ప్రత్యేక ఆంధ్రా, ప్రత్యేక తెలంగాణా ఉద్యమాలను గురించి చర్చించిన నవీన్ గారి 'ముళ్ళపొదలు కూడా ఇటీవల కాలం లోనే వచ్చింది. కాని కవులు ఎప్పటికప్పుడు ప్రచండ రచనలు చేయగలిగారు. కవుల హృదయంలో ఆవేశంపాలు ఎక్కువుగా వున్న కారణంగా వారు నీటివలే త్వరగా వేడెక్కి త్వరగా చల్లబడతారు. కాని నవలా రచయితలు వాతావరణం లోని వేడిని ఆలస్యంగా గ్రహించి ఆలస్యంగానే చల్లబడతారు. జాతీయోద్యమం 'ఓబయ్య' శ్రీ వేలూరి శివరామ శాస్త్రి ద్వారా 'మాలపల్లి' (శ్రీ ఉన్నవ) లో పారంభమై 'ప్రజల మనిషి' (శ్రీ ఆళ్వారు స్వామి) కారణంగా తెలంగాణా ఉద్యమంగా మారి 'రథచక్రాలు (మహీధర రామ్మోహనరావు) ముళ్ళ పొదలు (నవీన్) మీదుగా తేలడి 'రామరాజ్యానికి రహదారి' (పాలగుమ్మి పై)-వచ్చి నిలిచింది సంఘ సంస్కరణతో ముడిపడివున్న ఈ ఉద్యమం సుమారుగా అర్ధ శతాబ్దం జీవించింది ఇంతకాలం జీవించియున్నా "రెండవ సంగ్రామం గురించి కాని దేశ విభజన వలన ఏర్పడిన పరిణామాలను గురించిగాని చక్కని నవల (ఎవరూ) వ్రాయలేక పోయారని అటు శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మ(మహతి.- తెలుగు నవల సరికొత్తపోకడలు-89 వ పుట) ఇటు విమర్శకులు రామమోహన్‌రావు గారు (భారతి సెప్టెంబర్ 1975-గ్రంథవిమర్శలు) భావిస్తున్నారు. దీనికి కారణం-సరికొత్త మార్పులు ఏ విభజన జీవితంలో వచ్చినంత వేగంగా సాహిత్యంలో ఫలించవు. జీవితం మారి నంత త్వరగా సాహిత్య పద్ధతులు మారకపోవడమేనని శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మగారే (మహతి-తెలుగు నవల సరికొత్త పోకడలు - పుట. 91) - సమాధానం చెబుతున్నారు.

ప్రేమ వివాహం, కులం, మతం ఇత్యాదులకు సంబంధించిన విలువలు కూడా నేడు మారుతున్నాయి. ప్రాచీనకాలంలో ప్రచారంలోవున్న భావాలు-ఈనాడు ప్రచారంలో లేవు సరికదా ఆ భావాలను గురించిన చర్చనుకూడా ఈ తరం వారు సహించరు. ప్రేమ, కులాంతర, మతాంతర, విధవా వివాహాలు ఆ కాలంలో మృగ్యమనే చెప్పాలి. కొంతవరకు దీనికి సంబంధించిన చర్చ స్వాతంత్ర్యానికి పూర్వం వచ్చిన నవలలో వచ్చింది. శ్రీ పాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి ఆత్మబలి (1919) లో వితంతువులకు కోరిక లుంటాయని మాత్రం గ్రహించారు. కాని వితంతువు వివాహాన్ని శ్రీ పాద సుబ్రమణ్య శాస్త్రిగారు కాని, వెంకట పార్వతీశ కవులు (మాతృమందిరం 1919) గాని ప్రోత్సహించలేకపోయారనే చెప్పాలి.

అని స్వరాజ్యము గోరి పోరాట మందు దిట్టలెందరి గోరిలో కట్టబడియె
అది యగాధము త్రవ్వి చూచెదవయేని భావి కాంక్షలు నిన్నెన్నొ
పల్కరించు

—భీమన్న

కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ తమ చెలియలి కట్టలో రత్నావళి తన మరిదితో లేచిపోవడం చిత్రించారు ఈ పాత్ర సృష్టి వలం స్వచ్ఛంద ప్రేమను గర్హించ డానికి మాత్రమే సృష్టించారని ప్రముఖ విమర్శకులు శ్రీ ఆర్. యస్. సుదర్శనం భావిస్తున్నారు. ఈ నవలలో (చెలియలికట్ట) వివాహ వ్యవస్థ యొక్క పారమార్థిత ప్రయోజనాన్ని నిరూపించడంకంటే స్వచ్ఛంద ప్రేమ సిద్ధాంతం యొక్క వైఫ ల్యాన్ని చిత్రించడమే వారి ధ్యేయం (ఆధునిక నవల-అధీరనాయకుడు భారతి, డిసెంబరు 1971)

స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత విడాకుల చట్టం అమలులో రావడంవల్ల వివాహ వ్యవస్థలో మార్పు గావలి, భావాల అప్పు ధోరణులు ప్రబలి పోయాయి. స్వచ్ఛంద ప్రేమ సిద్ధాంతం జన్మదాత చలం సుశీల్ని-'బ్రాహ్మణీకం' 'దైవ మిచ్చిన భార్య' అయినా, మైదానం-ఆధారం చేసుకుని "ఆయనకు కనబడ్డది, ఆయన చూచినది, చూపించినది లైంగిక సుఖము, స్త్రీ స్వాతంత్ర్యం రెండేనంటూ లైంగిక స్వాతంత్ర్యం ప్రబోధించి స్త్రీ సమాజాన్ని నాశనం చేశాడని తీవ్రంగా విమర్శిస్తారు శ్రీ రాణి మోహనరావు (గ్రంథ విమర్శలు - భారతి - సెప్టెంబరు-1975) యేది యేమయినా ప్రేమకు, కులం, మతం ప్రధానం కాదని ప్రేమకు కావ లసింది ప్రేమేనని చాటి చెప్పారు శ్రీ చలం. ఈ రోజు ఆయన నడిచినబాటనే నడుస్తూ చలంగారే నయం అనే భావనను కల్పించే రచనలను శృంఖాను పుంఖా లుగా మన రచయితలు, రచయిత్రులు రచిస్తున్నారు. శ్రీమతి వేమూరి వసంత రత్న కంబళం) చివుకుల పురుషోత్తం (ప్రేమతరంగాలలో జీవన నౌకలు) ల రచనలు చాటి చెబుతున్నాయి.

నిర్మొహ మాటంగా స్త్రీల సమస్యలను అవగాహన చేసుకొని చర్చించిన రచయిత్రులలో శ్రీమతి రంగనాయకమ్మ అగ్రగణ్యురాలు. సాంఘిక ప్రయోజ నాల కోసం శ్రీమతి బీనాదేవి కలం పట్టడం మనమంతా గర్వించదగ్గ విషయం.

ల సమస్యలను, ముఖ్యంగా చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న స్త్రీల సమస్యలను చక్కగా అభివర్ణింపగల నేర్పరి శ్రీమతి మాలతీచందూర్. వీరుగాక కుమారి వాసిరెడ్డి సీతాదేవి, మాదిరెడ్డిసులోచన, పరిమళా సోమేశ్వర్, డా॥ సి. ఆనందా రామం గార్లు కూడా ప్రయోజనాత్మక నవలల్ని వ్రాయడానికి ప్రయత్నిస్తున్నారు.

పారిశ్రామిక విప్లవం భారతదేశం లాంటి వృద్ధి పథంలో వున్న దేశాలలో మధ్యతరగతిని సృష్టించింది. ఈ వర్గం అటు శ్రామిక వర్గానికి చెందక ఇటు ధనిక వర్గంలో ఇముడలేక త్రిశంకుడిగా వుండిపోయింది. వీరి సమస్యలు ప్రత్యేక మైనవి. వీరిలో వున్న ఫాల్స్ ప్రెస్టీజ్ వీరిని ముందుకు రానివ్వడం లేదు. వీరి బలహీనతల్ని, శక్తులను వుగ్గడించే నవలలు యువతరం రచయితలు రచయిత్రులు వ్రాయడం ప్రారంభించారు మహీధర రామమోహనరావుగారి తరువాత శ్రీ బలివాడ కాంతారావు (అన్నపూర్ణ) కొమ్మూరి వేణుగోపాలరావు (పెంకుటిల్లు) ఆదివిష్ణు (సగటు మనిషి) పురాణం సూర్యప్రకాశరావు (మారే మనుషులు) తదితరులు ఈ వర్గానికి సాహిత్య స్థాయిని కల్పిస్తున్నారు. స్త్రీలలో రంగనాయకమ్మ (పేక మేడలు, కృష్ణవేణి) ద్వివేదుల విశాలాక్షి (వారధి, గ్రహణం విడిచింది మాలతీ చందూర్ (చంపకం-చెదపురుగులు, ఆలోచించు)-నిర్విరామంగా కృషిచేస్తున్నారు. ఈ వర్గం విలువలపైనే మన సాహితీ విలువలు ఆధారపడి వున్నాయి.

గ్రామోద్ధరణ, హరిజనోద్ధరణ, లౌకిక ప్రజారాజ్యం ఇత్యాదులు నేటి సామాజిక విలువలను మార్చేస్తున్నాయి. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత గ్రామ రాజకీయాల్లో వచ్చిన మార్పును, కలుషితమైన వాతావరణాన్ని ప్రజలదృష్టికి తెచ్చిన ఘనత శ్రీ. కే. కృష్ణారావుకే దక్కింది 'కీలుబొమ్మలు' పరంపరలో ఎన్నో నవలలు నవలికలు(మంజుశ్రీగారి నూరు శరత్తులు మొ॥) వెలువడ్డాయి, వెలు వడుతున్నాయి. మనం ఎంతో ముందుకు పోతున్నాం అని అనుకుంటున్నాం, కాని మనలో మనదృక్పథంలో ఎలాంటి మార్పు రాలేదు ఇంకా మనం అయోమయ పరిస్థితిలోనే వున్నాం అని భావిస్తున్నారు శ్రీ జి. వి. రామచంద్రరావు. వారి దృష్టిలో జనం ఒకవైపు ఆధునిక సదుపాయాలను వాడుతూ ఇంకోవైపు బాధా వుపశమనానికి తిరుపతి వెంకటేశ్వర్ల కరుణాకటాక్షాన్ని కోరుతూ మొక్కులు చెల్లించుకొంటున్నారు. బాబాల ఆరాధన ముమ్మరంగా పెరుగుతున్నాయి. (మహతి గ్రామీణ సంస్కృతి – మారుతున్న ధోరణులు-పుట 88) రావిశాస్త్రి లాంటి ద్రష్టలు స్రష్టలు ఈ విలువల్ని నవలాబద్ధం చేయుటం నిజంగా హర్షించదగ్గ విష యం.

మన సమాజపు విలువల్ని తారుమారుచేస్తున్నవి సినిమాలు. పోటీలపేరిట

> సరి సరి సరి ఉరికంబాలకు మన ఆశయాలు బలి రాబందుల రాజ్యం లోపల
> అబోతులే అమాత్యులు కదా మరి వైతరిణికి చెలియలి కట్టలు కట్టి
> రైతుల్ని పండించమంటారు వ్యథ దానితో తీరుతుందా క్షుధ ?
> పద పద పద
>
> — ఆరుద్ర

ఒక మూసలో వ్రాసే రచయితలకు రచయిత్రులకు నగదు బహుమతుల నందిస్తున్న పత్రికలు, చవుకగా అందరికి అందుబాటులోవున్న సాహిత్యాన్ని ప్రచారం చేస్తున్నామని నిస్సారమైన నవలల్ని ప్రచురిస్తున్న కొన్ని పుస్తక సంస్థలూనూ, వ్యాపార సరళిలోపడి సాహిత్య విలువలను మరచి పాతివేయబడ్డ ఫ్యూడల్ వ్యవస్థనూ, కృత్రిమ సంఘటనలతో అసహజత్వంతో నిండిన పాత్రలతో మన మెరుగని, మనం అందుకోజాలని ఆదర్శాలను సృష్టిస్తున్నారు మన రచయిత్రులు. కేవలం సినిమాల కోసమే వ్రాస్తున్నాం, వ్రాయలన్న ధోరణిలో వ్రాసుకుని పోతున్నారు – శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి శ్రీమతి అరికిపూడి కౌశల్యాదేవి, శ్రీమతి గంటి వెంకట రమణ ఇత్యాదులు రచనా వ్యాసంగంలో ఆరితేరినవారు సయితం సినీతార సూచించిన చిట్కాలను, సోమవారం మహాత్యం వంటి రచనలు చేస్తున్నారంటే మన సాహితీ విలువలు ఎంతకు దిగజారిపోయాయో సులభంగా అర్థం చేసుకోగలం ఈ నాడు చాలా మంది రచయిత (త్రు) లు డబ్ల్యూ. హెచ్. హడ్సన్‌గారి వాక్యాలను ధృవపరుస్తున్నారంటే అందులో ఆశ్చర్యపడవలసిన పనే లేదు–**Any one can write a novel who has pen, ink and paper at command and certain amount of leisure and patience.**

ఈ రోజు ఎటుచూచినా ప్రాంతీయ భాషా మత సంకుచిత విపరీతధోరణులు తప్ప మనం భారతీయులం, మనలో సోదరభావం పెరగాలి అన్న తపన సామాన్యుడికి లేదు. రచయితలకసలే లేదు. దేశ సమైక్యత పునాదిరాళ్ళలో సహా కూలిపోతున్నా రచయితలు తమ దృష్టిని చచ్చు ప్రేమ కథలనుండి మరలించ లేకపోతున్నారు సామాజిక, రాష్ట్రీయ అవగాహన మన రచయితల్లో కరువైంది.

మనకు భావ దారిద్ర్యం కాని, ప్రతిభా దారిద్ర్యం కాని లేదు రావిశాస్త్రి (అల్పజీవి రాజు–మహిషి) కొడవటిగంటి కుటుంబరావు (చదువు) బలివాడ కాంతారావు (పుణ్యభూమి) నవీన్ (అంపశయ్య) పాలగుమ్మి (నల్లరేగడి) లాంటి రచయితలు రంగనాయకమ్మ (బలిపీఠం, పేకమేడలు) ఇల్లిందల సరస్వతిదేవి (భవతీ భిక్షాందేహి) కుమారి వాసిరెడ్డి సీతాదేవి (మట్టి మనిషి, సమత) బీనాదేవి (హేంగ్

ప్రసవం

ఎస్. గోపి.

కవిత్వం పెగలదు....
నిన్నటి దాకా రెప్పల్లేని ఎండ!
ఇప్పుడిప్పుడే ఆకాశంలో
కాళిదాసుని శ్లోకాలు పూస్తున్నాయి
వాన సెలవు లిచ్చారు గడ్డిపూలకి
మళ్ళీ వచ్చాయి తెలతెలమంటూ
అయినా
కవిత్వం పెగలదు...
కేజీ పల్లలు ఫీజుస్లిప్పులు తెస్తున్నారు
అడ్వర్ టైజ్ మెంట్లు చింపి
ఆకల అంగీలు కుట్టుకుంటున్నారు నిరు
ద్యోగులు
'అద్దె తరగతి' వాడి బతుకులో
మళ్ళీ మద్దెలలు మోగుతున్నాయి.
బురదలో జారి
పాలేర్రాముడి ముసలిదేహం
కీళ్ళు విరగ్గొట్టుకుంది.
పచ్చి బాలింత శాంతమ్మ కూలికి వెళ్ళి
లక్కడిపుంచే హాస్పిటల్ కు చేరింది
కుష్టూ, రోష్టూ రోడ్డు వారల మూల్గుతు
న్నారు
ఇంతలో
బిగించిన వెచ్చని కారొకటి
మొహమ్మీద నీళ్ళు కొట్టిపోయింది.
అంతే!
మండించి ఉద్రేకా!
కవిత్వం పెగిలింది.

మీక్వెక్) లాంటి రచయిత్రులూ వున్నారు. కానివీరిలో నవలా రచనపట్ల ఆసక్తి తగ్గిపోవటంవల్ల సమాజాన్ని ప్రతిబింబించేంచనలు మనకురావడంలేదు. కేవలరాజకీయ వాదాలను ఆధారం చేసుకుని తమ ప్రతిభా సంపత్తును పక్కదారులు పట్టిస్తుంటే మరికొందరు విపరీత ధోరణుల ప్రచారానికి నడుంకట్టారు. కీలుబొమ్మలు, కొల్లాయి కట్టితేనేమి లాంటి రచనలు రావడ లేదు. కారణం ఆర్థిక అసమానత్వం, ధనార్జనాభిలాష మొదలైనవనే చెప్పాలి. ప్రేమ్‌చంద్ (గోదాన్ రచయిత) కోవకుచెందిన ఒక్క నవలా రచయిత కూడా మనకు లేకపోవడం నిజంగా శోచనీయమైన విషయం. మారుతున్న సమాజంలో రేపటి నవల ఎలా వుండాలో హెచ్. జీ. వేల్స్ ఇలా వివరిస్తారు—**The novel of future is to be social mediator, the vehicle of understanding, the instrument of self Examination, the parade of morals and exchange of manners, the factory of customs, the criticism of lanes and institutions and social dogmas and ideas (The contemporary Novel)**

బలివాడ కాంతారావు, పాలగుమ్మి పద్మరాజు, నవీన్, బీనాదేవి, రావిశాస్త్రి గార్ల భారతీయులు గర్వించదగ్గ నవలలు వ్రాయగలరని ఆశిద్దాం.

కథానిక

"బోనాలకెల్లండిరా బొట్టెలారా!"

వై. వి. యస్. యస్. యస్. మూర్తి

సముద్రాలు కుక్కి మంచంలో పిల్లిలా అంటుక్కుపోయి మూలుగుతోంది. అస్థి పంజరానికి గుడ్డలు చుట్టబెట్టి పడవేసినట్లుంది సముద్రాలు. మూసిన కన్ను ఎత్తడంలేదు. జ్వరంతో వొళ్ళు పేలిపోతోంది. తొట్టిలాంటి మంచంలో ప్రక్కలు పరచివున్న చింకి గుడ్డమాసి, జిడ్డు పట్టి చెమటకు తడిసి గౌలు కంపు కొడుతోంది. ఎముకల గూడును దాచి పెట్టుకోవడానికి సముద్రాలు చుట్టబెట్టుకున్న గుడ్డపాతలు రెండూ చెదిరిపోయి అస్తవ్యస్తంగా ఉన్నాయి. శవం మీద ముసిరినట్లు ఈగలు ముసురుతున్నాయి సముద్రాలు ఎండిన గుండెలమీద పేకులపోయి బయటకు పొడుచుకొచ్చిన దవడ ఎముకల పోయిన తడారి పోయిన పెదవులపైన, గుంటలు పడ్డ కళ్ళమీద, రెప్పలమీద, మంచం ప్రక్కనే సముద్రాలు అప్ప ఈరమ్మ కూర్చుని చిరిగిన కొంగుతో గాలి విసురుతూ మరొక చేత్తో ఈగల్ని తరుముతుంది. సముద్రాలు అత్త పెంటమ్మ కోడలి తలవైపున గుంటి గుంజకు జారబడి కూర్చొని కోడలి ముఖం కాసి చూస్తున్నది. మంచం చుట్టూ సముద్రాలిపిల్లలు దిశ మొలలతో నిలబడి తల్లివంక భయంభయంగా ఆతృతగా చూస్తున్నారు. వాళ్ళలో పన్నెండేళ్ళ అసిరిగాడికి మాత్రం గోచి ఉంది. తతిమ్మ పిల్లలు సెందిరిగాడు, పోలిపల్లి, గౌరి దిశ మొలలతో నల్లగా దుమ్ముపట్టి దిష్టిబొమ్మల్లా ఉన్నారు.

సముద్రాలికి వారం రోజులనుండి జ్వరం తగ్గడంలేదు. మొదటి రెండు రోజులు అదే తగ్గిపోతుందని మొండిగా పని- పాటుకు వెళ్ళింది. కానిమూడో రోజున జ్వరం మోపుచేసింది ఆ రోజు లేవలేకపోయింది. లంఖణంచేస్తే జ్వరం తగ్గుతుందని వేడి వేడి గంజి మాత్రం తాగింది. అది ఇమడలేదు. వాంతి అయిపోయింది. అప్పటికే సముద్రాలి మగడు పైడియ్య పనిలోకి పోయాడు. పెద్దకొడుకు అచ్చిగాడు కామందుల కొలువుకు పోయాడు. అసిరిగాడు గొడ్లను మేపడానికి పోయాడు. చిన్న పిల్లలు ఉన్నారు ఇంటిదగ్గర. అత్త పెంటమ్మ అసలే ముసలిది. కదల్లేదు. చూపు ఆనదు ఆస్థితిలో సముద్రాలి దిక్కు చూసేవాళ్ళు ఎవ్వరూలేరు. ఎండ ఎక్కాక పదిగంటల వేళప్పుడు కొంచెం ఓపిక చేసుకొని ఆచారిగారింటికి వెళ్ళింది మందుకోసం. ఆచారి ఆ ప్రాంతాల్లో మూడు-నాలుగు ఊళ్ళకు ఒక్కడే సంచికట్టువైద్యుడు. తన ఇంటికి సము

దాలు రావడం చూసిన ఆచారి గుమ్మం వరకూ ఆమెను రానివ్వలేదు "అగు! అక్కడే!" అంటూనే లేచి తనే సముద్రాలు దగ్గరకు వెళ్ళాడు. బాధ ఏమిటో తెలుసుకొని రెండు మాత్రలు ఇచ్చి, నీళ్ళల్లో వాటిని రంగరించి వేసుకోమని చెప్పాడు. ఆయనకు దండం పెట్టి పడుతూ - లేస్తూ ఇంటికి చేరింది సముద్రాలు. ఆచారి చెప్పినట్లుగా మాత్ర నీళ్ళలో రంగరించి వేసుకొంది. కాని ఇమడలేదు. పైగా పెద్ద వాంతి అయిందికూడా. నిస్త్రాణగా అలా పడి పోయింది. కోడల్నిస్థితిలో చూసి అత్త అల్లాడి పోయింది. మధ్యాహ్నపు వేళ గంజికొచ్చిన అసిరిగాడి చేత సముద్రాలి అప్ప ఈరమ్మకు కబురు పంపింది. ఈరమ్మ వచ్చేసరికి జ్వరం మరింత తీవ్రమయిపోయింది. సాయంకాలం పెంటయ్య వచ్చాక వెళ్ళి అతడ్ని ఆచారి దగ్గరకు పంపింది ఈరమ్మ. "బేవారు బేరం" అని విసుక్కుంటూ మరో రెండు మాత్రలు ఇచ్చిపంపాడు ఆచారి. పెంటయ్య ఆ మాత్రలు తెచ్చి ఈరమ్మకు ఇచ్చాడు. మందు వాడినప్పటికీ మరుపరిటిరోజుక్కూడ జ్వరం తగ్గలేదు. ఒకసారి వచ్చి చూడమని కబురు పంపినా రాలేదు ఆచారి. పైగా ఇంట్లో ఉండి, ఊర్లో లేదనిపించుకున్నాడు కూడా. పై వూరు వైద్యానికి వెళ్ళే స్తోమతలేదు వాళ్ళకు. ఇక వేరేదారిలేక గచ్చాకు - పుచ్చాకు వైద్యం ఆరంభించింది ఈరమ్మ. ప్రయోజనం ఏమీ కన్పించడంలేదు. అసలు ఈవేళ మూసిన కన్ను తెరవకుండా పడివుంది సముద్రాలు. అప్పుడప్పుడు కొంచెం కదిలినా అంతలోనే చాప చుట్టపడి వుంటుంది సముద్రాలు.

లచ్చుమినాయుడు శిరసపల్లె గ్రామానికి సర్పంచ్. పైగా మోతుబరి రైతు. మంచి పలుకుబడి ఉన్న ఆసామీ ఆయన కూతురు సుధకు పట్నంలో డాక్టరుగావున్న మురళితో పెళ్ళినిశ్చయమయింది. లక్షరూపాయల కట్నం. భారీగా కానుకలుకూడా ఇస్తున్నారు లచ్చుమి నాయుడు వరునకు. ఈవేళ పెండ్లి పెండ్లికి ఎక్కడెక్కడనుండో గొప్ప గొప్ప వాళ్ళందరూ వచ్చారు. గ్రామంలో చిన్నా - పెద్ద, ముసలి-ముతక, మాల-మాదిగ అందర్నీ భోజనానికి పిలిచాడు లచ్చుమి నాయుడు. వాళ్ళ - వాళ్ళ స్థాయినిబట్టి భోజనాలు ఏర్పాటుచేశాడు నాయుడు. ఈవేళ గ్రామంలో కూలిజనం, చిన్నా - పెద్ద, మాల - మాదిగ అందరూ ఆయనింటి దగ్గరే ఉన్నారు. పెంటయ్య అచ్చిగాడు తెల్లవారుజామునుండే వంచిన తల ఎత్తకుండా అక్కడే పనిచేస్తున్నాడు వంటశాలల్లో రకరకాల పిండి వంటలు తయారు చేస్తున్నారు పట్నం నుండి వచ్చిన వంటవాళ్ళు. వాటి పేర్లేమిటో అక్కడ పనిచేసుకుంటున్న కూలి జనానికి తెలియదు. "అబ్బా! వరికూడు ఎలాతెల్లగా సున్నంలా ఉందో! ఎన్నాళ్ళయిందో ఇలాంటి కూడుచూసి." అని సంబరపడిపోయారు వాళ్ళు. ఎప్పుడూ రాగి సంకటి, నూకలజావ తప్ప మరేమీ ఎరగని ఆ జనానికి అన్నాన్ని, పిండి వంటల్ని చూడ్డంతోనే కడుపునిండిపోయి

నట్లయింది. జన్మకో శివరాత్రి అనిమంచి భోజనం దొరుకుతుందన్న ఆశతో వాళ్ళంతా వంచిన నడుం ఎత్తకుండా మహాచురుగ్గా చక - చకా పనులుచేస్తున్నారు. అజమాయిషీ చేస్తున్న లచ్చుమి నాయుడుమీసాలు మెలేసుకుంటూ గర్వంగా నవ్వుకుంటున్నాడు.

X X X

"కూడు తినేయాల అయిపోనాది. భోజనాలకి యెల్లండిరా బొట్టుల్లారా!" అంది ఈరమ్మ. "మరి అమ్మో!" అన్నారు పిల్లలు.

"మాం ఉన్నాం కాదా! సూసుకుంటాం. మీరు బేగెల్లి వొచ్చెయ్యండి. మీ అయ్యని-అన్నని కేకేసితీసుకురండి. అప్పుడు మాం యెల్తాం" అంది ఈరమ్మ. పిల్లలు ఇంటిలోని తలకొక గిన్నె తీసుకొని బయలుదేరారు భోజనాలకి. "అవునే! ఈరి! పెళ్ళి భోజనాలకి ఏ వేటిసేత్తారే?" అని అడిగింది పెంటమ్మ.

"నాకేటి తెలస్తది అత్తా! మావూరిలో శీనమ్మ నాయుడి కొడుకు పెళ్ళికి నడ్డుండలు - బూర్లు - అరిశెలు-పులిగోదర-పప్పు--కోరలు-ఇంకేటేటో చేసినారు. అందరికీ కడుపునిండా బువ్వెట్టినారు. జలమలో అటువంటి కూడు నాను చూడలేదు. కూడు తెల్లగా పువ్వులాగుంది." అంది ఈరమ్మ.

"అదురుష్టమంతురాలువే! పెట్టిపుట్టినావు. సక్కటి రాచకూడు తిన్నావు. నా జలమలో నువ్వు సెప్పిన నడ్డుండలు కంటితో సూడలేదు. సెప్పుకోగా యినుకోడమే ఒకతూరి అయ్యేమో కుడుములంట, అయ్యో! రెండు, రెండు గార్లు— కాసింత కోడికూర ఇగురు తిన్నానే. జిమ్మ తేచొచ్చింది." అంది పెంటమ్మ.

"పోసిలే అత్తా! లచ్చుమి నాయుడుగోరు కూతురి పెళ్ళి వైభోగంగా సేత్తన్నాడట. ఇయ్యేళ తిందువుగానిలే! నామ దగ్గరుండి తీసుకెల్తాగాదా!" భరోసా ఇస్తున్నట్లు అంటూ ఈరమ్మ సముద్రాలి ముఖంకేసి చూసింది. నోటి నుండి నురగలాగ ఏదో వస్తున్నది. మూలుగుకూడా తగ్గిపోయింది. ఈరమ్మ పై ప్రాణాలు పైనే పోయాయి. "సముద్రాలూ! ఓలమ్మీ! సముద్రాలూ! ఏటో లమ్మీ! ఇది? ఓరి దేవుడో! నా నేటిజెతునురో! అత్తో! అమ్మి సముద్రాలుఏటో అయిపోతుంది. నోటినుండి మరగొస్తుంది. ఇప్పుడేటి సెయ్యడం? అయ్యో అయ్యో!" అంటూ శోకాలు పెడ్తుంది ఈరమ్మ. పెదమ్మ లేచి చెయ్యి కోడలి ముఖంమీద-వొంటిమీద వేసింది. మంచు గడ్డలా తగిలింది శరీరం. ముక్కుదగ్గర చెయ్యిపెట్టి చూసింది. శ్వాస ఆగి

పోయినట్లుంది. "ఇంకేటోలమ్మ! సిలక ఎగిరిపోనాది. వాళ్ళంతా తడిగుడ్డ అయి పోనాది. ఓలి తల్లీ! సముద్రాలా! ఎంత పనిజేసినావె! నాకేది దారి! ఓలమ్మ! ఈరమ్మ ఆళ్ళకి కబురంపే!" అంటూ గుండెలు బాదుకుంటూ శోకాలు పెట్టింది పెంటమ్మ

"భోనాలయాలు భోనాలకాడ కూకు న్నారేటో! ఎదురింటి తవిటప్ప కొడుకు ఇంటికాడే ఇంకున్నట్లున్నాడు. ఆడికి సెబుదునా! పోయి" అంది ఈరమ్మ.

"బేగ పారిరా!" అంది పెంటమ్మ ఏడుస్తూ.

x x x x

మూడు గంటల వేళ దాటిపోయింది. లచ్చుమి నాయుడింట దగ్గర పెళ్ళి భోజ నాలు ఘనంగా అయిపోయాయి. అతిథు లందరూ భోజనాలఏర్పాట్లను ఎంతగానో మెచ్చుకున్నారు. ఇప్పుడు కూలిజనానికి భోజనాలు వడ్డిస్తున్నారు ఒక ప్రక్క. కూలీల్లో మాల-మాదిగలకు పెళ్ళి-పం దిరి బయట వడ్డన ప్రారంభించారు. అంతా బారులు తీర్చుకొని కూర్చున్నారు గొంతుగ్గా. వడ్డించబోయే పదార్థాల కోసం-అన్నంకోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. వడ్డన సాగుతోంది. వడ్డిం చినవి వడ్డించినట్లే మాయమవుతున్నాయి ఎవరో తమను తరుముతున్నట్టు ఆత్రంగా తింటున్నారు ఉన్నట్లుంది కేకలు, మధ్యలో కుక్కలు వాళ్ళతో కలబడు తున్నాయి. గద్దంతో వాటిని తరుముతు న్నారు. అవిమాత్రం వాళ్ళ ఆకుల్లో కలబడుతూనే ఉన్నాయి. ఆ గుంపులో ఒక ప్రక్క పెంటయ్య-అబ్బి-అసిరి గాడు, తతిమ్మా పిల్లలంతా ప్రక్క ప్రక్కనే కూర్చున్నారు. పిల్లలు వడ్డిం చినవి వడ్డించినట్లుగానే ఆత్రుతగా నోట్లో కుక్కుంటున్నారు. ఇంతలో తవిటప్ప కొడుకు చెంచుగాడు వచ్చి

అణచి పెట్టిన స్వాతంత్ర్యం
ఉబుకుతుంది లావాలా
అది చరిత్రలో విప్లవాలు చెప్పిన సత్యం
అది జరుగుతూనే ఉంది నిత్యం

—ఎల్లోరా

పెంటయ్యకు సముద్రాలు చచ్చిపోయిన కబురు అందించాడు. ఆ కబురు విని పెంటయ్య నిర్ఘాంతపోయాడు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నోట్లో గుడ్డ కుక్కుకున్నాడు. ఆకుమూసేసి లేవబోయ్యాడు.

"ఏటిరా! ఏటానిది?" అని అడిగాడు పక్కింటి పుల్లిగాడు. "ఆడది దాటిపోనాదట. కబురొచ్చింది." అన్నాడు పెంటయ్య దుఃఖంతో. "అయితే ఏటానిదిరా! దానికాలం దీరి అదెల్లిపోనాది నువ్వేటి జేత్తావు. కూడుతిండం మానేత్తే అది బతుకుతాదా? తిరిగి వస్తాదా? ఈ కూడు తిండం మానుకుంటే నీజలమలో మల్లీ ఇటువంటి కూడు దినగలవా? పిల్లలకు చెప్పినావా ఏడుస్తారు. తిండి దినరు. నీ జలమలో వాల్లకింత మంచి బువ్వ ఎట్టగలుగుతావా? నా మాటిను బువ్వతిను. తిన్నాక ఏటి సేద్దామో ఆలోచిద్దాం." అన్నాడు పుల్లిగాడు తేలికగా సలహా ఇస్తూ, "ఇంటికాడ మాయమ్మ, మా వదిన బెంగటిల్లి పోతున్నారట. నాను పోవాల!" అన్నాడు పైడియ్య దీనంగా.

"ఆగరా! గాడిదకొడకా! సెప్పింది నుకో! కూడు తినుముందు" అని కసిరాడు పుల్లిగాడు. అయినా ఉండబట్టలేక పైడియ్య పెద్దకొడుకు అచ్చిగాడితో– "మీ అమ్మ మనల్ని వొదిలిపెట్టి పోనాదటరా!" అన్నాడు దుఃఖంతో.

"ఆఁ? అని నిర్ఘాంతపోయాడు అచ్చిగాడు ఒక్క క్షణం. మళ్ళా అంతలోనే తేరుకొని భోజనంచెయ్యడంలో నిమగ్నుడయ్యాడు అచ్చిగాడు.

x x x x

అందరి భోజనాలు అయ్యేసరికి సాయంకాలం ఆరుగంటలయింది. వంటశాలల్లో రాత్రి భోజనాలకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆఖరి పంక్తిలో చివరగా ఒకప్రక్క కళ్ళు వొత్తుకుంటూ ముక్కు చీదుకుంటూ భోజనం పూర్తి కానిచ్చిలేచారు సముద్రాలు అప్ప ఈరమ్మ, అత్త పెంటమ్మ కూడా....

"సీ రియల్"

ఇప్పటి గ్రీష్మం నీ వశం కావచ్చు
రేపటి వసంతం మావశం
అంతగా ఎదిగి అందరికీ నీడనిస్తుంది.
దాన్ని ఎందుకలా నరుకుతావ్
ఆ నీడ నీ కళ్ళకు సరిపడదా?
నువ్వు అణచాలనుకుంటే అణగదు
ఒక్కసారి నరికితే పది చిగుళ్లువేస్తుంది.
పది కొమ్మల్ని నరికితే వేయి చేతులై
అది నీ మెడవైపే ప్రయాణం
నీ మెడవైపే దాని ప్రయాణం
నీవు ఎంతగా అణిస్తే
అంతగా విజృంభణ
సీరియల్‌గా నరికితే
సీరియస్‌గా నీవైపే..................

—పి. యస్. రవీంద్ర

ఎక్కడుంది స్వేచ్ఛ?
విత్తనాన్ని చీల్చిన మొక్కలో
ఎక్కడుంది స్వేచ్ఛ?
విహాయసాన్ని పొడిచిన చుక్కలో

—సినారే

తిలక్ కవిత్వంలో....

ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థ రెండు ప్రధాన వర్గాలుగా విభజింప బడిఉంది ఒకటి బూర్జువా వర్గం, రెండోది కార్మిక వర్గం. ఈ రెండు వర్గాల్లోనూ చేరీ చేరకుండా ఇంకొక వర్గముంది, అదే మధ్య తరగతి.

ఈ వర్గాల్ని, వర్గ స్వభావాల్ని మొట్టమొదట స్పష్టంగా, సమగ్రంగా విశ్లేషించి విశదీకరించినవారు మార్క్స్, ఎంగిల్స్‌లు. వీరి అభిప్రాయం ప్రకారం, "వీళ్లు (మధ్యతరగతి వాళ్లు) విప్లవకారులు కాదు, యధాస్థితి వాదులు. అంతేకాదు: ప్రగతి వ్యతిరేకులు కూడ. ఎందుకంటే, వీళ్ళు చరిత్రగతిని వెనక్కు తిప్పడానికి ప్రయత్నిస్తారు. ఒకవేళ ఎప్పుడైనా విప్లవకరంగా ఉన్నారంటే త్వరలోనే తాము కార్మిక వర్గంలో కలసిపోనున్న దృష్ట్యానే అలా ఉంటారు."

వీళ్ళ స్వభావాల్ని మనం పరిశీలించి నట్లైతే; ఇంకా కొన్ని లక్షణాలు కన్పిస్తాయి. వీళ్ళు ధనవంతుల్ని చూసి అసూయ చెందుతారు వాళ్ళ స్థాయికి చేరుకోవాలని విశ్వప్రయత్నం చేస్తారు. వాళ్ళలాగా జీవించాలని డబ్బులు లేకున్నా

మధ్యతరగతి ప్రజల జీవిత చిత్రణ

దర్జాగా ఉండాలని గింజుకుంటారు. క్రింది తరగతి వాళ్ళను చూసి ఒక్కోసారి జాలిపడతారు; ఒక్కోసారి ఏహ్యభావంతో చూస్తారు సంఘం కట్టుబాట్లు, నీతి నియమాలు ఆచరించడంలో మధ్యతరగతి వాడికున్న పట్టింపు పై తరగతి వాడికి ఉండదు. దేవుడంటె ఎనలేని ప్రీతి. గతమంటె ప్రాణం, సంప్రదాయాలపై ఎనలేని విశ్వాసం.

ఈ మధ్యతరగతి జీవిత చిత్రణ తిలక్ "అమృతం కురిసిన రాత్రి" లో ఏవిధంగా ఉందో పరిశీలింతాం. మన దేశంలోని కవులూ, రచయితలూ చాల వరకు మధ్యతరగతి నుంచి వచ్చినవారే తిలక్ కూడ మధ్యతరగతి నుంచి వచ్చిన వాడేనని క్రింది వాక్యాలను బట్టి చెప్పొచ్చు.

"నా కవిత్వం కాదొక తత్వం
కాదు ధనిక వాదం, సామ్యవాదం-
... ...

సుంకిరెడ్డి
నారాయణరెడ్డి

నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు
నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు"

(నా కవిత్వం)

ఇవీ తిలక్ తన కవిత్వాన్ని గూర్చి చెప్పుకున్న మాటలు.

తను ఏ వర్గానికి వాదానికి చెందిన వాడో తేల్చుకోక పోవడం ఇక్కడ కన్పిస్తుంది.ఇది మధ్యతరగతి మనస్తత్వం.తిలక్ కవిత్వాన్ని పూర్తిగా పరిశీలించినట్లయితే ఈ మనస్తత్వం స్పష్టంగా దర్శనమిస్తుంది. తిలక్ మధ్యతరగతి నుంచి వచ్చిన వాడు కనుక మధ్యతరగతి జీవిత చిత్రణ సమగ్రంగా చేశాడు. అది చూద్దాం.

"వీళ్ళందరూ భయపడి పోయిన మనుష్యులు
రేపటిని గురించి భయం సంఘ భయం
అజ్ఞాతంగా తమలో దాగిన తమను చూసి భయం"

(నీడలు)

ఈ వాక్యాలు మధ్యతరగతి భయ స్వభావాన్ని సూచిస్తాయి.

'మధ్యతరగతి మానవుణ్ణి ఉద్దేశించి తిలక్ "కిటికీ" "దీపం", "గొంగళీ పురుగులు" మున్నగు ఖండికలు ప్రతీక మార్గంలో రచించారు.

"చిన్నప్పటి ఆదర్శాలు అహంకారాలు నశించి
చనిపోయిన కోర్కెల్ని పాతిపెట్టిన స్మశానాల దాటుకుని
యౌవనంలో వృద్ధాప్యాన్ని తగుల్చుకొని
భయాల చాటున ఏడుపు కొండల మాటున
గుమస్తాలు టీచర్లు చిన్న చిన్న సంసారులు
కోటీశ్వరరావులు వీరేశ్వరరావులు
గొంగళీ పురుగులు లక్షలు లక్షలు"

(గొంగళీపురుగు)

మధ్యే మార్గంలో ఉండి జీవితంగడిపే వారికి గొంగళీపురుగులు సంకేతం. గొంగళీపురుగులు తిన్నంతసేపు తిని, తిరిగినంతసేపు తిరిగి, దొరికినంతసేపు అటూ ఇటు తిరిగి దొరక్కపోతే అలసి సొలసి ఏదో మూల నక్కి నిశ్శబ్దంగా ఉండి మత్తుగా నిద్రపోతాయి. మధ్యతరగతి కుటుంబీకుడూ అంతే. ఉన్నంతసేపు తినడంతప్ప కార్మికుడిలా కష్టపడలేడు దొరికినంతసేపు అప్పులుచేస్తాడు ;దొరక్కపోతే పస్తులుంటాడు చిన్నప్పటి నుంచే ఎవేవో ఊహించుకుంటాడు ; రంగుల కలలు కంటాడు ; కోర్కెల్ని గుట్టల్లా పెంచుకుంటాడు. కాని అవేవీ జీవితంలో నెరవేరవు. దాంతో, వయసులోనే వృద్ధాప్యపు ఛాయలు కన్పిస్తాయి. భార్యలకు

"సంస్కారణాలమందు గనులు
పేలేచోందు కగ్గిపుల్ల నిజాయితీ
అయినా లేని పిరికి పిల్లి మంత్రులు
ఇది మయ సభ" —రంధి సోమరాజు

బాస్‌లకు భయపడి" కోర్కెల సీక్రెట్ బాక్సులోంచి ఉద్రేకాన్ని సెక్సునీ, శృంగారాన్నీ, క్రైమ్‌నీ, షాక్‌నీ లాటరీ కాగితాల్నీ చాటుకుండా చూసుకొని, నవ్వుకుని, మీసం మెలేసుకు"నే గొంగళిపురుగులు వీరేశ్వరరావు, కోటీశ్వరరావుల జీవితం "గొంగళిపురుగులు" ఖండికలో చిత్రింపబడింది.

మధ్యతరగతి గుమస్తా జీవిత చిత్రణ"సి. ఐ. డి. రిపోర్ట్" లో సమగ్రంగా జరిగింది. ఇది ఒక గుమస్తా కథా కవిత ఐనాపురం కోటేశ్వరరావు మరణించాడు.

"డాక్టరు తీర్పుకన్నా మేనేజరు రాగానే నుంచోకపోవడమే ఇందుకు నిదర్శనం."

మేనేజరంటే గుమస్తాకెంత భయమో ఇక్కడ ధ్వనిస్తుంది.

ఇతని జీవిత చిత్రం గీస్తూ,

"ఇతనికి ఇంట్లో ఆరుగురు పిల్లలూ, ఒక ముసలితల్లీ, ఒక్క పిల్లీ, ఒక్కర్తే నీరసంగా ఉన్న భార్య.

ఇతనద్దెకున్న వాటాలో రెండున్నర గదులూ, ఒక టెలివిజన్ లాంటి బాత్ రూమూ....

ఎన్నికలలో వోటు పై అఫీస రెవరికిమ్మంటే వారికిస్తాడు
నీతీ నిజాయితీ ఉన్నవాడు నిర్మలమైన భక్తి ఉన్నవాడు
కాని చనిపోయే ముందురోజునే కనకయ్య అనే మిత్రుణ్ణి కలుసుకుని
సుఖమంటె ఏమిటి? ఎలా ఉంటుంది ఎక్కడ దొరుకుతుంది అని"అడిగాట్ట

అని గుమాస్తా జీవిత రేఖలు మన ముందు గీస్తాడు తిలక్. ఒక గుమస్తా జీవితం ఎంత నికృష్టంగా ఉంటుందో ఈ కధా కవిత చూపిస్తుంది. లోకజ్ఞానం ఉండీ, చదువుండీ, ఎవరి ఇష్టాను సారం వాళ్ళు వేసుకునే ఓటు పై అఫీస రెవరికిమ్మంటే వారికిచ్చే స్థితిలో ఉన్నాడు గుమస్తా. అంటే, ఆఫీసరంటే అంత భయమన్నమాట.

తిలక్ ప్రధానంగా భావకవైనా, అభ్యుదయ కవిత్వ లక్షణాలుగల "ఆర్త గీతం", "భూలోకం", "ప్రార్థన", "నీడలు", "టులాన్" మొదలగు ఖండికలు

ప్రాయతాన్ని బట్టి అతడు అభ్యుదయ కవిత్వానికీ, భావ కవిత్వానికీ వారధివంటి వాడు అని చెప్పొచ్చు.

"సీడలు" అనే కవితలో మధ్య స్వభావం చక్కగా చెప్పబడింది.
"గతంలో కూరుకపోయిన మనుష్యులు
సంఘపు కట్టుబాట్లకు రక్షక భటులు
శ్రీమంతుల స్వేచ్ఛావర్తనకి నైతిక భాష్యకారులు
శిథిలాలయాలకు పూజారులు
జాలీగా ఉన్నట్టు నటిస్తారు
చప్పబడిన విన్నటిమాటలే మాట్లాడుతుంటారు.
చెప్పబడిన విన్నటి కలలే తలచుకుంటారు
వీళ్ళందరూ ముక్కలైన గాజుపెంకులు
తమ చెట్టుకొమ్మని తామే నరుక్కునే అమాయకులు సంప్రదాయకులు
వాచకాలలో నీతుల్ని పల్లిస్తూ
ఓపికలేని భార్యలకు సహనాన్ని బోధిస్తూ
ధైర్యంలేని తమ స్వభావాన్ని ధర్మమని పిలుస్తూ
బరువుగా బెదురుగా బతుకుతున్న వీళ్ళ మధ్య
డైనమైట్ పేలాలి". (సీడలు)

మనకడ్డంగా ఉంటేకదా డైనమైట్ పేల్చి తొలగించుకునేది. మరి మధ్యతరగతి వాళ్ళు సమాజ పురోగతి కె తవరకు నిరోధకంగా ఉన్నారు ? ప్రగతికి అడ్డు కట్టగా ఏవిధంగా ఉన్నారు ? తిలక్ ఈ విధంగా ఎందుకున్నారు ? ఈ ప్రశ్నలకు మార్క్స్ ఎంగిల్స్ అన్నట్లు "వీళ్ళు యధాస్థితివాదులు అంతేకాదు, ప్రగతి నిరోధకులు" అని సమాధానం చెప్పొచ్చు. పై కవితలోని వాక్యాలన్నీ యధాస్థితి వాదులన్న దానికి ఉదాహరణలుగా ఉన్నాయి. ఇక్కడ మధ్యతరగతి జీవిత వాస్తవ చిత్రణ స్పష్టంగా జరగడం చూస్తే, "Art reveals the truth of life science it is an expression of man; domination of realty" అన్న Zis మాటలు యధార్థమని తోస్తాయి.

ఇక్కడ తిలక్ మధ్యతరగతి ప్రజల మధ్య డైనమైట్ పేలాలి అని అంటున్నాడంటే, కార్మికవర్గ పక్షపాతి కాబోతున్నాడనుకోవాలి. తనను తాను మధ్యతరగతి నుండి వేరుపరుచుకుంటున్నాడనుకోవాలి. మార్క్స్ ఎంగిల్స్‌లు కూడ మధ్యతరగతి వాళ్ళు త్వరలోనే కార్మిక వర్గంలో కలిసిపోతున్న దృష్ట్యానే విప్లవకరంగా ఉంటారు అని అంటారు. తిలక్ ఇంకొంత కాలం జీవించి ఉంటే కార్మిక వర్గ పక్షపాతి అయ్యేవాడేమో.

వి లు వ లు

అమ్మంగి వేణుగోపాల్

చాలా కాలంగా వెతుకుతున్న పుస్తకం ఆ లైబ్రరీలో కనిపించగానే ఆత్రంగా పుటలు తిప్పుతున్నప్పుడు, నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ,

"రవీ" అని పిలిచిందొక కంఠం.

ఈ దేశంలో నన్ను "రవీ" అని పిలిచేవాళ్ళెవరుంటారా అనుకుంటూ, నన్ను కాదేమో ననుకుంటూ తలపైకెత్తే సరికి, ఆత్రంగా అడుగులు వేసుకుంటూ వస్తున్నాడు–రాజు!

ఆ మహానగరంలో ఒక తెలుగువాడు కనిపించటం, అందునా మనం మరిచిపోలేనివాడు కనిపించటం యెంత గొప్ప అనుభవం!

చాలా ఆప్యాయంగా కావలించుకొని,

"బాగున్నావా రవీ, ఎన్నేండ్లయింది? ఐదేండ్లయింది కదా" అన్నాడు ఆర్ద్రంగా ఆ ఆప్యాయతకు క్షణంసేపు నోటమాట రాలేదు.

"అవును రాజూ, ఐదేండ్లయింది. నువ్వు పరీక్షల తర్వాత కలవనే లేదు కదా" విశాలంగా వున్న ఆ హాల్లో ఒక మూలకు వెళ్ళికూచున్నాం. ప్యూన్‌తో అక్కడికే కాఫీలు తెప్పించాడు. అతడక్కడ లైబ్రేరియన్‌గా వుంటున్నాడట. నలిగిన బట్టలు. మాసినగడ్డం. చూపుల్లో మాత్రం అదే చురుకుదనం. నా గురించి చెప్పాను. ఏ ఆఫీసులో ఎంత కాలం నుంచి పనిచేస్తున్నదీ, ఎక్కడ వుంటున్నదీ వగైరా. నా చేతిలో వున్న పుస్తకం చూసి యిచ్చేశాడు. "నాకీ పుస్తకం కావాలి రాజూ, యిప్పిస్తావా?" అడిగాను

"లైబ్రరీ దెందుకు? నా దగ్గరుంది రవీ, ఈ రోజు సాయంత్రం అట్లా ఒకసారి మాయింటికొస్తే ఆ పుస్తకం తీసుకోవచ్చు. మాయిల్లు చూసినట్టవుతుంది కూడా" అన్నాడు.

"సరే"నంటూ అడ్రసు తీసుకొని నా పనిమీద వెళ్ళిపోయాను.

X X X

"రవీ" నన్ను కాదనుకొని అవ్యక్తిని దాటబోయాను.

"నిన్నే" రవీ అంటూ చేత్తో ఆపాడు.

చిరునవ్వుతో కళ్ళల్లోకి చురుకు చురుకుగా చూస్తున్నాడు.

"సారీ, నా పేరు రఘువీర్" అన్నాను

"అవును, 'రవీ' నీ పేరుకు షార్ట్ ఫామ్.

ఆ రోజు కాలేజీ మెట్లమీద, ఆ విధంగా పరిచయమయ్యాడు రాజు.

రాజుకు పెద్దపేర్లంటే గిట్టదు. ఎంత పెద్ద పేరునైనా ఏదోరకంగా రెండక్షరాల్లో కుదించేవాడు.

జ్ఞాన ప్రసూనాంబను 'ప్రజ్ఞ' గా మార్చేశాడు.

"నా పేరును పొడిచేస్తే నేనొప్పు కోను" అందామె.

"పొడిచేయలేదండీ, సారం తీశాను" అన్నాను.

ఆమె కందిన ముఖంతో ఆమోద పూర్వకంగా నవ్వటం నాకు బాగాగుర్తు. అంతే! ఆమె అసలు పేరు మాయమైంది

నేను యిప్పుడు స్పష్టంగా గుర్తిస్తు న్నాను. అతనంటే నాకు అసూయగా వుండేది. విద్యార్థి సంఘం ఎలెక్షన్‌లో నేను రాజుతో పోటీ చేయటమే అందుకు రుజువు. రాజు ప్రచారంలో శ్రద్ధ తీసుకోలేదు. నేను డబ్బు ఖర్చు చేయటం మాత్రమే కాదు, రాజుకు ఆడపిచ్చి వుందని కొంత దుష్ప్రచారం కూడా చేశాను. ఇంతచేస్తే ఇరవై ఓట్ల తేడాతోనే గెలిచాను. ప్రిన్సిపాల్‌గారు ఫలితాలు ప్రకటించగానే, నా దగ్గరకు వచ్చి, 'కంగ్రాచ్యులేషన్స్' చెప్పి, "నిజంగా నా కంటే నువ్వే యీ పోస్టుకు తగినవాడివి రవీ" అన్నాడు ఆ అనటం మర్యాదకోసం కాదని నాకు తెలుసు.

"చిన్న టీ పార్టీ ప్లీజ్ కమాన్" అంటూ క్యాంటీన్‌లో నాకూ నా వెంట వున్న వాళ్ళకూ పార్టీ యిచ్చాడు.

నేనే ఓడిపోయివుంటే యెన్నటికీ యిలా ప్రవర్తించి వుండే వాడ్నికాదు.

నేనే అతనికి సన్నిహితం కాలేక పోయాను. అందుకే మా మధ్యన

మా స్వాతంత్ర్యోద్యమాన్ని
ముందుకు నడిపేజండా
మా నిర్భయ జీవితాన్ని
మోగే "స్వేచ్ఛా గీతం"

—అనిశెట్టి

'వైరస్నేహం' వంటిదే వుండేదేమో అతడు అమ్మాయిలతో ఎక్కువ కలిసి వుండటాన్ని నేను భరించలేక పోయే వాణ్ని. రెండో సంవత్సరంలో అతను ప్రజ్ఞతో ఎక్కువ చనువుగా వుండేవాడు

పరీక్షలకు ముందే ననుకుంటాను; అతడూ ప్రజ్ఞా పెళ్ళిచేసుకున్నారు, రిజిస్ట్రారాఫీసులో.

మేము పరీక్షల తర్వాత యిదే కలుసుకోవటం.

x x x

ఇల్లు సులభంగానే దొరికింది.

"పైకి" అన్నాడు రెండో అంతస్తు నుండి. వెళ్ళాను.

రెండే రూములున్నట్టున్నాయి. బట్టలూ, పుస్తకాలూ చిందరవందరగా పడివున్నాయి.

"నీ పుస్తకం" అంటూ యిచ్చాడు. మొదటి పుటమీద 'రవికి' అని రాసి వుంది, రాజు సంతకంతో. ఆ పుస్తకం అరుదైందే కాకుండా ఖరీదైందికూడా. సందేహిస్తూ చూశాను.

"నేను రెండు మూడు సార్లు తిరిగేశాను రవి, నిజానికి నేను వాడిందే, నాకు పనికిరానిదే, నీ కిస్తున్నాను".

ఉల్లంబులు పల్లేరుల పొరలగ
కల్లబొల్లి నవ్వుల వెదజల్లుచు
తల్లడిల్లు బానిస ప్రాణాలకు
గొల్లున యేద్పే స్వాతంత్ర్యం బెపుడో
—కాళోజీ

అన్నాడు, ఇవ్వటానికి తానే సందేహిం చాలన్నట్టుగా.

"ఒక్కడివే వుంటున్నావా?"

"అవును రవి, సంవత్సరం నుండి ఒక్కణ్నే వుంటున్నాను, ఇప్పుడు ప్రజ్ఞ నాతో వుండటం లేదు. గుప్తా అనే డాక్టరుతో వుంటున్నది." ఎంత మామూలుగా చెప్పాలనుకున్నా కొంత బరువు దొరలింది మాటల్లో.

ఒక్కక్షణం నాకేం తోచలేదు. మనస్సు ఖాళీ అయిపోయినట్టయింది. చిన్న కంపనం లాంటిది ఎక్కడో పుట్టి శరీరమంతా విస్తరించి, విడిచి వెళ్ళి పోయినట్ట పించించి.

అసలా వార్తను ఏ విధంగా తీసుకో వాలో అర్థం కాలేదు. ఇంకా వివరాల్లోకి పోవాలా? సానుభూతి చూపించాలా? మామూలు విషయంగా భావిస్తున్నట్టు నటించాలా?

రాజే మాట్లాడాడు.

"నిజం రవి, నా జీవితంలో అదొక ఎదురు చూడని అనుభవమే. ఆమెనన్ను వదలి వెళ్ళటానికి నా బాధ్యత కూడా వుంది".

"అంత అధ్వాన్నం పరిస్థితిని నువ్వు ప్రజ్ఞకు కల్గించి వుంటావంటే నేను నమ్మలేను."

"అలా అనకు నువ్వు నన్నొక మితునిగానే చూశావు. ఇంట్లో భర్తగా పురుషుని పాత్ర వేరు. ప్రతీ భర్త తన భార్యమ రూల్ చెయ్యాలనే చూస్తాడు తెలిసొతెలియకో నేనూ అదేపని చేశాను. ఆమెను మొండిగా ఉద్యోగం చెయ్యనీయ లేదు. అది నేను చేసిన బ్లండర్ ఆమెలో అసంతృప్తి ఆ విధంగా మొద లైంది. మూడో సంవత్సరం చాలా నిరు త్సాహంగా వుండేది. బహుశా యీ రొటీన్ లైఫ్‌తో, నాతో విసుగెత్తి పోయి వుంటుంది.

"మరి పిల్లలూ..." అన్నాను. ఆ నాలుగేళ్ళలో పిల్లలు పుట్టే వుంటారని వూహిస్తూ.

"లేరు. పిల్లలుకలుగకపోవటంకూడా ఆమెను చాలా వేధించింది. ఇందుకోసమే డాక్టర్ గుప్తా దగ్గరకు వెళ్ళేవాళ్ళం. అతడు తనకు తెలిసిన లేడీ డాక్టర్ దగ్గ రకు పంపించాడు. మామూలు అనారోగ్యా లకు అతని దగ్గరకే వెళ్ళేది. మంచి ప్రాక్టీస్ వున్న కుర్ర డాక్టర్. అతని ఆకర్షణకు లోనైంది."

"ఆకర్షణకు లోనవటం సామాన్య విషయమే. నీతోవున్న బంధం తెంపేసు కోవటం మాటేమిటి?"

"నేనూ ఆ భ్రమలోనే వున్నాను. నేను అనుకున్నంత గట్టిబంధం కాదది. ఆమె నాపెళ్ళాం కావటమే నా అశ్రద్ధకు కారణమేమో. ఒకవేళ పెళ్ళి చేసుకో

కుండానే. ఆమెతో సంబంధం కలిగి వుంటే ఆమె ప్రేమకోసం, తృప్తికోసం శ్రద్ధ చూపేవాణ్నేమో.

'మరి ఆమె డాక్టర్‌లో ఏంచూసింది. కేవలం పై మెరుపేనా ?'

"నేను వాళ్ళ అనుబంధం అంచనా వేసే ప్రయత్నం చెయ్యలేదు." ఇక ఆ విషయాన్ని పొడిగించటం నాకు బాగని పించలేదు. వేరేవిషయాలమీదికి సంభాషణను మళ్ళించాను. అద్దెకొంపలను గురించి, ప్రయాణపు ఇబ్బందులను గురించి, నా ట్రాన్స్‌ఫర్ ప్రయత్నాలను గురించి. కొంత సేపు మాట్లాడి వచ్చేశాను.

ఆ తర్వాత ఒకటీరెండుసార్లు రాజును లైబ్రరీలో కలుసుకున్నాను. మూడు నెలల తర్వాతనుకుంటాను, నా ప్రయత్నాలు ఫలించి తెలుగుదేశానికి ట్రాన్స్‌ఫర్ అయింది. సామానంతా ట్రాన్స్‌పోర్ట్ వాడికి అప్పగించి, ఒక లెదర్ బ్యాగ్ మాత్రం భుజాన వేసుకొని, రాజుకు ప్రజంట్ చెయ్యటానికి రెండు పెయింటింగ్స్ కొని, అతని యింటికి వచ్చాను. తలుపు మూసివుంది. లోపలి నుండి నవ్వులు వినిపిస్తున్నాయి.

బెల్లు నొక్కగానే రాజు తలుపు తీశాడు.

"హలో రవీ, నువ్వా. కమాన్" అన్నాడు.

లోనికి నడిచాను.

జలపాతం

పేదల రుధిరాశ్రువులు
పొంగి, పొంగి, జల పాతమయింది
హృదయ విపంచిక తీగెల్లో
కరంటు ప్రవహిస్తుంది.
ప్రతీ సీటీ కణం
నయాగరా ఉద్వేగం
అగ్ని పర్వతం బ్రద్దలయి లావావచ్చేలా
కందరాల కొండల నుండి
ప్రళయ శక్తి విజృంభిస్తుంది
గుండెల పిడికిళ్ళలో సము దాల్నింది
పీడిత జనం ముందంజ వేస్తుంది.

-ఎస్. సింహాచలం

ప్రజ్ఞ!

మంచంమీద కూర్చుని వులెన్ అల్లుతున్నది.

"గుర్తుపట్టావా? మన క్లాస్‌మేట్ రవి."అన్నాడు.

"నమస్కారం" అంటూ కుర్చీలో కూర్చున్నాను.

"ఓ, మీరా! కొంచెం లావెక్కారు." అంది.

ఆమె ఏమీ మారనట్టే కనిపించింది. నా ట్రాన్స్‌ఫర్ సంగతి చెప్పాను. రాజు కదలిపోయాడు.

"ఇంత తొందరగా విడిపోతామనుకో లేదు." అన్నాడు.

పెయింటింగ్స్ చేతిలో పెట్టాను

వాటిని చూసి రాజు చాలా సంతోషించాడు.

"బాగున్నాయి రవీ. ముఖ్యంగా యీ లేత పసుపు, ముదురు నీలంల సమ్మేళనం బాగుంది." అన్నాడు, ఒక పెయింటింగ్‌ను చూపిస్తూ. వెంటనే ఖాళీగావున్న మేకులకు తగిలించాడు.

"కాఫీ చేస్తాను" అంటూ లేవబోయింది. ఆ కదలికలో ఆమెగర్భంతో వున్నట్టు గమనించాను.

"వద్దులే ఎలాగూ స్టేషన్ వరకూ వెళ్తానుగదా, అక్కడే తీసుకుంటాంలే." అంటూ బట్టలేసుకున్నాడు.

ఆటోలో బయలుదేరాము. తోవలో అడిగాను.

"ప్రజ్ఞ ఎప్పుడొచ్చింది ?"

"పదిరోజులౌతోంది. డాక్టర్ గుప్తా పై చదువుకు లండన్ వెళ్ళిపోయాడు. ఈమెను తన వెంట రానియ్యలేదు. అతడు అక్కడే స్థిరపడాలనుకుంటున్నాడట కూడా."

"తప్పనిసరై నీ దగ్గరకు వచ్చిందన్నమాట."

"కావచ్చు. ఆమెతో కలసివుండటానికి నాకేమీ అభ్యంతరం కనిపించలేదు. డెలివరీ తర్వాత ఉద్యోగంకోసం కూడా ప్రయత్నించాలనుకుంటున్నాము. ఒకప్పుడు భార్యా భర్తలమనే విషయం మరచి పోగలిగితే మేం సుఖపడగలమనుకుంటా."

నేను అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాను. పొంగు తీరింతర్వాత ఒక నిశ్చలమైన అవగాహన లాంటిది వాళ్ళ నడుమ ఏర్పడిందనిపించింది.

స్టేషన్ వచ్చింది. క్యాంటిన్‌లో కాఫీ తాగుతున్నా, కంపార్ట్‌మెంటులో నా బెర్త్‌ను వెతుక్కుంటున్నా. నన్నునేను ప్రశ్నించుకుంటూనే వున్నాను. నాకు తోచిన జవాబులు యిచ్చుకుంటూనే వున్నాను.

"రాజు తిరస్కరించివుంటే?" అన్న ప్రశ్న వేసుకున్నప్పుడు, నా దృష్టిలో రాజుచేసింది త్యాగమే. 'అవసరం' అనే దృష్టితో చూసినా ఆమెకే అతని అవసరం ఎక్కువ.

కాని సాంఘికనీతి పేరుతో పాతుకున్న మనోభావాల సంగతేమిటి? వీటిని అధిగమించి ఆలోచించాడా?

అదే రాజును ప్రశ్నించాను.

"అంటే 'చెడిపోవటం' గురించేగదా నువ్వడిగేది. దాన్ని చెడిపోవటం అనుకుంటే, నేను చెడకుండా వుండేగద. మనం మనస్సులో ఎన్నో పక్కతోవలు తొక్కుతుంటాం, ఆచరణలో మాత్రమే అది తప్పు అనుకుంటే ఒప్పుకోను." అన్నాడు.

గార్డు పచ్చజెండా వూపాడు.

తెలుగు సాహితీ విమర్శ

సత్సాంప్రదాయాలకు నోచుకోలేదా?

తెలుగులో వివిధ దృక్పథాలతో వ్రాసే విమర్శకులు ఈనాడు చాలా మంది ఉన్నారు. విమర్శ రావటం లేదా అంటే వస్తోంది. గ్రంథాలు, పుస్తకాల రూపంలో గాక విమర్శనా వ్యాసాలు వెలువడుతున్నాయి. ఆ వ్యాస రచయితలు విభిన్న దృక్పథాలు కలవారే. అన్ని రకాలైన తాత్విక ధోరణులకు సిద్ధాంతాలకు, పద్ధతులకు చెందిన విభిన్న తరగతులకు చెందిన విమర్శకులు యిప్పుడిప్పుడే వ్రాస్తున్నారు. ఆయా తాత్విక ధోరణులకు వర్గాలకు చెందిన పత్రికలూ ఉన్నాయి వాటిలో వాటి వాటికి అనుగుణమైన విమర్శలు వస్తున్నాయి

సాంఘిక చైతన్యం, సమాజ స్పృహ, సమాజ విశ్లేషణం యదార్థానికి శిల్ప దృష్టికి దగ్గరగా ఉండడం-పూర్వ ప్రమాణాలు సమాజ స్పృహ లేనివి కాబట్టి అక్కర చేయకపోవడం, అన్న దృక్పథంతో చేసే విమర్శనా ధోరణి ఉన్నది. విరసంవారు మావో సూత్రాలతో సాహిత్యాన్ని కొలుస్తారు. వర్గ సాహిత్యం, వర్గ వైరుధ్యం, వర్గ సమరం సంఘానికి సిద్ధాంతానికి నిబద్ధులై ఉండడం వీరి నమ్మకాలు. నాన్ పార్లమెంటరీ విధానంతో వర్గవైరుధ్యాన్ని బలపరుస్తూ, రైతాంగ విప్లవ లక్ష్యాలతో రచింపబడే సాహిత్యాన్ని మాత్రమే గణిస్తూ మిగిలినదంతా వర్గ దాస్యం చేసే సాహిత్యం కింద పరిగణిస్తూ చేసే విమర్శనా విధానం వీరిది. పార్లమెంటరీ విధానాన్ని, సాంఘిక పరమైన సంస్కరణ వాదాన్ని మార్క్సిస్టు దృక్పథంతో జోడిస్తూ రైతాంగ కార్మికవిప్లవం రావడానికి పరిస్థితులింకా సమకూడాలన్న నమ్మకంతో మార్క్సిస్టేతర సాహిత్యాన్ని కూడా పరిగణిస్తూ పరిణామ శీలతను లక్షించి సాహిత్య సృజన జరపాలి అని అరసంలో కొందరి ప్రమాణం అయితే ఈ బాధ్యతలన్నిటినీ వహిస్తూ కూడా రచయిత పార్టీ విధానానికి నిబద్ధం కాకుండా ఉన్నప్పుడే సృజనాత్మక పెరుగుతుందన్న ప్రమాణాలతో మరికొందరు సాహిత్య విమర్శ చేస్తున్నారు. ఈ మార్క్సిస్టు దృక్పథాలు గాక, పాశ్చాత్య దేశాల్లో ప్రస్తుతం వస్తున్న సాహిత్యం మార్పులను గమనిస్తూ ఆ ప్రమాణాలను ఆలంబనంగా చేసుకుని సాహిత్య సృష్టి చేస్తున్న రచయితలతోపాటు ఆ ప్రమాణాలతో విమర్శచేసే విమర్శనా పద్ధతి ఉన్నది పాశ్చాత్య దేశాల్లో వచ్చిన వాదాలను అధ్యయనం చేసి విమర్శచేస్తున్న విధానం ఉన్నది. భార

చాగంటి తులసి

తీయ సంస్కృతి ఔన్నత్యం చాటే జాతీయ వాదంతోపాటు ప్రాచీన అలంకార శాస్త్ర ప్రమాణాలే విశ్వజనీన ప్రమాణాలు అని పాటిస్తూ ప్రాచీన సాహిత్యాన్నే గాక, ఆ దృక్పథంతో రచించబడుతున్న ఆధునిక సాహిత్యంతోపాటు, ఆ దృక్పథంలేని ఆధునిక సాహిత్యాన్ని కూడా ఆ ప్రమాణాలతో కొలిచి చేసే విమర్శ ఉంది. ఫ్రాయిడ్ సిద్ధాంతాలతో మనస్తత్వ శాస్త్ర ప్రభావంతో వచ్చిన విమర్శనా పద్ధతి ఉన్నది.

ఇన్నిరకాల ధోరణులలో వెలవడుతున్న విమర్శనా వ్యాసాల్లో పాక్షికమైన వ్యక్తిగతమైన యిష్టాయిష్టాలతో గూడిన విమర్శే కనపడుతోంది కాని వస్తువుని వస్తువుగా పరీక్షించి తటస్థతతో సాహిత్యంలో దాని స్థానాన్ని ప్రామాణికంగా నిర్ధారించే నిష్పాక్షికమైన విమర్శ ఏథోరణికి చెందిన విమర్శనలోనూ బహుతక్కువ పాలులోనే ఉంది. అటువంటి విమర్శకు కావలసిన నిజాయితీ, ధైర్యం, అవకాశం, చొరవ విమర్శకులలో కనిపించటం లేదు.

విమర్శకుడూ సంఘంలోని వాడే కాబట్టి రచయితపై ప్రసరించిన ప్రభావాలు, అతని మీదా ప్రసరిస్తూ ఉంటాయి. తన చుట్టూ గిరిగీసుకుని ఏ విమర్శకుడూ కూర్చోలేడు. అంచేత ప్రతి విమర్శకుడూ ఏదో ఒక వర్గానికో ఏదో తాత్విక సిద్ధాంతానికో చెందిన వాడు అవుతాడు. ఆయా ప్రభావాల ననుసరించి అతనిదృక్పథం ఏర్పడుతూ ఉంటుంది. Absolute తటస్థత ఏవిమర్శకుడిలోనూ ఉండడం సహజమైన విషయం కానప్పటికీ ఏదో ఒక దృక్పథానికి చెందినవాడు అయినప్పటికీ, ఆ ధోరణికి చెందిన విమర్శ నిష్పాక్షికత కలిగి వైయక్తిక రాగద్వేషాలకు దూరమైనదిగా ఉండాలి. అప్పుడే విమర్శ సరియైన వికాసాన్ని చెందుతుంది.తమ వర్గానికి చెందిన దశమ శ్రేణి రచయితలను అత్యుత్తమ రచయితలుగా బూస్ట్ చెయ్యడం కనపడతోంది. దానికి సిద్ధాంతపరమైన కారణాలే కనపడుతున్నాయి కాని సాహిత్య ప్రమాణాలు వారి రచనల్లో కనపడటం లేదు. తను ఏ వర్గానికి చెందిన వాడో, తను ఏ సిద్ధాంతాన్ని నమ్ముతాడో ఆ వర్గానికి చెందిన రచనలను, ఆ సిద్ధాంత ప్రతిపాదన జరిగిన రచనలను ఆకాశానికి ఎత్తుదామన్న పాక్షికథోరణి ఉన్నంతవరకూ ఆ విమర్శకుని విమర్శ ఉన్నత ప్రమాణాలను సంతరించుకోలేదు. ఈ విషయంలో విమర్శకుని బాధ్యత చాలా గురుతరమైనది. తన వర్గానికి చెందిన రచయిత రచనను ఉన్నతమైన సాహిత్య కొలమానాలతో కొలిచి

భూతజాతికి కొత్త రక్తం పట్టు తరుణం వచ్చెలే
పిరికి తనము నశించెలే యువ వీరులకు కనువిచ్చెలే
కుంచుకున్న నరాలలో గల మంచుసాంతం కరిగెలే
వంచకుల జిత్తులకు తలలను వంచు కాలం అరిగెలే
కంటిలో చైతన్య విద్యుత్ కళిక వెలుగై నిలిచెలే
మంటిలో బంగారు పండే మంచికాలం మొలిచెలే
ప్రాణములు బలిపెట్టి స్వేచ్ఛా పతాకము నెగరేయరా
పోయెనా స్వాతంత్ర్య సంపద ముందికెన్నడు రాదురా

— దాశరథి.

రచన ఉత్కృష్టతను గాని ఔన్నత్యాన్నిగాని చెప్పడం ఎంత అవసరమో ఆ రచయిత రచనలోని లోపాలను కూడా ఆ ఉన్నత ప్రమాణాల ప్రకారం నిర్దేశించి చూపడం అంతకన్నా ఎక్కువ అవసరం. మన తెలుగు సాహిత్య విమర్శ ఈ రకమైన ఉన్నతమైన సత్సంప్రదాయాన్ని ఏర్పరచుకుని ముందుకుసాగి ఉన్నట్లయితే ఈ రోజున మనకు అన్ని సాహిత్య ప్రక్రియలలాగే విమర్శకూడా సర్వోత్కృష్టమైన శాఖగా రూపొంది ఉండి ఉండేది. మన తెలుగు సాహిత్యపు ఉత్కృష్టత మన ఎల్లలు దాటి మన దేశభాషా ప్రాంతాల్లో తెలియడమే కాకుండా ప్రపంచ భాషా సాహిత్యాల్లో పేరుపొంది ఉండేది.

ఆదినుండి ఇటువంటి సంప్రదాయం తెలుగులో ఏర్పడలేదు. చలం రచన పడిన పేజీలు చింపి పారేస్తే తన రచనను ఆ పత్రికకు యిస్తానన్న విశ్వనాథ సత్యనారాయణలున్న మన సాహిత్యంలో - మన విమర్శలో వ్యక్తిగతమైన యిష్టాయిష్టాలు, రాగద్వేషాలు, ఈర్ష్యా అసూయలు చోటుచేసుకుని ఉన్నాయి. ఆకారణం చేతే మన తెలుగు రచయితల గురించిగాని, తెలుగు రచనల గురించిగాని పై ప్రాంతాల వారికి తెలియచేయవలసి వచ్చినప్పుడు కొన్ని సమయాలలో కొన్ని చోట్ల సాహిత్యంలో ప్రాతినిధ్యం వహించిన ప్రథమ శ్రేణి ప్రముఖ రచయితలకు బదులు ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి రచయితలను గురించి, రచనలనుగురించి ఎక్కువ చేసి చెప్పడం జరుగుతోంది. ఈ ద్వితీయ, తృతీయ శ్రేణి రచనలు చదివిన పై భాషా సాహిత్యాల వారు మన భాషా సాహిత్యపుటౌన్నత్యాన్ని తక్కువగా అంచనా

కట్టినట్లయితే అది వారి తప్పుకాదు. మన తప్పే। స్వయం కృతాపరాధమే। మన విమర్శకులు చేసిన అపరాధమే।

పాలగుమ్మి పద్మరాజుగారి కథకు అంతర్జాతీయంగా బహుమానం వచ్చిన సంగతి ఏ సభ జరిగినా ఒకసారి ఉటంకించుకుని మన తెలుగు వారు గొప్పపడి పోతూ ఉంటారు. అంతే తప్ప మన భాషలోని అనేకముల్లైన సర్వోత్కృష్టమైన రచనలు తెలుగు దేశపు ఎల్లలుదాటి వెళ్ళలేదే, మన భారత దేశంలోనే ఇతర భాషల్లోకి వెళ్ళలేదే, ప్రపంచ భాషల్లోకి వెళ్ళలేదే - ఆయా ఇతర భాషల విమర్శకుల మన్ననలు పొందలేదే అని విచారంచమేమి.మనతెలుగు రచయిత ఎవరైన బెంగాలీ శరత్‌బాబులా ఇతర భాషా సాహిత్యంలో తన ప్రభావాన్ని ప్రసరించ చేసాడా? తన ఏలుబడిని సాగించాడా? హిందీలో ప్రేంచంద్‌లా మన తెలుగు కథకుడు మన దేశపు ఇతర భాషల్లో తన ప్రభావాన్ని ప్రసరింపచేసాడా? ప్రపంచ భాషల్లోకి వెళ్ళాడా? శిల్పదృష్ట్యా ప్రేంచంద్‌కన్నా గొప్ప కథకులు మనకున్నారు. తెలుగు దేశపు ఎల్లలేగాక మన దేశపు ఎల్లలు దాటి ప్రపంచ సాహిత్యంలో తమ స్థానాన్ని నిలబెట్టుకునే మేటి కథకులు ఉన్నారు. ఆ రచనల్లో ఏ ఒక్కరన్నా కనీసం ఆంగ్లో అమెరికన్ ప్రపంచంలోకి వెళ్ళేరా? వారిలో ఎవరిదైనా పుస్తకం అమెరికాలో గాని ఐరోపాఖండంలోగాని సంచలనాన్ని కలిగించిందా? ప్రశంసలను పొందిందా? మన చలం మన దేశపు ఇతర భాషల్లోకి అతడు రాసిన రోజుల్లోనే వెళ్ళిఉంటే ఎంత సంచలనాన్ని కలిగించి ఉండే వాడు!!

ఈ విధంగా మన తెలుగు దేశపు ఎల్లలు దాటి మన సాహిత్యపు స్థాయి ప్రపంచంలో దీటుగా నిలబడాలంటే మన విమర్శ పెరగాలి. మన విమర్శకులు నిష్పాక్షికంగా మన సాహిత్యాన్ని విశ్లేషించి ప్రామాణికంగా అత్యుత్తమ శ్రేణి రచనలను ఎంచి పెట్టాలి. ఆయా రచనల అనువాదాలు ప్రపంచ భాషలన్నిటిలోకి వెళ్ళాలి విమర్శకులు చెప్పిన ప్రమాణాలననుసరించి ప్రథమ శ్రేణి రచనలు మాత్రమే అనువాదాలయి పై భాషల వారికి అందాలి. ఒక్క చూపుతో - మన ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రాతినిధ్యం వహించిన ప్రముఖ కవులు, రచయితలు వారి వారి రచనలు స్పష్టంగా కనిపించేటట్టు సమగ్రమైన విమర్శ రావాలి.

ఆదినుంచి అంటే తెలుగులో ఆధునిక రచన ప్రారంభమయిన దగ్గరనుంచి మన రచయితల్లో భావ చౌర్యం చెయ్యడం, వస్తు చౌర్యం చెయ్యడం కనపడుతూ ఉంది. కాని ఈ చౌర్యాన్ని గర్హిస్తూ, ఎప్పటికప్పుడు దానిని బహిరంగపర్చి ఎత్తి చూపెట్టే విమర్శకులు కూడా మనకు లేరు. ఇది కూడా విమర్శకుల గురు

తర బాధ్యతలలో ఒక బాధ్యత. వారి కర్తవ్యాల్లో ముఖ్యమైన కర్తవ్యం. విమర్శకులు ఈ కర్తవ్యాన్ని సరిగా పాటించినప్పుడు ఈ చౌర్యం అన్నది తగ్గి, మౌలికమైన రచన వికాసాన్ని పొందుతుంది. విమర్శకులు చౌర్యాన్ని ఎత్తి చూపెట్టినప్పుడు అది చౌర్యం అని తెలుసుకున్న పాఠకులు సాహిత్య పఠనం మరింత జాగరూకతతో మెలుకువతో చెయ్యడం అలవర్చుకుంటారు. చౌర్యం చేసిన రచయిత తన చౌర్యం బహిరంగంగా నలుగురికీ తెలిసిన తర్వాత తనను చూసి తాను సిగ్గుపడతాడు రచయితగా తన బాధ్యతని ఎరిగి నిజాయితీని అలవర్చుకుంటాడు. తనపట్ల, సంఘంపట్ల, తన రచనపట్ల నిజాయితిలేని రచయితవల్ల సంఘానికి మేలు చేకూరదు అన్న విషయాన్ని విమర్శకులు తమ విమర్శన ద్వారా స్పష్టం చెయ్యవలసిన అవసరం ఎంతైనా ఉంది.

మన విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న పరిశోధనా వ్యాసంగం విమర్శ ప్రక్రియా వికాసానికి దోహదకారిగా ఉన్నాదని చెప్పవచ్చు. అయితే పరిశోధనకి విమర్శకు వ్యత్యాసముంది పాశ్చాత్య దేశాల్లో విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా గ్రంథాలను విమర్శగా పరిగణించరు. ఉన్నతస్థాయిలో ఉత్తమ పరిశోధన విమర్శే అవుతుంది. ఉత్తమ విమర్శ పరిశోధనా గుణాలను సంతరించుకునే ఉంటుంది. అయితే పరిశోధనకు పరిశోధనేతర విమర్శకు తేడా కనపడుతుంది. విమర్శకుడు ఎంత నిష్పాక్షికంగా విమర్శించినా అతని విమర్శపై అతని ఆత్మీయతా ముద్ర ఉంటుంది. అతని దృక్కోణం నుండే అతను కట్టే విలువ ఉంటుంది. అతని నిర్ణయం అతని దృక్కోణానికి చెందినదే అవుతుంది. పరిశోధనలో విశ్లేషణ మాత్రం చేయబడుతుంది. ఇచట ఎవరినీ నొప్పించకుండా ఉండాలన్న దృష్టి ఉంటుంది. కారణం డిగ్రీ పొందాలన్న ఫలాపేక్ష దాని వెంట వుంటుంది. అందుచేత సంపూర్ణ విమర్శనా ధోరణి కాకపోవచ్చు. అంటే పరిశోధన విశ్లేషణాత్మకమైన విమర్శ అయితే పరిశోధనేతర విమర్శ నిర్ణయాత్మకతను కూడా కలిగి ఉంటుంది. నన్నయ్య తిక్కన్న, శ్రీనాథుడు మొదలైన ప్రాచీన కవులమీద ప్రాచీన సాహిత్యంమీద పరిశోధనతోపాటు ఆధునిక సాహిత్యంమీద పరిశోధన ప్రారంభమయింది, ఈ విశ్వవిద్యాలయ పరిశోధనలను విమర్శగా పరిగణించడానికి సావకాశం లేదు.

దేశంలో విశ్లేషించే బుద్ధి ఆలోచనా పెరిగిన కారణంచేత, విమర్శకుల సంఖ్య పెరిగిన కారణంచేత ముందుముందు విమర్శనా పాటవం పెరుగుతుందని, విమర్శ సాహిత్యంలో సరియైన స్థానం ఏర్పరచుకుని ఉత్కృష్టమైన సాహిత్య ప్రక్రియగా రూపొంది సత్ఫలితాలను యిస్తుందని ఆశించవచ్చును.

అసమగ్ర దృష్టి

"మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలు" అన్న పేరుతో యిటీవల బంగోరె రచించిన పరిశోధనా గ్రంథం ఏవిధంగా చూసినా విలువైందే. అయితే బంగోరె దృష్టిలోనూ, ముందుమాట రాసిన దిగవల్లి వెంకట శివరావుగారి దృష్టిలోనూ సమగ్రత్వం లోపించిందేమో అనిపించింది. "మాలపల్లి పూర్వరంగం" అన్న అధ్యాయంలో బంగోరె కొంత వివరణ అయితే యిచ్చాడు కానీ—ఈ నవలను నిషేధించడానికీ, నిషేధం తొలగించడానికీ, మళ్ళీ నిషేధించడానికీ, తిరిగి నిషేధం తొలగించడానికీ మధ్యగల కార్య కారణసంబంధాన్ని స్పష్టంగా పాఠకులముందు వుంచలేకపోయారు. పోతే శ్రీ దిగవల్లి వెంకట శివరావుగారేమో నిషేధం వెనకగల ఒక అప్రధాన కారణాన్ని అతిప్రధాన కారణంగా చిత్రించారు. ప్రముఖ చరిత్ర పరిశోధకులు శ్రీ దిగవల్లిగారు తన ముందు మాటల్లో యిలా అన్నారు.

"....ఆ కాలంలో కమ్మవారి ఆధిక్యతను, బ్రాహ్మణుల నీచత్వమును గూర్చి వుపన్యసింపని, వ్రాయని కమ్మవారు చాలా అరుదుగా నుండేవారు. ఈ పరిస్థితులలో మాలపల్లి ప్రకటింపబడినది. ప్రకటింపబడిన కొన్ని నెలలలోనే దానిని ప్రభుత్వంవారు నిషేధించారు ఈ నవలలోని కథాసంవిధానం, పాత్రపోషణ కేవలము గుంటూరు, కృష్ణాజిల్లాలలోని కమ్మ భూస్వాములను అవమానించి, వారి క్రింది కూలిజనాన్ని రెచ్చగొట్టే దురుద్దేశంతోనే లక్ష్మీనారాయణగారు రచించారని కమ్మ మహాజనసంఘంలోని ప్రముఖులు అపోహపడ్డారని, ప్రభుత్వమువారిచేత నిషేధింపచేశారని ఆ సంఘములోనివారే కొందరు వెల్లడిచేసినందువల్ల ఈ సంగతి ఆ కాలంలో బెజవాడ పట్నంలో బాహాటంగానే చెప్పుకోవడం ప్రారంభించారు."

సొదుం రామ్మోహన్

ఈ ముక్క చదివితే ఈ నిషేధం కేవలం కులాల స్పర్థకు సంబంధించిందేమో అనే భ్రమ కలగొచ్చు. నిజానికి అది వాస్తవం కాదు.

మాలపల్లిని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించడం, వెంటనే తెలుగు ప్రజలు జాతీయ చైతన్యంతో దానినితొలగింప చేయడానికి పోరాడి జయప్రదం కావడం—ఈ క్రమం అంతా వలసపాలకులకు, జాతీయ శక్తులకు మధ్య జరిగిన సాంస్కృతిక, రాజకీయ పోరాటాన్ని సూచిస్తున్నది.

ఆనాడు బ్రాహ్మణ, కమ్మ కులాల మధ్య స్పర్థలున్న మాట వాస్తవం కావచ్చు. కమ్మకులానికి చెందిన కొంతమంది ఆ పుస్తకాన్ని నిషేధింప

చేయడానికి ప్రయత్నం చేసిన మాటా వాస్తవమే కావచ్చు. అయినప్పటికీ ఈ విషయాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదుల, భారత జాతీయ శక్తులమధ్య సాగిన పోరాటంగానే గుర్తించాలి తప్ప, అలా కేవలం కుల స్పర్ధలకు పరిమితం చేసి చూడరాదు. ఆనాడు ఆ రెండు కులాల మధ్య స్పర్ధలులేకపోయినా ఆ నవలను నిషేధించే వుందురు. అడుగడుగునా జాతీయ సంస్కారాన్ని, జాతీయ చైతన్యాన్ని అణగదొక్కడానికే ప్రయత్నిస్తారు వలస పాలకులు. ఇది విశ్వవ్యాపిత చారిత్రక సత్యం. ఏ దేశ చరిత్ర చూచినా మనకీ విషయం తెలుస్తుంది. అంతెందుకు, బంగోరె గారే మాలపల్లిని నిషేధించిన కాలంలోనే మరికొన్ని పుస్తకాలనుకూడా నిషేధించారని స్పష్టంగా రాశారు.

"భారత గీతములు" "హిందూదేశము - పూర్వ ప్రస్తుత పరిస్థితులు" "పాంచాలీ పరాభవం" "స్వరాజ్య గీతామృతం" "దండాలు దండాలు భారతమాత" "స్వరాజ్య కోలాటం" "రామదండు పాట" అనే తెలుగు గ్రంధాలను 1921 లో బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించిందని బంగోరె రాశారు ఈ పుస్తకాల పేర్లు వినగానే తెలుస్తుంది దాదాపు ఈ పుస్తకాలన్నీ కూడా జాతీయ చైతన్యాన్ని ప్రేరేపించడానికి వుద్దేశించినవే అని.

'మాలపల్లి' తొలి నిషేధానికి ముందున్న పరిస్థితులను గమనిస్తే, బ్రిటిష్ వారి దృష్ట్యా ఆ నవలను నిషేధించడం ఎంత అవసరమో తెలుస్తుంది. దేశమంతటా జాతీయ చైతన్యం పెల్లుబికిన కాలమది. ఎంత చిన్న కారణం కనిపించినా జాతీయ పోరాటం భగ్గుమంటున్న రోజులవి. 'మాలపల్లి' తొలి నిషేధానికి మూడునాలుగేళ్ళ ముందు దేశంలోనున్న పరిస్థితిని వివరిస్తూ ఒక సాహిత్య విమర్శకుడు యిలా రాశాడు. "పంజాబ్‌లో రౌలట్ చట్టం అంతకుముందే అమల్లోకి వచ్చింది. జలియన్‌వాలా బాగ్‌చ హత్యాకాండ అప్పుడప్పుడే జరిగింది. బ్రిటిష్ వ్యతిరేకత పైవర్గాల్లోనే అయినా దావానలంలా వ్యాపిస్తున్నది; జాతీయతా భావం గ్రామసీమల్లోకి, సామాన్య జనంలోకి ప్రవేశిస్తున్నది. విద్యాధికుల సంస్థగా వుండిన కాంగ్రెస్ సామాన్య ప్రజా రాజకీయ సంస్థగా రూపాంతరం చెందుతున్నది. బ్రిటిష్ ప్రభుత్వం పట్ల సహాయ నిరాకరణకూ, విదేశీవస్తు బహిష్కరణకూ గాంధీనాయకత్వాన కాంగ్రెస్ పిలుపు యిచ్చింది. సహాయ నిరాకరణలో భాగంగా విద్యార్థులు కాలేజీలువదిలిపెట్టి, జాతీయోద్యమంలో పాల్గొంటున్నారు. విదేశవస్తు బహిష్కరణలో భాగంగా విదేశ వస్త్ర దహనం ఆవేశపూరితమైన ఉద్యమరూపం ధరించింది."

ఈ పరిస్థితుల పూర్వరంగంలో బ్రిటిష్ ప్రభుత్వం, జాతీయోద్యమ చైత

అపూర్వ కవిత్వం

అపూర్వమైన మహాకవిత్వం రాద్దామని
ఉత్ప్రేక్షల కోసం, ఉపమానాల కోసం
ఉత్ప్రేరకాల కోసం ప్రకృతిని పరిశీలిస్తూ
కొండలూ కోనలూ దాటాను
మైదానాలూ నదీనదాలూ లంఘించాను
ఏళ్ళూ పూళ్ళూ గడిచాయి-వృద్ధాప్యం పైబడింది
నానుండి రావలసిన మహాకవిత్వం
అంతర్మథనంస్థాయిలోనే ఇగిపోయింది!
ఇప్పుడు
శిథిలమైన గుండెతో-శిథిలమైన శరీరంతో
నా విఫల యాత్రా విశేషాలు స్మరించుకోవడం తప్ప
నే చేయగల్గిందేముంది ?
నా మహాకావ్యం కోసం నే
సమకూర్చుకొన్న పదాలకు రెక్కలొచ్చి
అనంత విశ్వంలోకి హాయిగా ఎగిరిపోయాయి
ఊహా చిత్రాలకు వేళ్ళువచ్చి భూమిలోకి నాటుకొని
ఆకు పచ్చని కాంతిగుండ్లను భూమి మీదకు పేల్చాయి!
నా కావ్యఖండాలు సోదరకవుల కవితలలో
వికారరూపాలతో సర్కస్ జంతువుల్లా
వికృత నాట్యం చేస్తున్నాయి
మిగిలిన నా కావ్యశకలికలు
సహస్ర రీతుల ఛిద్రమై
నేడో రేపో కూలిపోబోయే
నా హృదయపు పాతఇంటి గోడలకు
'బులెట్' బోర్డుతో వ్రేలాడుతున్నాయి!
రసలుప్తమై అసూర్యం పశ్యమైన
నా మహాకావ్య చరిత్రను
భావి చరిత్రకారులు
భూమినుండి త్రవ్వితీసిన నా ఎముకల
మీద చదువుతారు
లోకానికి పాఠంనేర్పుతారు !

—శశికాంత్ శాతకర్ణి

ప్రజాస్వామ్యమంటే
పోలీసురాజ్యమని
ఆగస్టు 15 రాకపోతే
మాకర్థమయేదే కాదు

—వరవరరావు

న్యాన్ని ప్రేరేపించే 'మా. పల్లి' నవలను నిషేధించింది. దానిని అప్పటి దగ్ధమాన పరిస్థితుల్లో నిషేధించకుండా వుండడమంటే కోరి ప్రమాదాన్ని తెచ్చుకోవడమే.

ఒకానొక చారిత్రక సన్నివేశంలో రెండు వ్యతిరేక శక్తుల సంఘర్షణ స్వరూపాన్ని గమనించకుండా అలా కులాలను కారణంగా వ్రాయడం సమగ్ర దృష్టిని కోల్పోవడమే అవుతుంది. ఈ దృష్టిని ఇతర ఘటనలకూ, పరిణామాలకు కూడా అన్వయింప చేయడానికి ఆయన కానీ, మరొకరు కానీ, ప్రయత్నించవచ్చునన్న వుద్దేశంతో యీ రెండు ముక్కలు రాయవలసి వచ్చింది.

ధర్మానికి కాళ్ళుండవు. న్యాయానికి కళ్ళుండవు–ఇది నిజం–

ధర్మం కుంటిది, న్యాయం గుడ్డిది.

కుంటిదానిమీద గుడ్డిదీ, గుడ్డిదానిమీద కుంటిదీ ఆధారపడి ఉన్నాయి. కుంటి న్యాయం, గుడ్డి ధర్మాన్ని భుజాలమీద మొయ్యబడుతుంది. అటువంటి న్యాయం

ధర్మానికి ఎన్ని కాళ్ళు?

ధర్మం సామాన్యుడుకి ఎంత అందుబాటులో ఉంటాయో గ్రహించవచ్చు.

ఎప్పుడో ధర్మం నాలుగుపాదాలమీద నడిచేది! న్యాయం వెయ్యికళ్ళలో చూసేది! ఈ కలియుగం వచ్చేసరికి ప్రథమ పాదంలో ప్రథమంగా వాటి పాదాలు తెగనరకడం, కళ్ళు ఊడపీకడం జరిగేయి ఎందుకండీ ఈ ధర్మం, న్యాయం? త్రేతాయుగం కబురు చెప్తారేం? కలి ధర్మం, కలి న్యాయం మనకి ముఖ్యం కదా?

ధర్మం అంటే ఏమిటి? న్యాయం అంటే ఏమిటి?

ధర్మం అంటే రివాజు–న్యాయవర్తన అంటే ఆ రివాజు ప్రకారం నడుచుకోవడమే కదా? వాటిని అతిక్రమిస్తే అధర్మం అన్యాయం–

మేక ఆకులూ అలమలూ తినడం ధర్మం–అది మనిషి మాంసం కాని పులి మాంసం కాని కోరితే అది అన్యాయం, అధర్మం. పులి మనిషినీ, తక్కిన జంతువులనీ చంపి తినడం ధర్మం–గడ్డి పళ్లూ, కాయలూ తింటానని అంటే పులి జాతితో అది అధర్మం, అన్యాయం!

ఇంక మనిషి దగ్గరకు వచ్చేసరికి ఏది న్యాయం, ఏది ధర్మం, ఏది అన్యాయం, ఏది అధర్మం నిర్ణయించుకోడం కష్టంగా ఉంది. నా ధర్మంమీకు అధర్మం, మీ న్యాయం నాకు అన్యాయం అవుతోంది.

మనిషి పులినీ చంపుతున్నాడు, మేకనీ చంపుతున్నాడు, సాటి మనిషినీ చంపుతున్నాడు. కాయలూ తింటున్నాడు జంతు మాంసమూ, నర మాంసమూ భక్షణ చేస్తున్నాడు.

జీవకోటిలో మనిషి ఒక్కడికే తెలివి

న్యాయానికి ఎన్ని కళ్ళు?

తేటలున్నాయి కాబట్టి, అది కోరలకన్న, వాడి గోళ్ళకన్న శక్తివంతమైనది కాబట్టి, తను సమస్త ప్రాణికోటికీ ఏర్పరిచిందే ధర్మం, న్యాయం అంటున్నాడు తన స్వార్థానికీ, తన మంచికీ ఉపయోగపడేదే, ధర్మం, న్యాయం అంటున్నాడు.

మంధా వెంకటరమణారావు

నడుస్తున్న చరిత్ర కొప్పులో ఉద్యమాల విరజాజులు
కాలం విప్లవపాణి
అచలాన్ని కదిలిస్తాను అందుకే వజ్రంలా పదునెక్కిన పాట
అమృతాన్ని కొం తెస్తాను అందుకే పక్షిలా ఎగిరే సేన్యా సాకం క్యాలనాట
వడివడిగా నడుస్తోంది చరిత్ర-
ఓంటరినై పోతా బద్ధకించి వెనుకబడితే-
ఎదురేగి స్వాగత మిస్తాను
ఈలోగా మరో ఉద్యమం పుడితే

— కుందుర్తి.

మానవులూ, దానవులూ, దేవతలూ అన్న మూడు తెగలూ మానవులలోవే. దానవులు రాజ్యం ఏంతారు. భోగాలను భవిస్తారు-

మానవులు ఏలబడతారు. కష్టపడతారు. చెమటా, రక్తం కన్నీరు కారుస్తారు. దుఃఖాలననుభవిస్తారు. దానవులకి మరింత శక్తి నివ్వడానికి పాటు పడతారు.

ఇంక దేవతలు....ఏ ఎండకా గొడుగు పట్టి, అటు రాక్షసులనీ మెప్పించి, ఇటు మానవులనీ మెప్పించి, వారికీ వీరికీ సలహాలిచ్చి, కడుపులో చల్ల కదలకుండా హాయిగా కాలం గడుపుతారు.

భూమిమీద మన కాళ్ళుతెగిన ధర్మం, కళ్ళులేని న్యాయం రాజ్యపాలన చేసే రాక్షసులకి ఉపయోగ పడేదిగా ఎర్పరచబడింది.

శక్తే హక్కులనిస్తుంది కాబట్టి, శక్తి ఉన్నవారే రాక్షసులవుతూ రాజ్యం ఏలుతున్నారు కాబట్టి, ధర్మం ఏమిటో, నాయ్యం ఏమిటో చెప్తాడు వాడు.

దొంగతనం పాపం అని రాక్షసుడన్నాడు- మనిషి విన్నాడు- దేవత సరేనన్నాడు.

ఎవరు ఎవర్ని దోచుకోడం పాపమో ధర్మశాస్త్రం విడమర్చి చెప్పదు స్పష్టీకరణం కోసం న్యాయస్థానానికి వెళ్ళేవారు చెప్తారు-

ఏం చెప్తారయా వారు ?

ఉన్నవాడిని లేనివాడు దోచుకుంటే అది పాపం - అన్యాయం - అధర్మం- అక్రమం-

లేనివాడిని ఉన్నవాడు దోచుకోడం పాపం కాదు.

దాకి సంజాయిషీ వినండి-

ధనవంతుడూ, ధనహీనుడూ ఈ వ్యవస్థలో ఉండవచ్చు, ఉండితీరాలి అని ధర్మం చాటుతున్నప్పుడు, ధనవంతుడు దోచుకొంటే ఎలా తన ఉనికిని నిలబెట్టుకోగలడు? దోచుకోబడనిదే గరీబు ఏలా ఉంటాడు? అందువల్ల అదిధర్మమే లేనివాడు ఉన్నవాన్ని రూపు మాపుదామనుకుంటే అది అధర్మం అవుతుంది

అబద్ధం ఆడకూడదు అంటుంది

ధర్మశాస్త్రం-కాని అబద్ధం అ ద న ని ప్రమాణంచేసిన సాక్షి అంతా అబద్ధమే చెప్తాడు. అతని దగ్గర అబద్ధమే రాబట్టి ఆ అబద్ధం ప్రకారం తీర్పు నిస్తాడు న్యాయమూర్తి. అంటే బోనులో ప్రమాణం చెయ్యగానే నిజం అబద్ధం గానూ, అబద్ధం నిజంగానూ చెలామణి అవుతుంది.

ఈ న్యాయం ధర్మం ఎవరికి దొరుకుతున్నాయి? డబ్బు లేనివాడు ఏనాడన్నా తన హక్కులకోసం కోర్టులకి వెళ్ళగలిగేడా? ఒకవేళ వెళ్ళి చిన్న కోర్టులో లేనివాడు గెలిచినా, పెద్ద కోర్టులకి అపీల్ చేస్తున్నాడు ఉన్నవాడు - ఏడు పర్వతాలెక్కి ఏడు కొండల సామిని చూసినట్టు, లేనివాడిని ఏడు కోర్టులూ తిప్పి ఏడు చెరువుల నీళ్ళూ తాగిస్తాడు ఉన్నవాడు. లేనివాడు మొదటికొండ ఎక్కే సరికే సరి!

చిన్నకోర్టులో తీర్పుఇవ్వబడ్డాక, మరి అపీలుకి అవకాశం ఎందుకో ? సమ్మతం, న్యాయ సమ్మతం కాదనా? లేక కింద కోర్టులవారు న్యాయంగా, ధర్మంగా తీర్పు ఇవ్వలేరనా?

ఇంక సాక్షుల సంగతి విచారిద్దాం-సాక్షాలు అమ్మబడతాయికొనబడతాయి-తుంబయ్య అనే లక్షాధికారి తరపున ఖూనీ కాని, ఏ తదితర నేరం కాని చెయ్యడానికి,మురికివాడ వెళ్ళి దలాల్‌లు కేక వెయ్యగానే పరుగున వస్తారు దంబయ్య లెందరో - దంబయ్య ఆ కూని చెయ్యలేదనీ, తాము స ద రు దంబయ్యని మరో ఊరిలో అదే సమయానికి చూశామనీ చెప్పడానికి వంద మంది సాక్ష్యులు వస్తారు - బోనులో నిలబడి, ప్రమాణంచేసి, అంతా అబద్ధమే చెప్పి దానికి నిజమనే కోతని కడతారు - న్యాయానికి చెవు లే కాని కళ్ళుండవు కాబట్టి న్యాయమూర్తి, ఆ అబద్ధాలని నిజాలుగా నమ్మనైనా నమ్మాలి లేదా పదవికి రాజీనామా ఐనా చెయ్యాలి! రాజీనామా చేస్తే, పెళ్ళాం పిల్లలో?

ఇంక...నిజమే చెప్పాలి? అబద్ధం ఆడకాదు అన్న నీతి ఎవరు ఎవరికోసం ఏర్పరిచినట్టు ?

రాముడి కాలంకోనో, కృష్ణుడి కాలంలోనో (అతడు చాలా అబద్ధాలాడేడు) ఏలేగాడు ఏలబడే ప్రజల కోసం ఏర్పరిచింది ఆ నీతి! కలిమి కలవాడు, కలిమి లేనివాడిని పాటించమనే ధర్మ సూత్రం అది! తన ఏలుబడిలో, ఇలా కాలో ఉన్నవాడు అబద్ధం ఆడుతే మరి తను పట్టి కొట్టుకపోడూ? అందరూ అబద్ధాలాడేస్తే, తన అబద్ధాలకుండేవిలువ ఏమిటి ? వాళ్ళు నిజం చెప్పాలి...తను అబద్ధంచెప్పాలి....తన అబద్ధం అప్పుడు నిజంకింద చలామణీ అయి తన ధనాన్నీ అధికారాన్నీ ఎక్కువజేస్తుంది. వాళ్ళు చెప్పేది నిఖరంగా నిజమే కాబట్టి తను అనిజాల ఆస్కారంతో లాభాలు చేసుకోవచ్చు, మేడలు కట్టొచ్చు....రాజ్యాలేలవచ్చు...చిన్నప్పటి కథలో లాగ, నిజం చెప్పిన అబ్బాయిని దొంగ వదిలేసినట్టు, ఈ నాడు ఈ పురానా దొంగలు వదిలీరు- మీకు తెలీకుంటా

కరిగెను స్వతంత్ర స్వప్నము
ఇరువదేండ్లనాటి కతలన్ని వెతలయినవి
ప్రజాపతులకు వినబడియెను
అగత్యమై వికటవ్యాఖ్య

—ముకురాల రామారెడ్డి

మిమ్మల్ని దోపిడీచేస్తారు నిజాన్ని రాబట్టేక!

అందువలన అన్యాయం, అక్రమం మార్గంగా పెట్టుకున్నవాడు, న్యాయం అంటే ప్రాణం ఇచ్చేవారినే తన పల్లకీ బోయీలుగా పెట్టుకుంటాడు! ప్రజల ప్రవర్తనని అదుపులో పెట్టేవరకు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లూ, ఇండియన్ సివిల్ కోడ్‌లూ ఏర్పరుస్తారు. ఆచట్టాం ప్రకారం ప్రజలు నడవకపోతే...... "అన్యాయిం! ఆధర్మం!" అని అరుస్తాడు పైసా, పవరూ, పరపతీ ఉన్నవాడు-తను మాత్రం ఈ చట్టానికి అతీతుడ్నని భావిస్తాడు!

వ్యాపారం అన్న లేబిల్ క్రింద వాణిజ్యం అన్న ముద్ర కింద ఎన్ని దోపిడీలు చేసి లాభాలు లాగినా అది ధర్మం అవుతోంది, కాని ఆకలితో చావు బతుకుల్లో ఉన్నవాడు ఓ రొట్టి డబ్బులు చెల్లించలేక కౌంటర్ నించి తీసుకుంటే అది దొంగతనం ఔతోంది - నేరం ఔతోంది! వాడు తిండిలేక చావనైనా చావాలి కానీ, డబ్బులివ్వకుండా రొటె ఎత్తుకెళ్ళడానికి పనికిరాడు! వాడు చస్తే సమాజం దోషిగా నిలబడదు... ప్రభుత్వం... దాని మంత్రులూ దోషులుగా బోనెక్కరు!! ఏలేవాడికి, వాడి ప్రభుత్వానికి చట్టాలూ, చట్టుబండలూ వర్తించవు!

అందువల్ల ధర్మానికి కాళ్ళు ఉండవు న్యాయానికి కళ్ళు వుండవు!

ఆకలి నృత్యం

—శీలా సుభద్రాదేవి

నిప్పులు చెరగే ఎండ కరుస్తోన్న మిట్ట
మధ్యాహ్నం
పెనంలాకాలిపోతున్నా నాపరాతిగచ్చుపై
ఏడు శిశిరాలు మోసిన చిన్నది
సున్నబొట్ల దిష్టికుండ ముఖంతో
గజ్జెగట్టిన కాళ్ళతో
అసహ్యంగా డేన్సు చేస్తోంది.
చింకిబట్టల అన్న
వంకరమూతితో పాడుతున్న సినిమా
పాటకు
ఆ పసిపాదాలు మండు టెండలో
పదానికి అనుగుణంగా కదులుతున్నాయి
అవే పాదాలు
కలవారి యింటిలో ఉంటే కలువపూలై
కదిలితే కందుతాయేమోనని
కార్లలోనే తిరిగేవేమో-
కనీసం మధ్యతరగతి మందార
పాదాలైతే
మామూలు చెప్పులైనా
ఆ పాదాలను కౌగలించేవేమో-
ముందే దరిద్రం కౌగలించుకుందేమో
నిప్పు తొక్కిన కోతిలా
మండుటెండలో కదంతొక్కుతున్నాయి!
ఆకలితో పేగులు అరిచినట్లుగా వుంది
ఎలుగు రాసిపోయిన ఆ పాట
పైసాకోసం కన్ను కొడుతున్న ఆ
పసిపాప
వెయ్యి చేతులతో వెయ్యికాళ్ళతో
అన్ని కాళ్ళకి గజ్జెలతో విశ్వరూపంతో
ఆకలే నృత్యం చేస్తున్నట్లుంది
ఆ గజ్జెల చప్పుడు
గుండెల్ని బద్దలు చేస్తోంది.

ప్రేంచంద్ శతజయంతి వ్యాసం

ప్రజాసాహితీ నిర్మాత ప్రేంచంద్

పసల భీమన్న

ప్రేమ్‌చంద్ ప్రజారచయిత, ఆయన పీడిత ప్రజల కష్టసుఖాల్ని, ఆశా నిరాశల్ని, జీవిత పోరాటాన్ని చిత్రించిన గొప్ప హిందీ రచయిత. అనాటి దోపిడీ వ్యవస్థ మారాలని కాంక్షించి, అందుకు తన కలాన్ని ఓ శక్తివంతమైన సాధనంగా ఉపయోగించిన సాహిత్యవేత్త. భూస్వామ్య వ్యవస్థలోని దోపిడీ వర్గాల అన్యాయాన్ని, అవినీతిని, కుట్రల్ని, కుతంత్రాల్ని బయట పెట్టిన కళాకారుడు. అభ్యుదయ భావాలతో, జీవిత సత్యాలతో, కష్టజీవుల కన్నీటి గాథలతో నిండిన ఆయన రచనలు నేటి యువతరానికి గొప్ప ఆదర్శంగా నిలుస్తాయి.

ప్రేమ్‌చంద్ అసలు పేరు ధనపతిరాయ్ శ్రీవాస్తవ్. 'ప్రేమచంద్' అతని ఉపనామము, అయన 1880 లో కాశీ సమీపమున 'లమహి' అనే చిన్న గ్రామంలో పుట్టారు. అతని తండ్రి బీద గుమస్తా. చిన్నప్పుడే తల్లిమరణించింది తర్వాత తండ్రి రెండవ పెళ్ళి చేసుకొని, కొన్నాళ్ళకు ఆయన కూడా మరణించారు దానితో కుటుంబ భారం ప్రేమచంద మీద పడింది. ఆయన జీవితాంతం కడు బీదవానిగా ఎన్నో కష్టాలు అనుభవించారు. ఒకసారి, రైలు ప్రయాణానికి డబ్బు లేకపోతే, మంచి చలికాలంలో తన ఉన్నికోటు అమ్మవలసి వచ్చింది. ఆదాయాన్ని పెంచుకోవాలని ఐదు రూపాయాలు సంపాదించడానికి పదిమైళ్ళు నడిచి వెళ్ళి ట్యూషను చెప్పేవారు ఇంకొకసారి ఆకలిబాధ తీర్చుకోడానికి లెక్కల పుస్తకం అమ్మేశారు అది చూసి ఓ హెడ్మాష్టరు దయతలచి, తన స్కూల్లో నెలకు పదు నెనిమిది రూపాయిలు జీవితంమీద ప్రేమచంద్‌ను టీచరుగా నియమించాడు. ఇలా జీవితాంతం దారిద్ర్యంతో పోరాడుతూ, ఉద్యోగం చేస్తూ, ఆయన కథలు వ్రాసేవారు ప్రైవేటుగా చదివి, బి. ఏ. పాసయ్యారు.

ప్రేంచంద్ వ్యక్తిత్వం, ఆయన కళ - రెంటికీ చాలా దగ్గర సంబంధం ఉంటుంది. ఆయన, మానవత్వం మూర్తీభవించిన మేధావి. కేవలం దళితవర్గాల గురించి కథలు వ్రాయడమేగాక, నిజజీవితంలో అనేకమంది బీదవారికి సాయంచేసే వారు కూడ. మొదటి వివాహం విఫలమయితే; ఆయన ఓ వితంతువును చేసుకుని, నాటి సాంఘిక దురాచారాల్ని, మూర్ఖ సంప్రదాయాల్ని ఎదిరించిన సంఘ

చచ్చితినందు నా స్వాతంత్ర్య వీర జీవన భావనలలోన బతికియుంటి
బతికితి నందునా పారతంత్ర్యము పీల్చి పచ్చినెత్తుట బడి చచ్చియుంటి
చచ్చితి నందునా స్వారాజ్యలక్ష్మి భారత సౌధ కుడ్యాల బతికియుంటి
బతికితి నందునా స్వార్థ సంకుచిత దంష్ట్రిలచిక్కి ముక్కలై చచ్చియుంటి

— బాపురెడ్డి

సంస్కర్తగా వృద్ధిచెందారు. తలుచుకుంటే, స్కూళ్ళ ఇన్స్పెక్టర్‌గా ఉంటూ, ప్రామోషన్‌లు పొందుతూ, నాల్గు డబ్బులు సంపాదించుకొనే వారే. కాని, సహాయ నిరాకరణోద్యమంలో ఆయన ప్రభుత్వోద్యోగానికి రాజీనామా చేశారు. కార్లు సంపాదించి, బంగళాలు నిర్మించి, విలాస జీవితం గడపాలనే కోరిక ఆయనకు ఎన్నడూ లేదు. అసలు ధనికులన్నా ధనిక జీవితమన్నా ఆనయకు గిట్టదు ధనికుల తెలివి తేటల్ని, వారి కళని ఆయన మెచ్చుకునేవారు కాదు. బీదవారిలో తనూ ఒక బీద వానిగా ఉన్నందుకు ఆనందించేవారు. ఆయన తన ముప్పై సంవత్సరాల సాహిత్య జీవితంలో విశ్రాంతి ఎరుగని కర్మవీరుడు. "నేను హాయిగా కూర్చోదల్చుకోలేదు. ప్రతిక్షణం సాహిత్యానికి, స్వదేశానికి ఎంతో కొంత సేవచేస్తూ ఉండాలని నా కోరిక. అని ఒక మిత్రునికి వ్రాసిన ఉత్తరంలో తెలియజేశారు.

ప్రేంచంద్ 1914 నుండి హిందీలో రచన ప్రారంభించారు. అంతకుముందు ఆయన ఉర్దూలో (1905 నుండి) వ్రాసేవారు. ఆయన సుమారు 300 కథలు, 10 నవలలు, నాలుగు నాటకాలు, కొన్ని వ్యాసాలు వ్రాసారు. ఎన్నో అనువాదాలు కూడ చేశారు. హిందీ కథ, నవలా రంగాలలో ఆయన యుగకర్త, ఆయనకు 'నవలా చక్రవర్తి' అని బిరుదుకూడా ఉంది.

ప్రేమచంద్ రచనలలో కథా వస్తువు గ్రామ జీవితం, వాటిలో ఎక్కువగా రైతుల జీవితాన్ని చిత్రిస్తారు. గ్రామ ప్రజల దారిద్ర్యాన్ని, ఆకల్ని, అజ్ఞానాన్ని, మూఢనమ్మకాల్ని, చిత్రించడంలో ఆయనకు ఆయనే సాటి మన గ్రామాల వాస్తవిక కఠోర పరిస్థితుల్ని తెలుసుకోవాలంటే, ఆయన రచనల్ని చదవాలి. భూమిని దున్ని, పంటలు పండించే రైతుకు ఆ పంటమీద అధికారం లేకపోవడం ఆయన కళ్ళారా చూసి కరిగి పోతారు. 'పుష్య మాసపు రాత్రి' అనేకథలో ఆయన ఇలా వ్రాస్తారు—"రైతు ఇంట్లో లోహపాత్రలుగాని, బొంతగాని, మంచంగాని లేదు. శీతాకాలపు చలిగాలి నుండి కాపాడుకోడానికి కనీసం ఒక పొగాకు ముక్కైనా లేదు.

"ఆయన గ్రామ ప్రజల్ని రెండు వర్గాలుగా చిత్రిస్తారు—పీడక వర్గం, పీడిత

వర్గం. జమీందారులు, భూస్వాములు, పెట్టుబడిదారులు, వడ్డీవ్యాపారులు, ప్రభుత్వోద్యోగులు మొదలైనవారు దోపిడీ వర్గంలోకి వస్తారు. పీడిత వర్గంలోకి హరిజనులు, వెనుకబడ్డవారు, రైతులు, కూలీలు, వితంతువులు మొదలైనవారు వస్తారు ధనమదం, అధికారదాహం, మానవత్వం, ప్రజాసేవ, త్యాగం, ఆత్మాభిమానం, సంప్రదాయాలపై తిరుగుబాటు, దేవుడు, మతం పేరిట మోసాలు, ప్రేమికుల ప్రేమ, మాతృత్వపు మాధుర్యం—ఇలా ఎన్నో విషయాలను ఆయన వర్ణించారు, తన రచనల్లో.

"గోదాన్" అనే నవలలో హోరీ అనే రైతు భూస్వామ్య దోపిడికి బలై, ఎలా కూలివాడౌతాడో ప్రేమచంద్ హృదయవిదారకంగా చిత్రిస్తారు. దోపిడీని గురించి ఆయన ఆ హోరీ నోటినుండి ఈ మాటలు అనిపిస్తాడు —"అప్పులగురించి, గౌరవంగురించి విచారించనివారు లావు అవుతారు. ఈ కాలంలో లావు అవడం సిగ్గుచేటు. వంద మందిని బలహీనపరిస్తే, ఒక్కడు లావు అవుతాడు. అలా ఒక్కడూ లావు అవడం ఏం సుఖం ? అందరూ లావు అయినప్పుడే సుఖం." ఒక్క రైతులనేగాక, రకరకాల ప్రజల్ని ఆయన తన రచల్లో చిత్రిస్తారు. ఆయన సాహిత్యం ఎంత విశాలమైనదంటే, భారతీయ జీవితంలోని ఏ అంశాన్నీ ఆయన చిత్రించకుండా వదల్లేదు బీదలన్నా, పీడితులన్నా, అణచబడిన వారన్నా ఆయనకు ఎంతో సానుభూతి. అందుకే, సమస్యలతో సతమతమయ్యే సామాన్య ప్రజానీకం కోసం ఆయన కలం పడతారు.

'నిర్మల' అనే నవల్లో వరకట్నం, ఈడూ-జోడూ కుదరని వివాహ సమస్యలు, 'ప్రేమాశ్రమం' నవల్లో గ్రామీణ సమస్యలు, 'సేవాసదనం' నవల్లో వేశ్యల సమస్య, 'గోదాన్ నవల్లో రైతుల సమస్యలను ఎంతో వాస్తవికంగా చిత్రిస్తారు. ఇలా, సమస్యలనే ప్రధానంగా తీసుకొని, సామాజిక వాస్తవికతను చిత్రించడం ప్రేంచంద్ ప్రత్యేకత. ఆయనకు పూర్వం హిందీలో కాలక్షేపానికి పనికివచ్చే కట్టు కథలు, శృంగార గాథలు తప్ప, వాస్తవిక సాంఘిక జీవితాన్ని ప్రతిబింబించే రచనలు లేవు. కాని, ఆయన వినోదంకోసం కాక, రాజకీయ, సాంఘిక, ఆర్థిక సమస్యల గురించి తన భావాల్ని వ్యక్త పరచడానికి తన రచనల్ని సాధనంగా ఉపయోగించారు అంటే ఆయన ఒక సాంఘిక ప్రయోజనం కోసం రచనలు చేశారన్నమాట. సామాజిక, ఆర్థిక, రాజకీయ దాస్యంలో మగ్గే ఆనాటి భారతీయ సమాజం యొక్క వికాసక్రమాన్ని చూపటమే ఆయన లక్ష్యం. అభివృద్ధి చెందడానికి అందరికీ సమాన అవకాశాలు ఉండాలని కోరుతూ సమానత్వమనే ఆదర్శాన్ని ప్రచారంచేసిన ప్రజా సాహిత్య నిర్మాత, ప్రేంచంద్.

ప్రేంచంద్ అభ్యుదయ సాహిత్యం లక్ష్యాలను గురించి అనేక ఉపన్యాసాల్లో కూడ స్పష్టంగా చెప్పారు. ఉదాహరణకు, 1936 ఏప్రిల్‌లో అఖిల భారతీయ

నీ చేతుల బంధించిన సంకెళ్ళను త్రెంచాలని
నీ సంతతి స్వేచ్ఛలోన ఊపిరి పీల్చాలని
స్వేచ్ఛకొరకు జరిగే విప్లవ సమరంలో
క్షతగాత్రుడవై పడిపోయిన మనిషీ !
నీ త్యాగం వృథా కాదు... —సోమసుందర్

అభ్యుదయ రచయితల సంఘం మొదటి సమావేశంలో ఆయన అధ్యక్షోపన్యాసం ఇస్తూ ఇలా అన్నారు. "రచయిత లేక కళాకారుడు స్వభావత: అభ్యుదయవాది. ఇది అతని స్వభావం కాకపోతే అతను రచయితే కాలేడు; తనకి లోపల - బయట కూడ లోటు కనిపిస్తూ ఉంటుంది. ఈ లోటును భర్తీ చేయడానికి అతని ఆత్మ ఆవేదన పడుతుంది." ఆనాటి ఉపన్యాసంలోని చివరి మాటలు ఇవి." గొప్ప ఆలోచన, స్వతంత్ర భావం, సౌందర్య పిపాస, సృజనాత్మకత, జీవితసత్యాల వెలుగు- ఇవన్నీ ఉన్న సాహిత్యమే మన గీటురాయికి నిలుస్తుంది. అది మనలో చైతన్యం, సంఘర్షణ, ఆవేదన కల్గించాలి. అది మనల్ని నిద్ర పుచ్చకూడదు. ఎందుకంటే ఇప్పుడు ఇంకా ఎక్కువ నిద్రించడం మృత్యువు లక్షణం."

ప్రేమచంద్ సాహిత్యంలో ఈ గుణాలన్నీ ఉన్నాయి. ఒకటి రెండుకథలు ఉదాహరణగా తీసుకుని ఆ విషయం స్పష్టం చేయవచ్చు.

'కుసుమ' అనే కథలో ప్రేమచంద్ ఆత్మాభిమానంగల ఓ యువతి శీలాన్ని చిత్రిస్తారు. కుసుమ భర్త ఆమెను పెళ్ళాడి, కాపురానికి తీసుకెళ్ళలేదు. భర్తను దైవంగా భావించే కుసుమ అతనికి ఎన్నో ఉత్తరాలు రాస్తుంది. తప్పులుంటే దిద్దుకుంటా నంటుంది, క్షమించమంటుంది. కాని ఫలితం శూన్యం. అప్పుడు ప్రేంచంద్‌గారే స్వయంగా వెళ్ళి, ఆ అల్లుని కోపానికి కారణం తెలుసుకునివస్తారు అదేమిటంటే, విదేశాలకు అల్లుడుగారిని పంపుతానన్న మామగారు అలా పంపక పోవడమే. అది విన్న కుసుమ తండ్రి, అల్లునికి విదేశయాత్రకు కావలసిన డబ్బు పంపబోతారు. అప్పుడు కుసుమ, "ఇంత స్వార్థపరుడు, గర్వి, నీచుడు అయిన వానితో నేను కాపురంచేయను అతనికి డబ్బు పంపితే నేను విషం తింటాను. నేను అలాంటి మనిషి ముఖం కూడ చూడదల్చుకోలేదు. నేను స్వతంత్రంగా ఉండటానికే నిర్ణయించు కున్నాను." అని అంటుంది. ఆమె ముఖంలో నిరాశా, వేదనలకు బదులు, స్వాభిమానం, స్వాతంత్రేచ్ఛలను చూస్తాము. అప్పుడు ప్రేంచంద్ తన స్నేహితుని కుమార్తె కుసుమను మెచ్చుకుని, "నేను స్త్రీలలో ఇలాంటి ఆత్మాభిమానమే చూడాలనుకుంటానమ్మా" అని అంటారు. "ఛీ, ఛీ, మన సమాజంలో ఇలాంటి స్వార్థపరులున్నారు, స్త్రీని తమ స్వార్థ సిద్ధికి ఓ సాధనంగా ఉపయోగించుకుంటారు, ఇంతకన్నా సిగ్గుచేటు ఉండదు, ఇది

ఆత్మగౌరవాన్ని అమ్ముకోడమే అని" ప్రేంచంద్ వాపోతారు. నేటి యువతరానికి కనువిప్పు కలిగించి, ప్రగతి పథంలో నడిపించే ఇలాంటి ఎన్నో కథలు ఆయన కలంనుండి వెలువడ్డాయి.

కథల్లోనేకాదు, ప్రేంచంద్ తన వ్యక్తిగత జీవితంలో కూడ ఆత్మాభిమానం గల వ్యక్తిత్వానికి అన్నింటికంటే ఎక్కువ విలువ నిచ్చేవారు. ఒకసారి ఆయన తన ఇంటి తలుపుదగ్గర కూర్చుని, పత్రిక చదువుకుంటూ ఉన్నారు, అదేసమయంలో, తన స్కూళ్ళ ఇన్స్పెక్టర్ ఆ ఇంటిముందు పోతున్నాడు. అది ప్రేంచంద్ గమనించలేదు.కనుక ఆయనకు నమస్కారించలేదు.దానితో ఇన్స్పెక్టరుకు కోపంవచ్చి, ప్రేంచంద్‌ను నానామాటలు అన్నాడు. ప్రేంచంద్ ఆత్మగౌరవంగల ఉద్యోగి. అందుకే ఇలా జవాబిస్తారు; "నేను స్కూల్లో ఉన్నంతసేపే నౌకరును; తర్వాత నా ఇంటిలో నేను మహారాజును" ఇలాగ, ఆయన వ్యక్తిత్వం కళనుండి విడదీయ రానిది. ఆయన నమ్మినదాన్ని ఖచ్చితంగా, దాపరికం లేకుండా చెప్పేవ్యక్తి.

ప్రేంచంద్ మొదట్లో యదార్థ ఘటనల్ని ఆధారం చేసుకొని, ఏదో ఒక ఆదర్శాన్ని, సందేశాన్ని అందించే కథలు రాసేవారు. రానురాను ఆయన ఆదర్శవాద కథలకు బదులు మనోవైజ్ఞానిక కథలు, పూర్తి యదార్థవాద కథలు రాసి, ప్రపంచ కథాసాహిత్యంలో గొప్పపేరు పొందారు. ప్రపంచ అత్యుత్తమ కథల్లో ఒకటి, "కఫన్" (శవాన్ని కప్పే కొత్తగుడ్డ). ఇందులో కటిక దరిద్రులు, త్రాగుబోతులు అయిన తండ్రీ కొడుకుల కథ ద్వారా భయంకర దోపిడీ ఫలితాన్ని ప్రేంచంద్ నిరూపిస్తారు. ఇందులో గొప్ప వ్యంగ్యం ఉంది. ధ్వని ఉంది. అన్నింటికంటె కూడ నగ్నయదార్థం ఉంది. ఓ రాత్రి కోడలు ప్రసవవేదనతో చనిపోతుంది. చేతిలో చిల్లిగవ్వలేక, మందూ, మాకూలేక హృదయ విదారకమైన పరిస్థితుల్లో కన్ను మూస్తుంది. ఆమె శవాన్ని కప్పడానికి ఒక కొత్తగుడ్డ కావాలి. తండ్రి కొడుకులు జమీందారును వేడుకుంటే, ఆయన మనసులో తిట్టుకుంటూ రెండు రూపాయిలు విసురుతాడు. ఇంకో మూడు రూపాయిలు మరోచోట దండుకుంటారు. ఈ ఐదురూపాయిలతో ఒక కొత్తగుడ్డ కొనాలని వెళ్ళుతూ, దారిలో, కల్లు దుకాణం కనబడితే, అందులోకి దూరారు. జీవితంలో మొదటిసారి కడుపునిండా తిని, త్రాగి, "ఓ దేవుడా! ఆమెను వైకుంఠానికి తీసుకెళ్ళు"అని ప్రార్థిస్తారు. ఆమె వైకుంఠానికి వెళ్ళుతుందా, లేదా అని కొడుక్కు సందేహం కల్గుతుంది. దానికి తండ్రి, "ఆమె తప్పకుండా వైకుంఠానికే పోతుంది. ఆమె ఎవరినీ బాధించలేదు. ఎవరినీ నాశనం చేయలేదు. చనిపోతూ చనిపోతూ కూడ మన జీవితంలో అన్నింటికంటె గొప్ప కోరిక తీర్చి మరీపోయింది. ఆమె వైకుంఠానికి పోకపోతే బీదలను రెండు చేతుల్తోనూ దోచుకుంటూ, తమ పాపాలను కడిగేసుకోడానికి గంగా

ఓ ముచ్చటైన మూడురంగుల జండా
ఒకనాడు నీ మధ్య కూచుని స్వాతంత్ర్య దారాన్ని మనోరాష్ట్రం
మీదలాగిన గాంధి ఈనాడు నాయకులు తిప్పే
మహారాష్ట్రంలో హృదయంపడి నలిగిపోయి
అదృశ్య రూపాన జండాలో కూచుని
ఎడతెగని కన్నీటి దారాలతో స్వదేశీయులకి
జాతీయ వస్త్రాలు నేస్తున్నాడు — అద్దేపల్లి రామమోహనరావు

స్నానం చేస్తూ, దేవాలయాల్లో అభిషేకం చేయించే ఈ లావుపాటి మనుష్యులు పోతారా వైకుంఠానికి ?" అని, భోరుని ఏడుస్తున్న కొడుకును ఓదారుస్తాడు. ఇంతకీ వాళ్ళు కొత్తగుడ్డ కొనలేదు. శవంతో కాలిపోయే గుడ్డేకదా అని. డబ్బులు జారిపోయినాయని చెప్పి, ప్రజల్ని నమ్మించాలనుకుంటారు. "బ్రతికుండగా శరీరాన్ని కప్పుకోగానికి చింకి గుడ్డలు దొరకవుగాని, చనిపోతే కొత్తగుడ్డలు కావాలట. ఎంత చెడు ఆచారం!" అ టూ బూజుపట్టిన సాంఘిక కట్టుబాటుపైన కస్సుమంటారు. నిజానికి ఆ నిర్భాగ్యుల మనస్సుల్లోని సంఘర్షణ, ఆవేదన వర్ణించి మనచేతగూడ ఓ కన్నీటి బొట్టు కార్పిస్తారు ప్రేమచంద్. ఆ కన్నీటి బొట్టుతో మనలోని కల్మషంకూడ కరిగిపోతుంది. మనలో కొత్త ఆలోచన పుడుతుంది, వర్గ చైతన్యం కల్గుతుంది. ఈ వ్యవస్థను మార్చాలనే కోరిక రేగుతుంది. అదే 'కఫన్' కథలోని గొప్పతనం. అదే ప్రేంచంద్ కళా విశిష్టత.

ఆయన రచనల్లో జీవితానికి పనికివచ్చే ఎన్నో సూక్తులు ఉన్నాయి. ఉదాహరణకు, "ప్రేమవసంత సమీరం, ద్వేషం గ్రీష్మపు వడగాలి." "సేవ, త్యాగంవల్ల ప్రపంచంలో అన్నిటికంటె గొప్ప అధికారాలు ప్రాప్తిస్తాయి." "నిరాశలో ప్రతిష్ఠ గుడ్డివాని చేతికర్ర." "బలహీనుల్లో ఆవేశంలా నది దూరంగా ఎత్తయిన ఒడ్డుల్లో ముఖం దాచేసుకుంది."

కాళిదాసు తర్వాత ఉపమ, ఉత్ప్రేక్ష మొదలైన అలంకారాల్ని వాడి, భావ సౌందర్యాన్ని, భాషా సౌందర్యాన్ని మేళవించి మనకు రసానుభూతి కల్గించిన కల్గించిన రచయిత ప్రేంచంద్. ఒకటి రెండు పత్రికలు నడిపి, హిందీభాషకు అపారమైన సేవచేసి, హిందీని జాతీయ భాష స్థాయికి తీసుకెళ్ళిన వారిలో ఆయన అగ్రగణ్యుడు. ఆనాటి ఉత్తర భారతదేశ చరిత్రను, స్వాతంత్ర్య పోరాటాన్ని ఆయన రచనల్లో చదవవచ్చు.

ప్రేంచంద్ కలం పట్టిన సిపాయి. జీవితాంతం పీడిత ప్రజల తరపున నిలబడి, ఆ మూగ జీవులకు తన కలాన్ని, గళాన్ని అంకితం చేసిన ప్రేంచంద్ 1936 లో మరణించాడు.

సోషలిస్టు దేశాల్లో రచయితల సంఘాలు

జెకొస్లొవేకియా

ఈ మధ్య ప్రాగ్ నగరంలో జరిగిన జెకోస్లొవాక్ రచయితల మహాసభలో అధ్యక్షుడు జాన్ కొజాక్ సమర్పించిన నివేదిక ఆసక్తిదాయకమైన కొన్ని విషయాలను పేర్కొంది.

జెకోస్లొవేకియా సోషలిస్టు రిపబ్లిక్ అయినా, అక్కడ సోషలిజానికీ పెట్టుబడిదారీ విధానానికీ మధ్య సిద్ధాంతపరంగా యిప్పటికీ పోరాటం జరుగుతూనే ఉంది. పెట్టుబడిదారీ సిద్ధాంతవేత్తలు తమ ఓటమిని అంగీకరించకుండా, రచయితల్లో పైకి రమ్యంగా కనిపించే రివిజనిస్టు పోకడల్ని ("మానవత్వం" గల సోషలిజం, "స్వేచ్ఛాయుత" సోషలిజం పేర్లతో) వ్యాప్తిచేస్తున్నారు; సృజనాత్మకమైన మేధావులకూ కమ్యూనిస్టు పార్టీకీ మధ్య గండికొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. జెకోస్లొవాక్ రచయితల సంఘం వీరి ప్రయత్నాల్ని ఎదుర్కొంటూంది.

రచయితలకూ శ్రామికులకూ మధ్య రైతాంగానికీ మేధావులకూ మధ్య ఐక్యతను పెంపొందిస్తోంది.

ఇతర దేశాల అభ్యుదయ రచయితలతో స్నేహ సంబంధాలుంచుకొంటూ, యితరజాతుల సంస్కృతిని అవగాహన చేసుకొనేందుకు కృషి చేస్తోంది.

గత ఐదు సంవత్సరాల్లో సోషలిస్టేతర దేశాలకు చెందిన రచయితలవి, 1576 గ్రంథాలు, జెకోస్లొవేకియాలో అనువదించి ప్రచురించారు. ముఖ్యంగా, బ్రిటన్, అమెరికాలలో ప్రచురింపబడిన 619 గ్రంథాలు. ఫ్రాన్స్‌లో ప్రచురితమైన 313 రచనలు జెక్, లేదా స్లొవాక్ భాషల్లోకి అనువదించి అనేక లక్షల ప్రతుల్లో ముద్రించారు. అన్ని ప్రసిద్ధ ప్రచురణలు అయినా రచయితల దేశాల్లోనే ముద్రింపబడలేదు.

కాని, జెకోస్లొవాక్ సాహిత్యం గురించి సోషలిస్టేతర దేశాల్లో అంతగా తెలియనందుకు జాన్ కొజాక్ విచారం తెలియజేశారు. గత 5 సంవత్సరాల్లో జెక్, స్లొవాక్ రచయితలు వ్రాసిన 1700 కొత్త గ్రంథాలు జెకొస్లొవేకియాలో ప్రచురింపబడ్డాయని, యీ వాస్తవం సోషలిస్టేతర దేశాల్లో తెలియకుండా ఉంచడానికి బూర్జువా సిద్ధాంతవేత్తలు ప్రయత్నాలు చేస్తున్నారనీ ఆయన చెప్పారు. అయినా, 1972 తర్వాత 32 సోషలిస్టేతర దేశాలనుంచి 1300 మందికి పైగా రచయితలు జెకొస్లొవేకియాకు వచ్చారనీ, తనదేశంనుంచి 21 దేశాలకు సౌహార్ద ప్రతినిధులుగా చాలమంది రచయితలు వెళ్ళారనీ తెలియజేశారు. గత మూడు నాలుగు సంవత్సరాల్లోనే జెక్, స్లొవాక్ రచయితలు వ్రాసిన గ్రంథాలు, డజన్ల సంఖ్యలో ఫ్రాన్స్, ఇటలీ, పశ్చిమ జర్మనీ, స్విట్జర్లండ్, ఫిన్లండ్, జపాన్, అమెరికా దేశాల్లో అనువదితమై ప్రచురింపబడ్డాయి.

గుజరాతీ మూలం :
కి. శే. జగదీశ్ జోషి

అన్వేషణ

స్వేచ్ఛానువాదం :
సస్యశ్రీ

చేతిలో నిష్కామ కర్మచేస్తూ శ్రీమద్భగవద్గీత !
చెవిలో కురుక్షేత్రం వేస్తూ విధి రేడియో మోత ! !
గోడమీది ఎలక్ట్రిక్ క్లాక్ కోరేస్తోంది వర్తమానం ఎద
ఫ్లోరోసెంట్ లైట్ చోక్ జోరేస్తోంది—ఒకటే కందిరీగ రొద !
అంతకుముందే తీసివున్న వీధిగేటు బజ్జర్
గొంతుకు చించుకు ఛస్తోంది ఉండి...ఉండి ;
పనివాడు పాలవాడితో బాతాఖానీ
కొడుతున్నాడు బైట ని-లు-చుం-డి ;
అప్పుడేవచ్చి ఓ అపరిచిత ముఖం
తిప్పుతోంది అఖండాల డయల్-పక్కింటి
తోసుపోసి వీధి దొమ్ములాట దుమ్ము
దూసుకువస్తోంది తీసున్న కిటికీ వెంట.
కాలిపోయింది మెయిన్ ఫ్యూజ్
కారుచీకటి క్యారుమంది
అంతట సౌధం అంతటా
అంధకారం పేరుకుంది
గావుకేక వేస్తున్నాడు గ్రౌండుఫ్లోర్‌నుండి వేదవ్యాస్
"కాళిదాసూ ! త్యాగయ్యా ! ఒరేయ్ ఓ మోహన్‌దాసూ !
ఒక్కరూ పలకరే !—ఎక్కడచచ్చార్రా మీరంతావుండి ?
ఎవరో ఒకరు అర్జంటుగా వెళ్ళి ఎలక్ట్రీషియన్ని పిలవండి."
ప్రతిధ్వనులేగాని
ప్రత్యుత్తరాలు లేవు.
అంతలో అలవోకగా హాలువెంబడి సాగి వస్తోంది
అతి సున్నితమైన మీరాగొంతు...
"ఓ కన్నయ్యా ! వింటున్నావా నా విజ్ఞప్తి ?
దయచేసి యీవయ్యా ! ముందో చిన్న కొవ్వొత్తి !"
అప్పుడు—
నా మేడలో నా వాడలో నా ఊరిలో నా దేశంలో
అర్జంటుగా ఓ కొవ్వొత్తి కోసం
అన్వేషణ ఆరంభమయింది.

జూలై నెల "అభ్యుదయ"లో వసంతరావు దేశపాండేగారి "రచ్చల్లో వెతకాల్సిన రవ్వలు" వ్యాసం చదివి చాల బాధపడ్డాను. వారి వ్యాసాన్ని విమర్శించడం-ఖండించడం నా లక్ష్యం కాదు. వారు కథారచయితలందర్నీ ఖండించి ముక్కలుముక్కలుగా నరికేశారు. ఇంక నరకడానికి ఏమీ మిగల్లేదు.

సాహిత్యం సజీవ స్రవంతి. అది నిరంతర ప్రవాహం. అది ఆగడానికి వీల్లేదు. అయితే కొందరు నన్నయ తరవాత ఇంకా సాహిత్య సృష్టేమిటి అనే ప్రబుద్ధులుంటారు— కాదు ఉన్నారు. సాహిత్య సృష్టి నన్నయతో ఆగిపోకపోవడం వారికి ఏదో ప్రమాదం సంభవించినట్లు ఉంటుంది.

ప్రగతిశీల పరిశీలకుడు నిరంతరం సాగుతున్న సాహిత్య సృష్టిలో ప్రగతి భావాలను, సామాజిక చైతన్యాన్ని పరిశీలిస్తాడు. అయితే కొందరు ప్రగతిశీల పరిశీలకులు కూడా సాహిత్యం గురజాడతోనూ, కందుకూరితోనూ ఆగిపోయినట్లు వారిని తప్ప ఉదాహరించరు. తరవాత సాహిత్యమే లేనట్లు చప్పరిస్తారు. ఇది అభ్యుదయ పరిశీలకుని లక్షణం కాదు.

ప్రగతిశీల పరిశీలన

*

దాశరథి రంగాచార్య

సమకాలీన సాహిత్యాన్ని పరిశీలించడానికి సహృదయత అవసరం. కాళిదాసు వంటి మహాకవినే సమకాలికులు మెచ్చలేదు. చేమకూరివారి విషయం మనకు తెలిసిందే ఇహ సామాన్యుల విషయం చెప్పనక్కరలేదు. ఈనాడు తెలుగుదేశంలో లెక్కకుమించి నవలలు కథలూ వస్తున్నందుకు విచారించాల్సిన పనిలేదు. అభ్యుదయ వాది గిర్వించాలి. పత్రికలు ఎక్కువఉన్నందుకు ఏడవాల్సినపనిలేదు. సంతోషించాలి. వచ్చే సాహిత్యం సాంతం ఏనాడు ఉత్తమ సాహిత్యం కాదు, కాలేదు. అందులోంచి మంచిని వెదకడానికి శ్రమించవలసిన బాధ్యత పరిశీలకునిమీద ఉంది. గంపగుత్తగా మొత్తం చెత్తకథలే వస్తున్నాయనడం సద్విమర్శకుని లక్షణంకాదు. మనకు పేర్లు తెలిసిన రా. వి. శాస్త్రి, బీనాదేవి వంటి వారితో కథారచన ఆగిపోయిందనడాన్ని ప్రగతిశీల పరిశీలకులు అంగీకరించరు.

ఇవ్వాళ వస్తున్న కథా సాహిత్యంలో చాలావరకు చెత్త ఉంది అని చెప్పడానికి పరిశీలన అక్కరలేదు ఇది ఒక గుడ్డి విమర్శ. అది ఎవరయినా చేయగలరు. పరిశీలకుడు సాహిత్యాన్ని తరచి మంచివాటిని ఎత్తి చూపవలసిన అవసరం ఎంతయినా ఉంది.

ఈ నాటి యువతరం సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లోనూ రచన సాగిస్తున్నారు. ఈ రచనలను నిక్కటి ప్రమాణాలతో చూచి అంతా చెత్త అనడం యువ

తరాన్ని నిరుత్సాహపరచడమే అవుతుంది. కొలబద్దలు రోజు రోజుకూ మారిపోతున్నాయి. విరిగిపోయిన కొలబద్దతో కొలవడం మన లక్ష్యం కారాదు.

కథలు కుప్పలు తెప్పలుగా వస్తున్నమాట వాస్తవం. అయితే వాటిలో అన్నీ పనికిరానివి అనడానికి వీల్లేదు. ఉదాహరణలు ఇవ్వలేముగాని యువత రాసే వాటిలో మంచి కథలు వస్తూనే ఉన్నాయి. స్వంతశైలి, సామాజిక ఇతివృత్తం మంచి భాష ఏర్పరచుకున్న యువకులు, యువతులు ఉన్నారు. వస్తున్న కుప్పలలోంచి వారి కథలను వేర్పరచి మంచి కథలు రాసిన వారిని ప్రోత్సహించడం అభ్యుదయ పరిశీలకుని కర్తవ్యం. కథకులందరినీ ఒకే గాట కట్టి తిట్టడం వల్ల మంచి రచయితలను కూడా మనం నిరుత్సాహ పరచినట్లవుతుంది. మంచి రచయితలను నిరుత్సాహ పరచే కార్యభారం వహించడానికి చాల పత్రికలున్నాయి. అభ్యుదయ ఆ పాత్ర నిర్వహించాల్సిన అవసరం లేదు.

దేశపాండే గారి వంటి యువ పరిశీలకులు మంచి కథకులను పరిచయం చేయడానికి పరిశ్రమించడం అభ్యుదయ పథం అవుతుంది.

యువతను ప్రోత్సహించడం "అభ్యుదయ" ప్రధాన లక్ష్యం కావాలి.

నేటి కన్నడ కథానిక సామాజిక స్పృహ

విక్టర్

కన్నడ సాహిత్యంలో కథానికా ప్రక్రియకు చాలా ప్రాధాన్యత ఉంది. దాదాపు అరవై యేళ్ళ క్రితం కన్నడ కథానికలు గ్రాంధిక శైలిలో రాయబడుతుండేవి. అలాంటి సమయంలో భాషకు కొత్త రూపం ఇచ్చి, సులభశైలిలో కథలు రాయాలన్న తపన ఆనాటి కొందరు రచయితల్లో బయలుదేరింది. స్వర్గీయ పంజె మంగేశ్‌రావు కెరూరు వాసుదేవాచార్యులు మున్నగువారు ఈ రకం కథానికా రచనలకు నాంది పలికారు. అయితే ఆధునిక కథానికకు ఒక ఊపూ, ఊతమూ ఇచ్చినారు మాస్తి వెంకటేశయ్యంగార్. ఆయన రాసిన 'రంగప్పన కకీగళు' (రంగప్ప కథలు) అన్నవి కన్నడ కథానికను ఒక కొత్త మార్గంవైపు నడిపించాయన్నదీ తిరుగులేని సత్యం. సరళమైన శైలిలో భావోద్వేగానికి లోను కాకుండా రచనలు కావించడం ఆయన ప్రత్యేకత, దాదాపు నాలుగు దశాబ్దాలనుంచీ ఆయన కథానికలు రాస్తూనే వున్నారు, ఆ కథలు పాఠకుల హృదయాలను ఆకట్టుకోవడమే కాక కొత్తగా కథానికలు రాయాలనుకున్నవారికి మంచిబాట వేశాయి. సాధారణంగా మనకు నిత్యజీవితంలో ఎదురుపడే వ్యక్తులే ఆయన కథానికల్లో పాత్రలుగా దర్శనమిస్తారు. అసహజం అన్నది మచ్చుకైనా లేని రచనలు ఆయనవి. ఆ తర్వాత కథానికలు రాసిన వారంతా మాస్తి వెంకటేశయ్యగార్ గారినే అనుసరించి రాశారన్నా అందులో అతిశయోక్తి ఏమీ లేదు. అలాంటివారిలో ఆనంద కె. గోపాల కృష్ణరావు వి. ఆర్. కృష్ణ ముఖ్యులు. వీరు కాక రం. శ్రీ. ముగళి, ఆనందకంద, ద. రా. బేంద్రె, కృష్ణకుమార్ కల్లూర్ మున్నగువారు కూడా ఆ కోవకే చెందిన వారని చెప్పవచ్చు. వీరిలో ఆనందకంద ఉత్తర కర్నాటకంలోని పల్లె జీవితాన్ని కథా వస్తువుగా తీసుకుని చక్కని కథానికలు రాశారు వీరేకాక కథానికా రచనలో అంద వేసినచెయ్యి అనిపించుకున్న వారిలో-గోరూరు రామస్వామి అయ్యంగార్, డి. టి. నరసింహాచార్, ఎం వి. సీతారామయ్య, అ.న. కృష్ణారావు, త. రా. సు., నిరంజన, ద. బా. కులకర్ణి, బసరాజ కట్టీమని, అశ్వత్థ, వాశి, త్రివేణి, గీతా కులకర్ణి, ఎం. కె. ఇందిర మున్నగువారు ముఖ్యులని చెప్పాలి. వీరందరికృషి ఫలితంగానే నేటికీ కన్నడ కథా సాహిత్యం ఇంకా అభివృద్ధి చెందుతూ ప్రజాదరణను పొందుతోంది.

నేడు కన్నడ కథాసాహిత్యంలో ఎన్నో కొత్త ప్రయోగాలు జరుగుచున్నవి. కథావస్తువులోనైతేనేమి, శిల్పంలో నైతేనేమి-పాత సంప్రదాయాలకు స్వస్తిచెప్పి నేటి రచయితలు కొత్త పుంతలు తొక్కుతున్నారు.

నేటి కిన్నడ రచయితల్లో సామాజిక స్పృహ ఎక్కువగా కనిపిస్తున్నది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు వారు స్పందిస్తున్నారు. స్పందించి తిరుగుబాటు వ్యక్తం చేస్తున్నారు. ఈ తిరుగుబాటుతనం సమయ స్ఫూర్తివల్ల వచ్చిందో లేక అంతరంగికమైన ఒత్తిడివల్ల వచ్చిందో చెప్పటం కష్టం. ఏ కథా రచయిత సహజ రచనా వైఖరిని కనిపెట్టాలన్నా అతని రచనలను బేరీజు వేసి చూడాలి. సాహిత్యంలో ఏ ప్రక్రియ అయినా సరే, అది బలంగా ఉండాలి. ప్రజల మనసుల్లోకి చొచ్చుకుపోయి, వారిలో కొత్త అభిరుచిని కలిగించి, మనిషి మనిషిగా బతికేందుకు కావలసిన స్థయిర్యాన్ని కలిగించి జీవితపు విలువలనుగురించి ఆలోచనలను రేపి, వారిలో మార్పును తేగలిగినప్పుడే అది నిజమైన సాహిత్యం అనిపించుకుంటుంది.

కన్నడంలో ఈ మధ్య కొత్తగా రచనలు చేస్తున్న కొందరు రచయితల్లో ఈ ఉద్దేశం (కమిట్‌మెంట్ టు లైఫ్) స్పష్టంగా కనిపిస్తున్నది. ఏళ్ళతరబడినుంచి మన సమాజంలో పాతుకుపోయిన అస్పృశ్యత, దారిద్ర్యం, కుల మత భేదాలు-మొదలైన సమస్యల మీద పోరాటం సాగించే గుండె నిబ్బరం అధికంగా కనిపిస్తున్నది. వీరి రచనల్లో పీడిత ప్రజల ఘోష ప్రతిధ్వనిస్తున్నది. పాత సంప్రదాయాలను కూకటి వేళ్ళతో సహా పెకిలించి పారేయడానికి వీరు ప్రయత్నిస్తున్నారు. ఈవిధంగా పోరాటం సాగించిన వాళ్ళలో యు.ఆర్. అనంతమూర్తి, డి. లంకేష్. పూర్ణచంద్ర తేజస్వి ముఖ్యులు. ముఖ్యులేమిటి-ప్రథములనే చెప్పాలి. వీరి అడుగు జాడల్లోనే పయనిస్తున్న మరికొంతమంది యువ రచయితలు కూడా తమ కృషిని కొనసాగిస్తున్నారు. వారిలో ముఖ్యులు – దేవనూరు మహాదేవ బెసగరహళ్ళి రామణ్ణ, దొడ్డరంగేగౌడ, బరగూరు రామ చంద్రప్ప, రామచంద్రదేవ, శ్రీ కృష్ణ ఆలన హళ్ళి మొదలైనవారు. శ్రీ అనంతమూర్తి రాసిన 'భారతీపుర' శ్రీ లంకేష్ రాసిన 'కురుడు కాంచాణ', 'రొట్టి' మొదలైన కథానికల్లో-ధనిక వర్గాలవారి కబంధ హస్తాల్లో నలిగిపోతున్న పేద ప్రజల దుర్భర జీవితాలు కళ్ళకు కట్టినట్టు చిత్రించబడ్డాయి. యు. ఆర్. అనంతమూర్తి - తన కథానికల్లో-సమాజంలో ఘరానా పెద్ద మనుషులుగా చెలామణి అవుతూ – అగ్ర కులాల వారమని చెప్పుకునేవారు చేసే దురాగతాలను బయట పెట్టాడు. మడి, ఆచారాల పేరుతో – తక్కువ కులాల వారిని హీనంగా చూసే ఈ పెద్ద మనుషులు – మళ్ళీ ఆ తక్కువ కులాలలోని ఆడవాళ్ళమీద అత్యాచారం జరపడంలాంటి ఘోరాలెన్నిటినో ఆయన తన కథానికల్లో చిత్రించాడు.

దేవనూర్ మహాదేవ, బెసగర హళ్ళి రామణ్ణ, దొడ్డరంగేగౌడ్, బరగూరు రామచంద్రప్ప మున్నగువారి కథానికల్లో - అస్పృశ్యత, కులమత భేదాలు, పీడిత పజల దుర్భర జీవితాలు – ప్రధానాంశాలుగా కనిపిస్తాయి.

ఒక్క నిరుపేద వున్నంతవరకు, ఒక్క మలినాశ్రు బిందువొరిగినంతవరకు,
ఒక్క ప్రేగు ఆకలి కనలినంతవరకు,
ఒక్క శుష్క స్తన్యసన్నిధి నిక్షుధార్తి నేడ్చు పసిపాప వున్నంతవరకు,
ఒక్క క్షత దుఃఖిత హృదయ మూరడిల్ల నంతవరకు,
నాకు శాంతికలగదింక నేస్తం ! — తిలక్.

గ్రామీణ జీవితం - అందులోనూ నిరుపేదల జీవితాలను కథా వస్తువులుగా తీసుకుని కథలు రాయడంలో అగ్రగణ్యుడు దేవనూరు మహాదేవ. తన కథల్లో ఏ విధమైన సింబాలిజంగానీ, టెక్నిక్‌గానీ ప్రవేశపెట్టకుండా, సరళంగా, సూటిగా చెప్పడం ఈయన విశిష్టత. దారిద్ర్య జీవితాలను యథార్థంగా చిత్రించే అతివాస్తవ రచయిత ఈయన. నిరుపేదల కష్టనిష్ఠూరాలను తనవిగా భావించి, వాటికి అనుభవాలను జోడించి రచించిన 'ద్యావనూరు' అన్న కథల సంపుటిలోని కథానికలు బాధాతప్తుల జీవితాలకు అద్దం పడతాయి. ఇదే విధంగా - అక్షరాస్యులు నిరక్షరాస్యులను అణగదొక్కి - వారిని తమ కార్యసాధనకు ఎలా ఉపయోగించుకుంటారో వివరించే కథలను కూడా దేవనూరు మహాదేవ రాశాడు. 'మారికొండవరు' అంటే 'అమ్ముడుపోయినవాళ్ళు' అన్న కథానికలో - పేరే చెబుతున్నట్లుగా తమ బతుకులను పూర్తిగా జమీందారుకు అంకితం చేసుకున్న యువ దంపతుల కరుణామయ గాధ హృదయ విదారకంగా చిత్రించబడింది. జమీందారు కిట్టప్ప - 'బీర' అనే వాడితోనే కాకుండా అతని భార్యతోనూ వెట్టిచాకిరి చేయించుకుని - ఆమె మీద తన హక్కును కూడా చెలాయిస్తాడు. ఈ అన్యాయాన్ని చూస్తూ కూడా బీర ఎదురు తిరిగే శక్తిలేక కేవలం నిస్సహాయుడిగా, మూగవాడిగా ఉండిపోతాడు.

బెసగరహళ్ళి రామణ్ణ రాసిన 'గర్జనె' అన్న కథానికలో ఒక వ్యక్తి - తను పుట్టినప్పటినుంచీ పెరిగి పెద్దవాడయ్యేదాకా పడిన బాధలు, అనుభవించిన కష్టాలు- ఒక జమీందారు క్షణికమైన కామ వాంఛ ఫలితంగా తను జన్మించవలసివచ్చిన దీన గాధ వివరించబడింది. ఇలా చెప్పుకుపోతే ఇంకా ఎన్నో కథానికలను ఉదాహరణగా తీసుకోవచ్చు.

ఇది సమగ్రమైన పరిశీలనకాదు. నేటి కన్నడ రచయితల్లో ఉదయించిన సామాజిక స్పృహకి, తిరుగుబాటుమనస్తత్వానికీ కొన్ని నిదర్శనాలుమాత్రమే. కానీ ఈ తిరుగుబాటుతనం వ్యక్తిగతమైన విరోధాలతోనే తృప్తిపడుతోందో లేక బలమైన సాహిత్య శక్తిగా నిలిచి నిజమైన ప్రయోజనాన్ని సాధిస్తుందో - వేచి చూడవలసిన విషయం. అంతేకాకుండా ఇలాంటి రచనలు ఎంతవరకూ ప్రజలదాకా వెళతాయో, ఈ మార్గాన పయనిస్తున్న రచయితలు ఇంకా ఎంతవరకూ ఎదుగుతారన్నది కూడా వేచిచూడవలసిన విషయమే.

సాహిత్యలోక సమాచారం

సింగరేణిలో సాహితీగర్జన

సింగరేణి పేరు నీలాల గనులవల్ల ప్రసిద్ధమే అయినా ప్రపంచఖ్యాతిపొందిన గోదావరి లోయలోని ఈ "తొలిగని" ఎక్కడుందీ బహుశా చాలా మందికి తెలియక పోవచ్చు.

సాహిత్యానికీ బొగ్గు. గనులకీ పెద్ద ముడి వేసింది ఖమ్మం జిల్లా సింగరేణి. అదే ఇల్లెందు. పొడుగ్గా పలచగా పరుచుకుని కడుపులో గనులు దాచుకున్న ఆ ఊరు నీలాల పొరలు కప్పుకున్న నిప్పు అని కణకణలాడుతూ బయటపడింది ఇటీవల.

ఒత్తుగా గుబురుగా పెరిగిన చెట్ల మధ్య ఆ ఊరు ఎంత నిశ్శబ్దంగా ఉంటుందో ఆ మనుషులూ అంతే మహా గుంభనంగా ఉంటారు. ఎప్పుడో హటాత్తుగా ఫెళపెళార్భటులతో ప్రచండ మార్తాండుళ్ళా ధగ ధగ లాడించేస్తారు.

అడవుల్తో సంబంధం ఉన్న వారికి అటవీశాఖ విద్యాలయం ఒకటి ఇల్లెందులోనే ఉందని బహుశా తెలుస్తుంది. అందులో ప్రశాంతంగా ప్రకృతి ఒడిలో ఒక ఆడిటోరియం. అక్కడ్నించే ఈ 'మే' ఎండల చివరల్లో వినవచ్చాయి సాహితీ గర్జనలు. ఈ ఊళ్ళోను జిల్లాలోను చైతన్యం స్ఫూర్తి సామాజిక సక్రమ అవగాహన ఉన్న సాహితీ పతులకు సాహిత్యాభిమానులకూ అందరికీ ఆ అటవీ విద్యాలయంలోని ఆడిటోరియం ఆ రెండు రోజులూ సాహితీ తీర్థమే అయింది.

నిజానికి ఆ ఊర్లో ఆ జిల్లాలో ఎవరూ ఊహించనేలేదు. ఆ మారుమూల కేంద్రంలో అంతటి స్థాయిలో సాహిత్య సభలు జరిగే అవకాశ ముంటుందని— ఈ బాధ్యతల మూటని భుజానికెత్తుకుని నిశ్శబ్దంగా నిప్పంటించిన శ్రీ నివాస రావుకీ, జాతశ్రీకి – వారికి సహకరించిన అక్కడి గని కార్మికుల యూనియన్‌కి తప్ప–

"ఆలోచన నా ఆయుధం" అని రంగుల అక్షరాల్లో అందంగా ముద్రించిన బ్యాడ్జీలు పెట్టుకుని–జిల్లాలోని వివిధ కేంద్రాలనుండి విచ్చేసిన ప్రసిద్ధులనుండి, కొత్తగా చివురు తొడిగి మహోధృతంగా ఎదిగి పోతున్న యువకవులు రచయితల దాకా ఆ చెట్ల మధ్య హడావుడి పడుతుంటే కళ్ళు తెరిచి విస్తుబోయింది ఊరు.

వారొచ్చారట వీరొచ్చారట రచయితలంట – సభలంట అంటూ చెవినుండి చెవికి వార్తమోసుకుంటూ కదలిక పుట్టించింది గాలి – చాల మందికి ఆ సభలు కాస్తా అయిపోయేదాకా నమ్మకం కల్గలేదు. ఆ అపనమ్మకానికి ప్రతి ఫలంగా ఆ అవకాశం జారవిడుచుకున్నందుకు ఆ తరువాత నాలిక్కరుచుకుని "అయ్యయ్యో" అని పరితాపపడ్డవారూ ఉన్నారు.

తెలుగు దేశం గర్వించాల్సిన

ప్రఖ్యాత చిత్రకారులు సంజీవదేవ్- సమాజం పట్ల కవులకీ కళాకార్లకీ బాధ్యత లేదనే అర్థరహిత వాదాల్ని ఖండిస్తూ చైతన్యంతో సమాజానికికావల్సిన కళాత్మకమైన సాహిత్యాన్ని సృజించండని ఉద్బోధిస్తూ ఉత్సాహాన్నిచ్చి మహాసభల్ని ప్రారంభించారు.

ఆ తరువాత ఆరంభమైంది అసలు కథ. "సోషలిస్టు వాస్తవికత" ప్రధాన అంశంగా కథ నవల కవిత విమర్శ తదితర ప్రధాన సాహితీ రూపాలమీద 'భాష' మీద రెండు రోజులపాటు సదస్సులు.

అభ్యుదయ రచయితల సంఘం పునర్నిర్మాణం జరిగాక గుంటూరులో ఆమోదించిన ప్రణాళికలో ప్రాణం-సోషలిస్టు వాస్తవికత, మన దేశ సాహిత్యోద్యమాలలో ఈ స్పష్టమైన అవగాహన ప్రకటించి కూడా గట్టిగా ఎనిమిదేళ్ళు కాలేదు. నాటినుండీ అనేక అరసం శాఖలు ఈ అంశంమీద చిన్నస్థాయిలో ప్రసంగాలు తరగతులు నిర్వహించి రచయితలలో అవగాహన కల్గించేందుకు కృషిచేస్తూనే ఉన్నాయి. అయితే మహాసభల్లో ఇదే ప్రధానాంశంగా ఇంతపెద్ద ఎత్తున సదస్సు నిర్వహించిన ఖ్యాతి ప్రతిష్ట మాత్రం ఈ జిల్లాకే దక్కింది.

సోషలిష్టు వాస్తవికత మీదలోతైన విస్తృతమైన అధ్యయనంచేసి చర్చిస్తూ చేకూరి శ్రీనివాసరావు సమర్పించిన విలువైన పత్రం ఆధారంగా చర్చలు ఆరంభమైనాయి. అయితే అంశంలోని క్లిష్టతవల్లా, మరింత స్పష్టత అవసరమైనందువల్లా చర్చల్లో వ్యక్తమైన అభిప్రాయాల్లో కొంత గందరగోళం-అపరిపక్వత లేకపోలేదు. ఏమైనా జిల్లా మహాసభలు జరపాలని తలపెట్టిన నాటినుండి సోషలిస్టు వాస్తవికతనే ప్రధాన అంశంగా వివిధ రూపాలపై గోష్టి ఉండాలని పట్టుదలగా దీక్షగా కృషి చేసిన "జాతశ్రీనివాసరావు"ల జంట (ఇందులో ఉత్తరస్థాన నామానివే గురుపీఠం) ఎంతైనా అభినందనీయులు. ఈ గోష్టి నిర్వహణతో ఇతర జిల్లాకు ఆదర్శంగా నిల్చిన ఖమ్మంశాఖకు అరసం రుణపడి ఉంటుంది.

ఏడేళ్ళ క్రితం ఖమ్మం పట్టణంలో మంజు, కౌముది ఇతర మిత్రులూ పెద్ద స్థాయిలో మహాసభనునిర్వహించడంతో జిల్లాలో అరసంకు ప్రాణ ప్రతిష్ట జరిగింది. అయితే ఆ తరువాత స్తబ్ధతలో పడిపోవడం జిల్లాలోను రాష్ట్రంలోను అభ్యుదయ సాహిత్యాభిమానులకు చాలా నిరుత్సాహం కల్గించివి. మళ్ళీ యిప్పుడు అందర్నీ కూడగట్టుకుని ఈ మహాసభను నిర్వహించి ఆ జిల్లాశాఖ అందరి మన్ననలూ పొందింది. మహాసభలో రెండవ రోజు భాషమీద డా॥ చేకూరి రామారావు సోషలిస్టు వాస్తవికత- నవలపై నవీన్ చేసిన ప్రసంగ వ్యాసాలు విలువైనవి.

తొలిరోజు రాత్రి సంజీవదేవ్ ఆరంభించిన ప్రవర్థమాన అభ్యుదయ కళాకారుడు "కాళ్ళ" చిత్రకళా ప్రదర్శన అద్భుతంగా ఉంది. ప్రగతిశీల విప్లవ భావాలను దోపిడీ సమాజంలోని అమానుషత్వం క్రౌర్యంను దాన్నెదిరించే పోరాటాన్ని ఆవేశంగా రంగుల్లో బిగించగల

శక్తివంతుడు కాళ్ళ. ఆ రోజు రాత్రే స్వయంగా వ్యాఖ్యానం పలుకుతూ సంజీవదేవ్ సమర్పించిన స్వీయచిత్రాల స్లైడ్‌ల ప్రదర్శన మరువలేని అవకాశం.

రెండవరోజు మధ్యాహ్నం శ్రీనివాసరావు ఇంగ్లీషు కవితల సంపుటిని సంజీవదేవ్ ఆవిష్కరించారు. సాయంత్రం రావెళ్ళ అధ్యక్షతన ప్రతినిధుల సమావేశంతో రాష్ట్ర కార్యదర్శి మల్లిక్ అరసం ప్రణాళిక, వర్తమాన సాహిత్య స్థితి గతులు రచయితల కర్తవ్యం వివరిస్తూ సందేశం యిచ్చారు. అనంతరం ఏకగ్రీవంగా నూతన నాయకత్వం ఎన్నికైంది. అన్నిస్థాయిలలో వ్యావహారిక భాషలో పాఠ్యపుస్తకాలు ఉండాలని కోరుతూ తీర్మానించారు. రాత్రి నూతన అధ్యక్షులు కౌముది అధ్యక్షతన కవితా గోష్టి, ప్రఖ్యాత సంగీత దర్శకులు మోహన్ దాస్ అధ్వర్యాన ప్రజా నాట్య మండలి బృందం గీతాలూ ఇలా రెండు రోజులూ సాహిత్య సంగీత కళా వైభవంతో వెలిగిపోయింది యిల్లెందు!

హైదరాబాదునుండి వచ్చి పాల్గొన్న విమర్శకులు ఆర్వీయార్. రామారావు, కాచినేని రామారావు జిల్లాలో అన్ని కేంద్రాల నుండి వచ్చి పెద్ద సంఖ్యలో పాల్గొన్న రచయితలు ముఖ్యంగా దిలావర్, ప్రత్యూష, సి. హెచ్. ఎల్లయ్య, చైతన్య, అజాద్, యన్నంరెడ్డి వెంకటరెడ్డి ఇలా ఎందరో మహా సభలు సాఫల్యం కావడంలో పాలుపంచుకున్నారు.

x x x

"గుడిపాటి వెంకటచలం రచయితగా విప్లవకారుడా? — తిరుగుబాటుదారుడా?" అన్న అంశంపై, జులై మొదటివారంలో కాకినాడ అరసంశాఖ ఇష్టా గోష్ఠి నిర్వహించింది

గోష్ఠి పర్యవేక్షకులుగా అరసం రాష్ట్రశాఖ కార్యదర్శి డా॥ చిరంజీవినీ కుమారి వ్యవహరించారు.

అరసం అధ్యక్ష వర్గ సభ్యులు శ్రీ సోమసుందర్, ప్రముఖ రచయితలు డా॥ కనక్ ప్రవాసి, డా॥ మిరియాల రామకృష్ణ, రామకృష్ణ భరద్వాజ, నాగరాజు, అద్దేపల్లి రామమోహనరావు,

---

విరసంలో మిగిలిన పూర్వపు దిగంబరకవులు ఇద్దరిలో నగ్నముని ఇప్పుడు విరసంకు రాజీనామా చేశారు. ఆయన ఆ సంస్థకు గతంలో కార్యదర్శిగా, కార్యవర్గ సభ్యునిగా పనిచేశారు రెండు నెలల క్రితం ఒక పత్రికలో కవిత్వాన్ని గురించి నగ్నముని వ్యక్తంచేసిన భావాలు "అభ్యంతరకరంగా" ఉన్నందున విరసం నాయకత్వం "సంజాయిషీ" కోరినట్టు ఆయన రాజీనామాలేఖని పంపి పత్రికలకు విడుదల చేసినట్టు రాజధానిలోని సాహితీ వర్గాలలో వినిపిస్తోంది. కేవలం "సాహిత్య దృక్పథం" మాత్రమేకాక "విరసం" నిర్వహణలో ప్రజాస్వామ్య పద్ధతులు లేకపోవడం, రాజకీయంగా అభిప్రాయభేదాలు వీటన్నిటి దృష్ట్యాకూడా రాజీనామా చేసినట్టు నగ్నముని "ఘాటైన" పదజాలంతో పంపిన జవాబులో రాశారని కూడా అనుకుంటున్నారు.

ఆశ లేదు ఆస్కారం లేదు
ఫలానారోజు శాపం అఖరౌతుందనే
హామీ లేదు
నిరుద్యోగి వెంకట్రావు నగరం
గుండెలలో సాలీడులా అల్లుకుంటూ ఉంటే
ప్రభుత్వ భవనాలమీద జండా సిగ్గుతో
తల వాల్చుకుంటుంది
అందుచేతనే అందమైన సాయంత్రంవేళ
నగరం అంతటా అపస్వరాలు
వెంకట్రావు నడుస్తున్నంత మేరా
చెట్లు కూలుతున్న దృశ్యాలు....
—అజంతా

ఇస్మాయిల్, డా॥ ఆలూరి విజయలక్ష్మి గోష్ఠిలో పాల్గొన్నారు.

చలం రచయితగా కేవలం తిరుగుబాటు దారుడేకానీ, విప్లవ కారుడుకాదని గోష్ఠిలో పాల్గొన్న వారు అభిప్రాయ పడ్డారు.

x x x

అబ్బూరి రామకృష్ణరావుగారి రాజకీయ, సాహిత్య, నాటక రంగాలలో వారి కృషితో పాలుపంచుకున్న వ్యక్తులు, సంస్థలు - వారి జ్ఞాపకాలు, ఉత్తరాలు, ఫోటోలు, ముద్రితాముద్రిత రచనలు పంపించవలసిందిగా అత్తలూరి నరసింహారావు కోరుతున్నారు. అబ్బూరి వారి జీవితాన్ని గురించి, రచనలకు సంబంధించికూడా వ్యాసాలను సంస్మరణ సంచికకోసం ఈ క్రిందిఅడ్రస్‌కు పంపించవలసిందిగా కోరుతున్నారు.

అత్తలూరి నరసింహారావు
ప్రొఫెసర్స్ క్వార్టర్స్
విశాఖపట్నం - 530003.

x x x

కాకినాడలో సోమంచి సూర్యనారాయణ శర్మ రాసిన" తాతయ్య చెప్పిన కథలు" పుస్తకాన్ని ఆచార్య బి. వి. ఎస్. పాత్రుడు ఆవిష్కరించారు. డా॥ మిరియాల రామకృష్ణ అధ్యక్షత వహించారు డా॥ చిరంజీవినికుమారి డా॥ కనక ప్రవాసి, స్ఫూర్తిశ్రీ, కొండముది శ్రీరామచంద్రమూర్తి ప్రసంగించారు అధ్వర్యం వహించిన కళాంజలి అధ్యక్షులు సంకు గోవిందరాజులు, సోమంచి అనంత పద్మనాభశాస్త్రి స్వాగత నందన సమర్పణలు చేశారు.

x x x

పోతుకూచి సాంబశివరావు ఆధ్వర్యాన జరిగే తెలుగు రచయితల మహాసభలు ఈ ఏడు డిసెంబరులో పశ్చిమ గోదావరి జిల్లాలో సి హెచ్. వి. పి. మూర్తిరాజు అధ్యక్షులుగా ఆహ్వాన సంఘ ఆతిధ్యంలో జరుగుతాయి. పాల్గొన గోరే వారు నవంబరు 15 లోగా ప్రతినిధులుగా పేర్లు "నమోదు" చేయించుకోవాలి.

x x x x

శ్రీకొండముది శ్రీరామచంద్రమూర్తిని ఏలూరు సాహిత్యమండలి అధ్యక్షులుగా ఎన్నుకుంది. మండలి స్వంత భవన నిర్మాణానికి నిధుల సేకరణ తలపెట్టింది.

x e x

ప్రముఖ మళయాళ నవలా రచయిత జర్నలిస్టు పి. సి. కుట్టి కృష్ణన్ (ఉరూబ్ పేరున ఆయన ప్రసిద్ధులు) జూలై 10 న తన 64 వ ఏట కొట్టాయంలో గుండెపోటువల్ల మరణించారు. ఆయన మళయాళ మనోరమ వార పత్రిక సంపాదకులు.

సమీక్ష "భగ్నవీణలూ – బాష్పకణాలూ"

రచన : ముళ్ళపూడి వెంకటరమణ. వెల : రు. 6–50

ప్రచురణ ; నవోదయ పబ్లిషర్స్

గంభీరమైన, ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కలాలు మనకు చాలా తక్కువ ముళ్ళపూడి కలానికి ఒక విలక్షణమైనశైలి ఉంది. హాస్యాన్ని అందిస్తూనే చురకలంటించే గుణం ఉంది అయితే ఇటీవల [1979] వెలువడిన ఈ కథల సంపుటిలో అలాంటి హాస్యంలేదు. హాస్యం కోసం రచయిత చేసిన ప్రయత్నం మాత్రం ఉంది. ఈ సంపుటిలో ఏడు కథలున్నాయి – [కృతజ్ఞత, భగ్నవీణలూ – బాష్పకణాలు, వేట, ఆ చేతి చేత, ప్రయోజకుడు, ఆదోరకం ముచ్చట, సీత.]

ఈ ఏడు కథల్లో కదిలించేవి కృతజ్ఞత, ఆ చేతి చేత–నవ్వు తెప్పించే ప్రయత్నం చేసేవి భగ్నవీణలూ–బాష్పకణాలు. ఆదోరకం ముచ్చట, సీత.

అన్నింటిలోకి పెద్దకథ భగ్నవీణలూ పొడుగాటి వాక్యాలు, సమాసాలు ఈ కథలో పుష్కలంగా ఉన్నాయి. కేవలం హాస్యంకోసం ఇంతేసి పెద్ద వాక్యాలు రాయాలా? ఉదా॥ [భగ్నవీణలూ–బాష్పకణాలూ పేజి 65] "...ఆ ప్రేయసి యొక్క పితృభ్రాత్రాది బహుబల సమన్విత బంధు సందోహోద్భూత దవాగ్ని సదృశ జాజ్వల్యమానా గ్రహానలకారణ సంఘటిత తీవ్రఘటిత శిరస్కుడూ...."

ఇలా మరో మూరెడు సాగుతుంది వాక్యం. అయితే ఈ కథకు ప్రాణం, ప్రయోజనం చివర ఉంది. ఆడపిల్లలను అల్లరిపెట్టే రోడ్డు రోమియోల కథ ఇది. ప్లెటోనిక్ లవర్స్ సంఘం అనే సంఘాన్ని స్థాపించుకుంటారు రోమియోలు. ఆ సంఘ సభ్యులలో ఒకరైన దిలీప్ శ్రీ బాబాయి కూతురు మైథిలి వస్తుంది ఒకరోజు. బీచిలో బఠానీలు నవుల్తూ అన్నకు తనను వెంటాడివేధించే ఓ రామదాసు కథ చెబుతుంది. అప్పుడు దిలీప్ శ్రీకి కోపంవచ్చి "ఎవడేవాడు ?" అని అడుగుతాడు. "ఏం తంతావా వాణ్ణి?" అని ప్రశ్నిస్తుంది మైథిలి, కాకపోతే ఏమిటి మరి?" అంటాడు – నీకు మధుబాల అనేసరోజ తెలుసనుకుంటాను అని అడుగుతుంది. అప్పుడు అర్థమవుతుంది దిలీప్ శ్రీకి–అంతసేపు తానువిన్నది తన కథేనని. అవమానంతో తలవంచుకుంటాడు.

ఈ కథడాంటి మరో ప్రేమకథ 'సీత'కథ. ఇందులోహీరో తన ప్రేయసిని ప్రసన్నురాల్ని చేసుకోవటంకోసం కారున్నా వాడక ఆమె వెంట ట్రామ్‌లో నిలబడి ప్రయాణం చేస్తాడు. బీచ్‌వెంట రోడ్ల వెంట నడుస్తాడు. బస్‌స్టాప్‌లో నిల్చుంటాడు. చివరికి అతడు కారు

నాటికి నేటికి
భారత భూమికి పాడియావునకు
కళ్ళల్లో కాటుక పొగలు–
బుర్రమీ భూకంపం
గుండెల్లో కుతకుత ఉడికే లావా!
—శ్రీరంగం నారాయణబాబు

బయటికి తీస్తేగాని వ్యవహారం కుదరదు–[పేజి నం. 145] స్త్రీ దగ్గరికి పోతే చాచికొడుతుంది. దూరంగా ఉంటేవలచి వస్తుంది అన్న నిరూపణతప్ప ఈ కథకు మరో ప్రయోజనం ఉన్నట్టు కనిపి చదు అప్పు ప్రేమకథల్లాగే ఈ కథల్లోని ప్రేమికులకు ఆకలి దప్పులుండవు, ఈతి బాధలుండవు.

'కృతజ్ఞత'అనే కథ పై రెండు కథల కోవకు చెందినదికాదు. కృతజ్ఞత చూప బోయి కృతఘ్నుడు అనిపించుకున్న ఒక వ్యక్తి ఆవేదనను హృద్యంగా చిత్రీకరించారు రచయిత. కదిలించే మరో కథ నాలుగవ కథ అయిన 'ఆ చేతిచేత' అప్పుతెచ్చి అయినా కొడుకు నోరువిడిచి అడిగిన యాభై రూపాయలు ఇద్దామంటె బయటికి పోడానికి వీల్లేకుండా తండ్రి పంచె, చొక్కా వంటింట్లో దాస్తుంద తల్లి. అవి చేజిక్కించుకునేందుకు తండ్రి వేసిన ప్లాన్లన్నీ తల్లి చేతిలో ఓడిపోతాయి చివరికి ఏలాగో ఆ రూపాయలు సంపాదించి కొడుకు కోడలు ట్రెయిన్‌లో కూర్చున్నాక భార్యకు తెలియకుండా భర్త కొడుకుచేతిలో పెట్టాడు. భర్తకు తెలికుండా భార్య కోడలి చేతిలో పెడ్తుంది. అదీ ఆ చేతి చేత!

ఏడు కథల్లోను ముచ్చటైన అతి చిన్న కథ – 'అదోరకం ముచ్చట.' టికెట్టు కొనుక్కొని సీటు కిందదాక్కొని ప్రయాణం చేస్తాడొక పెద్దమనిషి. అది ఆయన ముచ్చట!

ఈ కథలన్నీ అక్కడక్కడ నవ్వులు చిందించినా సమాజంలోని సమస్యలకు దూరంగా ఉన్నాయేఅన్నవిచారంకలగక మానదు. 'వేట' కథ అప్పుడుమీద నడిచినా అదొక సమస్యను చిత్రీకరించిన కథ అనిపించదు.

బాపుగారి భావ గర్భితమైన ముఖపత్రం ఒక ప్రత్యేక ఆకర్షణ. శ్రీ. సి. రామచంద్రరావుకి ఈ పుస్తకాన్ని అంకితం చేశారు రచయిత.

—పాకాల

శిథిలాలయం

(నవల) కీ శే. గోపీచంద్

వెల : రు. 5 లు

దేశి బుక్ డిస్ట్రిబ్యూటర్స్, విజయవాడ.

మనుషులు మనసుల్లో అనుకున్నవన్నీ ఆచరణలో పెట్టలేరు. కనీసం బైటకన్నా అనగలరా అంటే అదీ లేదు. కారణం ఒకప్పుడు సభ్యత అడ్డమొస్తుంది. ఒకప్పుడు పరిస్థితులొస్తాయి. మరోప్పుడు మరోటి. సరిగ్గా ఇలాంటి దశలో చిక్కుకున్న వ్యక్తే పీతాంబరం.

ఇక నిర్మలాదేవి – నీనాలు, మనసుల్నే కాదు కోరికల్ని కూడా దాచుకొనే ముసుగు మనుషులుకారు.సమాజం మీద, అదేసిన సభ్యత తెర మీద, తిరుగుబాటు చేసి మనసుల్ని, మాటల్లోకి–మాటలను చేతల్లోకి మార్చుకోగల ధైర్యం ఉన్న పాత్రల వేషం వేసిన మనుషులు.

ఈ గతిన్ స్వాతంత్ర్య వార్షిక
దివ మహోత్సవ దీప్తి ఒకటే
సౌధములలో వెలిగి గుడిసెల
యందు కను మూసెన్...

— బూదరాజు

"ప్రతిదానికీ తప్పు తప్పు అనుకుంటూ కూర్చుంటావు, తప్పేమిటి, జీవించు కుంటూ పోక" అన్న సీనామాటకు చిత్రణే నవల.

వ్యవస్థల్లో వచ్చే మార్పులు తెచ్చే మంచి చెడులకు అద్దంపట్టిన నవల 'శిధిలాలయం' గోపీచంద్ దీంట్లో మానసిక సంఘర్షణను చక్కగా చిత్రించాడు. మనసుల్లో పడిన ముడులు - భావాల్లో పడిన చిక్కులు' ఈ శిధిలాలయం వారసత్వాలన్న బైరాగి ముందుమాట నవల కద్దంపడుతుంది. చాలకాలంతర్వాత దాన్ని ప్రచురించిన దశీవారు అభినందనీయులు

— జరీ

చివరకు మిగిలేది

కీ. శే. బుచ్చిబాబు

దేశీ ప్రచురణ వెల : రు. 18 లు.

చాలా కాలం తర్వాత 'చివరకు మిగిలేది' పునర్ముద్రితమైంది బుచ్చిబాబు అత్యుత్తమ సృష్టిగా మాత్రమే కాక (మొదలి వారన్నట్లు) 'తెలుగులో వచ్చిన సమగ్రమైన మనోవైజ్ఞానిక నవల'గా 'చివరకు మిగిలేది'కి ప్రత్యేకమైన స్థానం ఉంది.

ప్రేమకు, దయకు నోచుకోక పోవడం నిజంగా దారుణమైనశాపం." "నిజమైన విషాదం ద్వేషించడం కూడా కాదు... ప్రేమించ లేకపోవడం." "మానవుడికి కావల్సింది మతాలు, దేవుళ్ళు, మొక్కుబళ్ళు, రాజకీయాలు కావు... కావల్సింది దయ— కొంచెం, కాస్తయినా చాలు." కానీ దయానిధికి ఆ రెండు లభ్యంకాలేదు. అందుకే," చీమకుడితేనో, ప్రామోషన్ రాకపోతేనో, సినిమాకి టికెట్లు దొరక్కపోతేనో, ప్రియురాలికి లేఖరాసి, అది అందించడం మర్చిపోయి పోస్టులో వేసినప్పుడో, విచారించడానికి అలవాటు పడిపోయిన వ్యక్తి" 'కాక పోయినా, దయానిధికి జీవితమంతా దుఃఖమే. పెద్దలు చేసిన "పాపా"లకు పిన్నలు శిక్ష అనుభవించి రావడం అమానుషం. గోర్కీ "గొర్దయేవ్" లోనూ, షేక్స్పియర్ "హామ్లెట్"లోనూ, బుచ్చిబాబు "చివరకు మిగిలేది" లోనూ ఇదే అన్నారు.

ఇట్లాంటి క్లాసిక్‌ను పునర్ముద్రించినందుకు దేశీ వారిని అభినందించవలసిందే. అలాగే, అందమైన భావస్ఫోరకమైన ముఖచిత్రం అలంకరించిన బాపును కూడా.

— వాణి

కలలనిజం నీ కోసం దారులన్ని సరిచేస్తున్నది
హర్షాగమ నవ వర్షాగమ వేళలలో జాగదేమి
సరిత నిన్ను పిలుస్తోంది-విను-స్వాతంత్ర్యపు శంఖధ్వానం
రా ఇక మనిషీ- స్వాతంత్ర్యం మనకోసం విరిచింది రణ ధనస్సు
అన్నులతో పన్నులతో
స్వేచ్ఛలేక కుళ్ళిన జీవితాల
కట్టుబాళ్ళ తొలకరిగా రావెందుకు ? —ఏ.సు

సాహిత్యంలో కొత్త ధోరణి (8 వ పేజీ తరువాయి)

అయితే ఈనాడు కవితారంగంలో మరో సరికొత్త 'కలగా పులగం.' జరుగుతోంది. ఇందులో మరో ప్రమాదకరమైన అంశం కూడా వుండింది. ఇది ఆ నాటి భావ - అభ్యుదయ వాదుల స్నేహ వాత్సల్య స్వరూపంతో పోల్చదగింది కాదు. ధోరణి అదే అయినా ఫలితం వక్ర మార్గంలో పడే ప్రమాదంవుంది. దీనికి కారణం (1) పెరుగుతున్న బూర్జువా వర్గ సంబంధాల ఆర్థిక, సామాజిక అరాచకత్వం (2) ఈ ధోరణికి బాధ్యులైన వ్యక్తుల అరాచక, రాజకీయ అభిప్రాయాలు. ఈ వ్యవస్థలోని వర్గ సంబంధాల, ప్రజాశ్రేయ పుణ్యమా అని శుద్ధ కళావాదం, ("శుద్ధ కళా వ్యతిరేక వాదం") మళ్ళాతల యెత్తుతోంది. ఇది గతంలోని 'కళకళ కోసమే' అనే అన్నంత మూర్ఖంగానూ, 'పరిశుద్ధం' గానూ లేదు. దీనికి మెలిముసుగు లున్నాయి. ప్రజలకోసమన్న పుణ్యముడువుంది విప్లవమన్న వేషమూ అక్కడక్కడా కనిపిస్తుంది అందుకే రాజకీయ దుందుడుకు వాదాలకు కూడా ఇందులో ప్రధాన పాత్రవుంది. ఈ తీవ్ర వాదులకు చెవులుంటాయి. కళ్ళుండవు. కలాలకి బదులు తుపాకులతో రాస్తారు. కాగితాన్ని చించి కవిత్వంగా చిత్రీకరిస్తారు. అసహనంతో కూడిన హృదయమే తప్ప బుర్రలుండవు. మొత్తంగా వీరిని కలగలిపితే వారి లక్షణాలు ఈ విధంగా వుంటాయి. (1) రాజకీయ తీవ్ర వాదం ధ్వనింపజేయటం (2) మార్క్సిజం (మావోయిజంతో సహ) అనే ఓ అమూల్య పదార్థం-దానికి ఆచరణతో నిమిత్తం లేదని భావించటం (3) ఉద్యానవనంలోని యూకలిప్టస్ చెట్లకు చైతన్యం పూలు పూయించడం-తుపాకుల కాయలు కాయించడం. (4) సర్వ విధ్వంసక వాదాన్ని ప్రేరేపించడం (5) మానవత్వానికి కన్నీరే తప్ప స్వేదంతో పనిలేదనటం (6) శాస్త్రీయ సామ్యవాది అన్నవాణ్ణి పిరికివాడు అనటం (7) రొమేంటిసిస్టు ధోరణిలో మార్క్సునూ, ఫ్రాయిడ్‌నీ ఇమేజరీనీ, సింబాలిస్టు ధోరణులనీ కలగా పులగంగా వాడేయడం - కాదన్న వాణ్ణి తిట్టేయటం స్థూలంగా ఈ సప్త సూత్ర ప్రణాళిక వాళ్ళది. ఈ హాని ర ధోరణిని అభ్యుదయ రచయితలు గమనించాల్సిన అవసరంవుంది. ఈ ధోరణిని పనిగట్టుకొని ప్రచారం చేస్తున్న

ప్రజాకోటి నడిపించే నరుని రథం కదిలింది
అన్నానికి అయిదూళ్ళను
ఇమ్మని ప్రార్థించినట్టి ధర్మజుణ్ణి సోదరులను
బానిసలై బతకమన్న దుర్యోధన
దుశ్శాసన దుష్ట శకుని పన్నాగం
కురుక్షేత్ర సంగ్రామం చీల్చుకుంటు
పోతున్నది నరుని రథం పోతున్నది — రెంటాల

వాళ్ళలో గుంటూరు శేషేంద్ర శర్మ, వేగుంట మోహనప్రసాద్, ఇస్మాయిల్, నగ్నముని ప్రభృతులు ముఖ్యులు. వీరి కవితల్లో పైన చెప్పబడ్డ సూత్రాల సారం జాగ్రత్తగా పరిశీలిస్తే, విరసం వాసనలూ, హృదయ వాదపు ఛాయలు, పాశ్చాత్య సాహిత్య ప్రభావం బాగా గోచరిస్తాయి. వీరింకా వారి వాదనల్ని ఉద్యమ స్థాయికి తీసుకువెళ్ళలేదు కాని – అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. నిరాటంకంగా ఈ ధోరణిని కొనసాగనిస్తే, ఇది ఓ ఉద్యమంగా స్థిరపడే అవకాశాలున్నాయి.

ఈ గందరగోళపు, క్షీణవాదంపై అభ్యుదయ రచయితలు వ్యక్తిగతస్థాయిలోనూ, ఉద్యమస్థాయిలోనూ తీవ్రమైన తాత్విక పోరాటం జరుపవలసిన ఆవశ్యకత వుంది. అందుకు నాందిగా అభ్యుదయ రచయితలు తమ సిద్ధాంత, సాహిత్య అధ్యయనాన్ని తీవ్రం చెయ్యాలి.

అయితే వీరి వాదాల్ని తిరస్కరించేముందు వారితో అభ్యుదయ రచయితలకున్న "సత్సంబంధాల" నికూడా గుర్తు చేసికోవాలి. ముఖ్యంగా ఈ కవులందరిలో వున్నది గొప్ప శిల్ప చాతుర్యం. వారివి కొత్త గొంతులు. సమకాలీన అంతర్జాతీయ సాహిత్యంతో వీరికున్న విస్తృత పరిచయం, అధ్యయనం, అధికారం, విషయాన్ని ప్రజలకు విసుగు కలిగించకుండా 'ఫోర్సు'తో చెప్పే నైపుణ్యం. మౌలికంగా 'మార్క్సిజం'ను అంగీకరించే తత్వం. రొమాంటిక్ రెబెల్స్‌గానైనా విప్లవాన్ని ఆహ్వానించడం. పాతని తిరస్కరించే ధోరణి. కాని అనుభూతుల ప్రదర్శకులు. అందుకే వారితో పోరాటం జరిపేప్పుడు అభ్యుదయ రచయితలు వారివి శత్రువులుగా భావించక – వక్ర బుద్ధులుగా మాత్రమే గుర్తించాలి

వీరి అనుభూతి వాదంలోని శృతిమించిన ఆత్మగీతాలాపనను నిరసించాలి. శైలిలోని (సర్రియలిస్టు, డడాయిస్టు లాంటి) రీతి వాదాల్ని తిరస్కరించాలి. రొమాంటిక్ తీవ్రతను గర్హించాలి విధ్వంసక రాజకీయ ప్రేలాపనలని ఖండించాలి. మార్క్సిజంని స్వప్నావస్తలో వలవరిస్తూ దానికోసం పోరాడే సమకాలీన విప్లవకారులపైన, సమాజ శ్రేయస్సుకోసం కలం బట్టిన కవులను తూలనాడేప్పుడే, వీరి హాస్యకర ధోరణిని ఎత్తి చూపాలి. మార్క్సిజం వేరు. మార్క్సిస్టులు వేరు అనుకొనే పరిహాసాస్పదమైన వారి వాదమే నేటి సాహిత్యంలో సరికొత్త ధోరణి.

[illegible] and Published by T Venkataramaiah, 3-6-737/3, Himayatnagar, Hyd-2